5

# కళామూర్తి
# కొండపల్లి శేషగిరిరావు

మనిషి



1924 - 2012

తెలంగాణ రిసోర్స్ సెంటర్
హిమాయత్‌నగర్, హైదరాబాద్
2013

# కళామూర్తి - కొండపల్లి శేషగిరిరావు
# Kalaamoorthy - Dr. Kondapally Sheshagirirao


| | | |
|---|---|---|
| ప్రచురణ కాలం | : | జూన్, 2013 |
| Edition | : | June, 2013 |
| ప్రచురణ | : | తెలంగాణ రిసోర్స్ సెంటర్, హైదరాబాద్ |
| Published by | : | Telangana Resource Centre, Hyderabad. |
| ప్రచురణ కర్త | : | **ఎం. వేదకుమార్,** చైర్మెన్, తెలంగాణ రిసోర్స్ సెంటర్ |
| Publisher | : | M. Vedakumar, Chairman, Telangana Resource Centre |
| సంపాదకులు | : | **బొనకుర్తి సోమేశ్వర్,** కో-ఆర్డినేటర్, తెలంగాణ రిసోర్స్ సెంటర్ |
| Editor | : | Bonakurthy Someshwar, Co-ordinator, Telangana Resource Centre |
| ప్రతులకు | : | **తెలంగాణ రిసోర్స్ సెంటర్** |

"చంద్రం" 490, స్ట్రీట్ నెం. 11, హిమాయత్‌నగర్, హైదరాబాద్.
trchyd@gmail.com; Mobile : 9030626288
www.trchyd.org
దిశ పుస్తక కేంద్రం • సహచర బుక్‌మార్క్ • నవోదయ బుక్ హౌస్

వెల : **రూ. 25/-**

Printed at :
DECCAN PRESS Azamabad, Hyderabad. Ph.+91-040-27678411
e-mail : deccan.press@yahoo.com

# కళామూర్తి

# కొండపల్లి శేషగిరిరావు



కీ॥శే॥ కొండపల్లి శేషగిరిరావు – కమలాదేవి


TELANGANA
RESOURCE CENTRE

తెలంగాణ రిసోర్స్ సెంటర్

హిమాయత్‌నగర్, హైదరాబాద్

# విషయ సూచిక

**ప్రచురణకర్త మాట :**


చిత్రకళా ప్రతిభాశాలి డా॥ కొండల్లి శేషగిరిరావు ...... వేదకుమార్. యం ..................... 3


**ముందుమాట :**


కళలోని జీవకళ కలకాలం ఉండాలనేవారు ........... కొండపల్లి వేణుగోపాల్‌రావు........... 4

'అమ్మ'కు బ్రహ్మ ........................................... కొండపల్లి నీహారిణి .................... 8

కళాస్రష్ట కొండపల్లి శేషగిరిరావు ....................... ముదిగంటి సుజాతారెడ్డి ............. 13

కొండపల్లి శేషగిరిరావు 'ది ఓరియంటలిస్ట్'.......... ఎస్. జగన్ రెడ్డి ...................... 22

'కొండపల్లి' రంగుల దుర్గం అనితరం .. అసాధ్యం .... వార్త ఎడిటోరియల్ ................. 25

బొమ్మల కొండపల్లి! ....................................... పాఠక్ ................................ 27

కొండంత భాగ్యం.... శేషగిరిరావు ..................... శివాజీ .............................. 29

ప్రాచ్య చిత్రకళ జీవనాడి: 'కొండపల్లి'.................. జయధీర్ తిరుమలరావు ............ 32

ప్రాచ్య చిత్రకళకు ప్రతీక .. .............................. భరత్‌భూషణ్ ....................... 36

కొండంత చిత్రకారుడు .................................... నమస్తే తెలంగాణ.................. 39

దాశరథి స్పందన ........................................... దాశరథి............................... 43

కుంచె సామ్రాజ్య మహారాజు ............................ మోహన్ ............................. 47

ప్రముఖుల పోర్ట్రయిట్స్‌తో పలకరించే .................. డా॥ వాసిలి వసంత్ కుమార్ ....... 50

ప్రకృతిమాత ఆరాధకుడు కొండపల్లి శేషగిరిరావు...... టి. వెంకట్రావ్ ...................... 53

మన దేశం గర్వించదగిన చిత్రకారులు ................. డా॥ బి.డి.ఆర్. ....................... 56

ఆ కుంచెకు ఎన్నెన్ని వయ్యారాల................. ...... ప్రతాప్............................... 59

అద్వితీయ సంపన్నుడు కొండపల్లి శేషగిరిరావు ........ దేవులపల్లి ప్రభాకరరావు ............ 61


**అనుబంధం :**


కళా స్రష్టలకు నివాళి....................................... విశాలాంధ్ర ......................... 70

ప్రచురణకర్త మాట

# చిత్రకళా ప్రతిభాశాలి డా॥ కొండపల్లి శేషగిరిరావు

కళాతపస్వి డా॥ కొండపల్లి శేషగిరిరావు గారు చిత్రకళా రంగానికి వన్నె చేకూర్చిన మహనీయులు. వరంగల్ ప్రాంతానికి చెందిన వ్యక్తిగా ఆయన పల్లె వాతావరణాన్ని, పర్యావరణాన్ని ఎంతో ప్రేమించారు. ప్రకృతి మానవుడిపట్ల ఆకర్షితుడై, చిత్రకళలో తనదైన ముద్రవేశారు. విద్యార్థి దశలో ఉన్నప్పుడు వేయిస్థంభాల గుడిని సందర్శించడం, శిల్పాలను, ప్రతిమలను వాటి అలంకరణను చూసి పరిశీలించి, కాకతీయ శిల్ప సంపద, నాగార్జున కొండ, కొలనుపాక, అమరావతి, ఎల్లోరా, లేపాక్షి తదితర చారిత్రక కట్టడాలు అన్నింటిని చిత్రించారు. ప్రకృతిని, సంప్రదాయాలను, సందర్శించిన ప్రసిద్ధ స్థలాలు, గోపురాలు, బౌద్ధఆరామాలు, నదులు, సరోవరాలు స్వయంగా చూసి, అనుభూతిపొంది, ఆయన అనుభవాలను రంగులతో అద్భుతమైన చిత్రాలు వేశారు. ప్రకృతిలోని దృశ్యాలను అద్భుతంగా చిత్రంచడంలో ఆరితేరిన శేషగిరిరావుగారు కళాత్మక దృష్టితో కొండలు, గుట్టలేకాక బండరాళ్ళకు సహితం చక్కని ఆకృతిని దాల్చేలా చిత్రించారు. సౌందర్యాన్ని అద్భుతంగా అభివ్యక్తీకరించడం శేషగిరిరావు కుంచెకు సర్వసాధారణం. మరోవైపు తెలంగాణ ప్రాంతంలో కనుమరుగవుతున్న కళా సాంప్రదాయాలలో కాకి పడిగెలు ఒకటి. అలాంటి కాకిపడిగెలు పటాలు సేకరించారు. అదేవిధంగా నెహ్రూ, ఇందిరాగాంధీ, టంగుటూరి ప్రకాశం పంతులులాంటి ప్రముఖుల పోర్ట్రైట్స్ వేశారు. ఆయన కేవలం చిత్రకారుడేకాదు, మంచి రచయిత, గొప్ప మనసున్న మహానుభావుడు.

కళను ఎంత ప్రేమించాడో తన కుటుంబ బాధ్యతలను కూడా పరిపూర్ణంగా నిర్వహించి అద్భుతమైన వ్యక్తిగా ఆదర్శప్రాయుడిగా నిలిచారు.

మా సోదరుడు బి. నర్సింగరావుగారు కూడా చిత్రకారుడు కావడంతో శేషగిరిరావుగారిని చాలా సందర్భాలలో కలవడం జరిగింది. వయస్సులో చాలా తేడా ఉన్నా, ఆయన నాతోను చాలా ఆప్యాయంగా ఉండేవారు. అది నన్ను బాగా కదిలించింది. అదే నన్ను ఆయనపై అభిమానాన్ని పెంచింది. చిల్డ్రన్స్ అకాడమీ నిర్వహించిన, ఆర్ట్ క్రాఫ్ట్స్ ఎగ్జిబిషన్‌ను వారిచేత ఆవిష్కరించటం జరిగింది. అప్పుడు వారు మాతో వారి చిన్ననాటి రోజులను గుర్తుకు తెచ్చుకున్నారు. ఆయన మరణం మమ్మల్ని కలచివేసింది.

ఆరోజుల్లోనే "కళ"ను వృత్తిగా ఎన్నుకొని, వాటిపై పూర్తిస్థాయిలో ప్రఖ్యాతినిపొంది, ఆ రంగంలో విద్యార్థులను ప్రతిభావంతులను చేశారు. సమాజంపట్ల సామాజిక బాధ్యతతో మానవుల యొక్క జీవితాలను చిత్రించారు. ఆయన సేవలను గుర్తించిన పొట్టిశ్రీరాములు తెలుగు యూనివర్సిటి 1996లో గౌరవ డాక్టరేట్‌తో గౌరవించింది. అంతేకాకుండా ఆయన చిత్రాలు నేషనల్ ఆర్ట్ గ్యాలరీలలోను మరియు ముఖ్యమైన ఆర్ట్ కలెక్టర్స్ వద్ద చోటు చేసుకున్నవి. నిరంతరం శ్రమించి చేసిన కృషిని, సేవలను, ఆయన వ్యక్తిత్వానికి సంబంధించిన వ్యాసాలను ఈ పుస్తకంలో ప్రచురిస్తున్నాం.

**వేదకుమార్.ఎమ్**

చైర్మన్, తెలంగాణ రిసోర్స్ సెంటర్

ముందు మాట

# కళలోని జీవకళ కలకాలం ఉండాలనేవారు

వేళకు చాలా విలువిచ్చి ఒక నియమబద్ధమైన జీవితాన్ని గడిపిన శేషగిరిరావుగారు నేటి తరాలవారికైనా, రేపటితరాలవారికైనా ఆదర్శనీయులే. అందుకే సమాజ శ్రేయస్సును ఆశించే కొందరు ఇట్లాంటి మేధావులు, సేవకులు, సంస్థలు ఆదర్శ పురుషుల జీవిత విశేషాలను వెలుగులోకి తెస్తుంటారు. ఏవ్యక్తి అయినా తాను నమ్ముకుని బ్రతికే వృత్తిపట్ల అభిమానం, అనురక్తి కలిగి ఉండాలని చెప్పిన శేషగిరిరావుగారి నుండి స్ఫూర్తి పొందాలనే రస హృదయులైన పాఠకుల చేతుల్లో ఈ పుస్తకం ఉంది.

శేషగిరిరావుగారు కళా తపస్వి–చిత్రకళ ఆయన ఊపిరి. ఎన్నో చిత్రాలు ఆయన కుంచె నుండి వర్ణరంజితంగా రూపుదిద్దుకున్నవి. ఆయనకు మోకరిల్లినాయి. సప్త వర్ణాల సోయగాలు బంధించి సుందరతర బొమ్మలు, సాంప్రదాయ, పౌరాణిక, సాంఘీక, సామాజిక నేపథ్యంతో కన్నుల విందుచేసేందుకు వెలిశాయి. అవును! రాముడు, కృష్ణుడు, శివుడు, ముగ్గురమ్మల మూలపుటమ్మలు, మహాకాళీ, లలితాంబ, వనదుర్గలేకాదు వినాయకుడు, ఆంజనేయుడు దర్శనమిస్తారు వారి చిత్రాల్లో. గోదాదేవి, శకుంతల, దమయంతి, వరూధినివంటివారంతా శేషగిరిరావుగారి కుంచెనుంచి వెలువడినవారే! తెలుగు భాషామతల్లి, సుందర, సౌభాగ్యతరంగా రూపమిచ్చి అమ్మకు బ్రహ్మ అయ్యారు. విద్యారణ్యుడు, శివాజీ, రవీంద్రుడు....ఎవరు? ఎవరు? ఆయన చిత్రాల్లో ఒదిగిపోలేదు? చిత్రకథా వస్తువులుగా గ్రహించిన పాత్రలన్నీ సజీవంగా కలకాలం ఉండిపోవు ఆదివాసీల ఆనంద నృత్యమైన థింసాను చిత్రంగా వేసినా, అడవి పుత్రులను వేసినా, భూమి పుత్రులను వేసినా ఆయనకు ఆయనె సాటి. అందాలు, ఆనందాలేకాదు, ఉద్యమాలు, పోరాటాలుకూడా మనల్ని గతాన్ని మరచిపోనివ్వవు. ఇటు తెలంగాణా సాయుధ పోరాటం, అటు జాతీయ పోరాటం రెండూ కాన్వాస్‌పైకెక్కినవి. ఎందరో మహానుభావుల, రాజకీయవేత్తల పోట్రయిట్స్ ఆ వ్యక్తులు అక్కడ ఉన్నారా అని అనిపించేంత సహజంగా దర్శనమిస్తారు. అంతేనా పక్షులు, జంతువులు, రాళ్ళు, మోళ్ళు ఏవి? ఏవి నోచుకోలేదు ఆ భాగ్యానికి? సరస్సుల సోయగాలైనా, పర్వతాల గంభీరత్వమైనా, వేళ్ళ ఆలోచనాలాలిత్యమైనా ఏదో ఒక అద్వితీయ భావ సంపన్నతతో అలరారేవే! కాళిదాసు శాకుంతలకు పురుడుపోసిన వీరి కుంచె

నన్నయ్యకు, పోతన్నకు కూడా రూపమిచ్చింది.

శేషగిరిరావుగారు ఏదైనా బొమ్మ వేశారంటే దానికీ పరమార్థముండి తీరాల్సిందే! 'సేకరాక్స్' అనే ఉద్యమాన్ని చిత్రాల ద్వారా తీసుకొచ్చి పర్యావరణానికి ప్రాణమైన కొండలు, గుట్టలు, చెట్టు, చేమల పక్షాన నిలబడ్డారు. గ్రామీణ వాతావరణం కలుషితం కావద్దని పల్లె దృశ్యాలను చిత్రించారు. అయినా ఈ పుస్తకం వేస్తున్నామంటే మా అభిప్రాయం చెప్పడానికి వ్రాస్తున్న ఈ మాటలన్నీ మా కలం నుండి కాదు హృదయం నుండి, మేం చూసిన మా ఇంటి పరిసరాల నుండి, శేషగిరిరావుగారు నడయాడిన నేలనుండి అట్లా అక్షరీకరింపబడ్డున్నవే! హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న దోమల్‌గూడలో వారి నివాస గృహం. పెద్ద కుటుంబం, కొడుకులూ, కోడళ్ళు, బిడ్డ, అల్లుడు, మనవలు, మనవరాళ్ళు, అన్నింటినీ మించి ఆయన బొమ్మలు అన్ని...అన్నీ ఉన్నా ఆయన అర్ధాంగి తనకంటే ముందే పైలోకాలకు వెళ్ళిపోయిందనే దుఃఖపూరిత జీవితంలో ఆయన ఉండలేకపోయారు. భరింపలేకపోయారు. జ్ఞాపకంలోను, మతిమరుపులోను ఆమెను గురించి స్మరణ! బహుశా అంత అకస్మాత్తుగా నడుస్తూ వెళ్ళి కారులో కూర్చొని ఇప్పుడెందుకు పోవాలిరా? ఎందుకు తీసుకెళ్తున్నావురా? అంటూ మాట్లాడ్తూ హాస్పిటల్‌కు వెళ్ళి మౌన శిలలా వెనక్కి అర్థగంటలో నిర్జీవులై వచ్చారు. మమ్మల్ని

దుఃఖసాగరంలో పడవేసి, మాకు పెద్ద దిక్కులేకుండా చేశారు.

ఆయన సంతానంగా మేం చేయగలిగినంతా చేశాం. 2004లోనే అద్భుతమైన చిత్ర ప్రదర్శన లలితకళా వేదిక ఆర్ట్ గ్యాలరీలో ఏర్పరిచాం. వారి జీవన విశేషాలన్నీ క్రోడీకరించి, చిన్న ఫిల్మ్ తీసి వారి మనమరాలు దీప్తి ఆనాడు ఒక సభ ఏర్పాటు చేసి తన వ్యాఖ్యానంతో ఆహుతులను అలరించింది. 2007లో కళాభవన్‌లో వారం రోజుల చిత్రకళా ప్రదర్శన ఏర్పాటు చేయగా పిల్లల నుండి వృద్ధుల వరకు కళాభిమానులు వచ్చి చూశారు. అప్పుడు వచ్చినవాళ్ళు చాలామంది తమ అభిప్రాయాలను పుస్తకంలో వ్రాసి వెళ్లారు. అవి మాకు మరింత స్ఫూర్తినిచ్చాయి. ఆ ప్రారంభోత్సవ సభలో మేం తీసిన డాక్యుమెంటరీని విడుదల చేశారు. నయనానందకరంగా శ్రవణానందభరితంగా ఉన్న ఆ డాక్యుమెంటరీ బహుశా మనరాష్ట్ర చిత్రకళా జగత్తులో ప్రథమ డాక్యుమెంటరీ అని చెప్పవచ్చు.

ఒక జాతీయ చిత్రకారుని హోదాలో ఉన్న ఆదర్శవాది, మార్గదర్శకులు శేషగిరిరావుగారి జీవిత చరిత్రను రచించి వారి కోడలుగా కొండపల్లి నీహారిణి జాతికొక సందేశాన్ని అందించింది. శ్రమైక జీవన సౌందర్యాన్ని అలవోకగా, ఆనందంగా గ్రోలిన మామగారి బ్రతుకు చిత్రం పదిమందికి మార్గదర్శకం కావాలనీ, స్ఫూర్తిదాయకం కావాలనీ

వారు వ్రాసిన రకరకాల వ్యాసాలను కూర్చి 'చిత్ర శిల్పకళా రమణీయకము' అనే పుస్తకాన్ని ప్రచురించింది. ఈ రచనలు చిత్రకళా పిపాసులకే కాదు, సాహిత్యాభిమానులకు ఆనందాన్నిచ్చేవే! సంస్థలు పూనుకొని, ప్రభుత్వం ముందుకొచ్చి చేసే పనులు మానవమాత్రులం – ఏం చేయగలం? అయినా ఇంకా ఏదో చెయ్యాలని అనుకుంటున్న, ఎడారి తచ్చాడే మా మనసులపై చల్లని నీరు చిలకరించినట్లు ఈ చిన్ని పొత్తం మహా గొప్పది.

శేషగిరిరావుగారు పరలోకగతులైన సందర్భాన అన్ని పత్రికలూ నివాళులిచ్చాయి. "ఓ చిత్రకారుడా! ఓరుగల్లు ఖ్యాతిని నయాగరా వరకు ప్రబహింపచేసిన మొనగాడా! అక్షరం ఉన్నంతకాలం రంగులు విరజిమ్మినంతకాలం మీ బొమ్మలు కొంగు బంగారమే, నిత్యం సింగారమే" అంటూ వార్త దినపత్రిక, "దామెర్ల, వరదా, అడవీ, మా గోఖలే, రాజాజీ వేసిన చిత్రాలకూ కొండపల్లివారి బొమ్మలకూ తేడాలకన్నా పోలికలే ఎక్కువ అంటటూ, జానపద, చారిత్రక, పౌరాణిక గాథలనే మూలాలుగా తీసుకొని బొమ్మల్లోకి అనువదిమచడమనే ప్రక్రియలో వీరికి సాటి ఎవరూ లేరనే చెప్పాలి" అని పాఠక –సాక్షి దినపత్రిక, "శాంతాకారం ప్రశాంత నిష్క్రమణం ఆయనది–కొండంత భాగ్యం శేషగిరిరావు" అని శివాజీగారు –సాక్షి, "గుప్పున వెలిగి చప్పున చల్లారే నిప్పుకాదు కొండపల్లి. తీసినకొద్దీ అతని శ్రమ వెలుగులోకి వస్తుంది, అతని లేని లోటు తీర్చేవారు లేరంటే అతిశయోక్తి కాదు" అని జయధీర్ తిరుమలరావు–ఆంధ్రభూమి దినపత్రిక;"జాతీయ భావాల వ్యక్తీకరించడానికి చిత్రకళను ఆశ్రయిస్తానని ఆనాడే గాంధీకి చెప్పాడు కొండపల్లి. కొండపల్లికి నివాళూలర్పించడానికే పరిమితం కాకుండా కళాకారులకు భద్రమైన జీవనం కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలె" అంటూ కొండపల్లి రాజయ్య, పి.టి.రెడ్డి లాంటి ప్రముఖుల చిత్రాలకు తగిన రక్షణ కల్పించేలా ప్రభుత్వం ముందుకురావాలన్న అభిప్రాయాన్ని చెప్పకనే చెప్పారు" అంటూ నమస్తే తెలంగాణ సంపాదకీయంలో వ్రాశారు.

"తెలుగు సమాజం ఓ కళాపితామహుడ్ని, సృజననూ కోల్పోయింది. ఆయనకు నివాళులు అంటూ, ప్రాచ్య చిత్రకళకు ప్రతీక అంటూ కొండపల్లి వారి గురించి భరత్ భూషణ్‌గారు; అక్కడ తలెత్తితే ఆలోచనలు రేకెత్తుతాయి, భావాలు పరవళ్ళు తొక్కుతాయి అంటూ శేషగిరిరావుగారు వేసిన పోర్ట్రయిట్స్‌లోని వ్యక్తులు పలకరిస్తున్నారా అన్నట్లుంటాయని డా॥వాసిలి వసంత్‌కుమార్‌గారు అన్నారు. ప్రకృతిమాత ఆరాధకుడు అంటూ టి. వెంకట్రావుగారు, విశాలాంధ్రలో "ఆయన గతకాలంలోనే జీవిస్తారని చెప్పలేం–వర్తమాన కాలంలో కూడా జీవిస్తారు" అని అన్నారు. తెలంగాణ కాకిపడగలు, రామప్ప దేవాలయ విశిష్టత తన కుంచెలో హృద్యంగా చిత్రించిన తొలి చిత్రకారుడైన

కళాస్రష్టకు నివాళి అని విశాలాంధ్ర పత్రిక సంపాదకీయంలో వ్రాశారు. "ఆ కుంచెకు ఎన్నెన్ని వయ్యారాలో... అంటూ భారతీయ ఇతిహాసాలను చిత్రిక పట్టడంలో శేషగిరిరావుది అందె వేసిన చేయి...ఆయన భౌతికంగా లేకపోయినా ఆయన సృష్టించిన రమణీయ చిత్రాలను సృష్టించిన అద్వితీయ సంపన్నుడు కొండపల్లి శేషగిరిరావు అంటూ ప్రజాతంత్రలో దేవులపల్లి ప్రభాకర్‌రావుగారు వ్రాశారు. ఇట్లా ఎన్నో... ఎన్నెన్నో పొగడ్తలు! ఎందరినుండో ప్రతిభా పాటవాలకు పట్టంకట్టే మాటలు!! అందరికి మా కుటుంబం తరఫున కృతజ్ఞతలు.

శేషగిరిరావుగారి హృదయమంతా పరుచుకున్న తెలుగు భావన, సంప్రదాయ సంస్కరణా భావన మన అందరి హృదయాలలో నిండుకోవాలి. వందల సంఖ్యలో ఉన్న ఆయన చిత్రాలకు ప్రత్యేక స్థానాన్ని ఇచ్చి మన జాతి గౌరవాన్ని నిలుపుకోవాలి. తెలంగాణా రిసోర్స్ సెంటర్ వారు ఈ పని చేస్తున్నందుకు, పుస్తకరూపేణా అచ్చువేస్తున్నందుకు ఏంతైనా అభినందనీయులు

**– కొండపల్లి వేణుగోపాల్‌రావు, నీహారిణి**



*గీత నా ప్రాణపల్లవి*
***కాంతి కల్పనా క్రాంతి పథము***
***దృక్కు దృశ్యము అమృత దీపమ్మువిచట***
***మధ్య శూన్యంబు రూప ప్రస్థానయాత్ర***

27.07.1975 నాడు శేషగిరిరావు స్వయంగా తన ముఖచిత్రాన్ని స్కెచ్‌గా వేసుకుని ఈ గేయాన్ని రచించారు. అద్దంలో తన ప్రతిబింబం చూస్తూ వేసిన రేఖా చిత్రం అత్యంత సహజంగా చిత్రించారు. ఈ చిత్రాన్ని ఈ పుస్తకానికి ముఖ చిత్రంగా అందిస్తున్నాము.

# ‘అమ్మ’కు బ్రహ్మ

అమ్మకు రూపాన్నిచ్చే అవకాశం బిడ్డకు వస్తుందా.... సకల చరాచర సృష్టిలో అసంభవం కదా ఇది. కానీ ... ‘మాట’నే మాతృమూర్తిగా కొలుచుకుంటున్న తెలుగు వారికి ఆ అదృష్టం దక్కింది. అజరామరమైన అజంత భాషను అమ్మగా భావించి తెలుగింటి సంస్కృతినే ఆమె నుదుటి తిలకంగా ఊహించి...అచ్చతెలుగు సాంప్రదాయంలో ఆమెకు కట్టుకట్టి, ప్రసన్న రూపాన్నిచ్చి, భాషా ప్రపంచంలోనే మా తల్లి ‘మతల్లిక’ అని గర్వంగా చెప్పుకుంటున్నాం. మనందరి హృదయాగ్రపీఠాలపై ప్రతిష్ఠితమైన ‘తెలుగుతల్లి’కి తొలిసారి రూపునిచ్చింది.... విఖ్యాత చిత్రకారులు కొండపల్లి శేషగిరిరావు.

మొట్టమొదటి ప్రపంచ తెలుగు మహాసభలకు తెలుగు వారు సన్నద్ధులవుతున్న సమయమది. 1975వ సంవత్సరం. అప్పుడే... తెలుగుతల్లికి ఓ రూపాన్నివ్వాలన్న ఆలోచన తెలుగు సాహితీ పెద్దలకు వచ్చింది. ప్రభుత్వమూ దానికి అంగీకరించింది. అమ్మకు ప్రాణం పోసే బాధ్యతను ప్రఖ్యాత చిత్రకారుడు కొండపల్లి శేషగిరిరావుకు అప్పగించారు. దేవులపల్లి రామానుజరావు, గోపాలస్వామి, దాశరథి, సి. నారాయణరెడ్డి వంటి సాహితీవేత్తలతో చర్చించి...తెలుగుతల్లి చిత్రాన్ని చిత్రించారు శేషగిరిరావు. తెలుగు కట్టుబొట్టు ప్రతిఫలించేలా, తెలుగు గడ్డ విశిష్టత గోచరించేలా ‘అమ్మ’ ప్రసన్న రూపాన్ని తీర్చిదిద్దారు. ఆ తర్వాత జరిగిన కొన్ని పరిణామాల కారణంగా ఆ చిత్రాన్ని ‘తెలుగుతల్లి’కి రూపంగా ప్రభుత్వం స్వీకరించలేదు. కానీ, తెలుగుతల్లి అన్న భావనకు ఆకృతినిచ్చి మొదటిసారి తెలుగువారి కళ్ళముందుకు తెచ్చిన ఘనత మాత్రం కొండపల్లివారిదే. అదే కాదు మరెన్నో అద్భుత చిత్రాలతో అంతర్జాతీయ ఖ్యాతి పొందిన చిత్రకారుడాయన. ప్రకృతి ఒడిలోని రసవాహినులను తన అంతరంగ ఊహల్లో మిళితం చేసి, అవి చిత్రాలుగా జాలువార్చిన కుంచె శేషగిరిరావుది. ప్రకృతిని జగన్మాతగా భావించి, అద్భుత వర్ణాలలో ప్రతిబింబించి మనకందించారాయన. ‘మానస సరోవరం నుంచి ఎగిరివచ్చిన రాజహంస నలదమయంతులకు ప్రేమ సందేశాన్ని అందించి, ఓరుగల్లు కోటలోని కాకతీయ ద్వారబంధంపై వాలి, శిలారూపం ధరించింది. తెలంగాణ మొదలుకొని కోస్తా, రాయలసీమలోని గృహకుడ్యాలు, ద్వారబంధాలపై, వివిధ లోహ పాత్రలపై ప్రతిబింబించి

తెలుగువారంతా ఒకటేనన్న ఐక్యతా సందేశాన్ని ఇంటింటికీ అందజేసింది' అనే ఏకత్వ భావాన్ని వ్యక్తపరచగలిగిన స్వచ్ఛమైన చిత్రకారుడు కొండపల్లి శేషగిరిరావు. దాదాపు భారతదేశమంతా తిరిగి చూసి ఆయా సంస్కృతులనీ, ఆయా శిల్పసంపదలనీ తన చిత్రాల్లో బంధించారు. భారతీయ చిత్రశైలిలోని ప్రత్యేకతను వందల సంఖ్యలో రేఖాచిత్రాలుగా, వర్ణ చిత్రాలుగా చిత్రించారు. ఆయన గీసిన ప్రతి బొమ్మా అందమైనదే. ఆలోచింపజేసేదే. తాదాప్యం కలిగించగలిగేదే.

"పరుగెత్తే నదినైనా బంధించును చిత్రం అంతటి ఆకాశమైనా ఇంతవును విచిత్రం!" అని ప్రశంసించారు డా॥ దాశరథి కృష్ణమాచారి. నదీనదాలు, కొండకోనలు, పశుపక్ష్యాదులు అన్నీ అత్యంత సహజంగా ఆ చిత్రాల్లో ఒదిగిపోయాయి. రాళ్ళూ, మోళ్ళూ కూడా! కాలం పరుగెత్తినా కళలు నిలిచి ఉంటాయి. అందులోనూ ఉత్తమ కళ సమాజానికి పథ ప్రదర్శకురాలవుతుంది. భారతీయ పౌరాణిక గాథలకు, కవిపుంగవులకు, చారిత్రకులకు, జగన్మాత నుంచి రాముడు గుహుడు వంటి చిత్రాలన్నింటికి రూపాన్నిచ్చిన శేషగిరిరావు చిత్రాలను చూసి ప్రఖ్యాత చిత్రకారిణి ఎఫ్. అకినో ఒకసారి–

"శేషగిరిరావు ప్రతిభ నాకెంతో నచ్చింది. వారు ఎంతో ఉత్సాహంతో, సామర్థ్యంతో స్కెచ్‌లు డిడైన్లు వేశారు. ఎన్నో నూతన పద్ధతులను కనుగొన్నారు. క్రియాశీలకమైన పద్ధతులను తన చిత్రాల్లో ప్రయోగించారు. అవి వారి సృజనాత్మకశక్తిని చాటుతున్నాయి. ఆయన చేసిన స్టడీ రికార్డ్ అద్భుతమైంది. పురాతన రచనలు, మండలాలు, ఆరుబనలపై ఆయన చేసిన అద్భుత స్టడీ రికార్డ్ చూసి నేనెంతో పరవశురాలినయ్యాను". అని అన్నారు.

1924 జనవరి 27వ తేదీన జన్మించారు శేషగిరిరావు. వీరి స్వస్థలం వరంగల్ జిల్లా మహబూబాబాద్ సమీపంలోని పెనుగొండ. కొమడపల్లి వారు ఆ కాలంలో తెలంగాణాలో దేశ్‌ముఖ్, దేశ్‌పాండ్యగిరి కలిగినవారు. బాల్యంలో రాజఠీవిని అనుభవించిన కొండపల్లి శేషగిరిరావు విధివశాత్తు యౌవనమంతా అష్టకష్టాలపాలయ్యారు. అనివార్య కారణాల వల్ల ఆస్తిపాస్తులన్నీ పోయాయి. అయినా మొక్కవోని ధైర్యంతో తనలోని కళను తనతోపాటు బతికించుకుంటూ అచంచలమైన పట్టుదలతో శ్రమించారు. వరంగల్‌లోని వేయి స్థంభాల గుడి శిల్పాలు, రామప్ప దేవాలయ శిల్పాల అందాలు ఆయనలోని చిరతకారునికి ప్రేరణైతే, దీన్‌దయాళ్ నాయుడు ప్రత్యక్ష గురువయ్యారు. ఆయన శిక్షణలో చిత్రకళలోని మెలకువలన్నీ గ్రహించిన శేషగిరిరావు బంధుమిత్రుల సహాయంతో హైదరాబాద్ చేరుకున్నారు. హైదరాబాద్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో చదువుకోవడానికి మెహదీనవాజ్ జంగ్ సహకారం పొందారు. రవీంద్రుడు స్థాపించిన విశ్వభారతి శాంతినికేతన్‌లో శేషగిరిరావుకు తగిన శిక్షణ లభిస్తుందని నవాబ్ కలకత్తాకు పంపించారు.

శాంతినికేతన్‌లో నందలాల్ బోస్ శిష్యరికంలో శేషగిరిరావు చిత్రాల పరిణతి అద్వితీయమైనది.

తనదైన ప్రత్యేకశైలిలో చిత్రించిన 'రెస్ట్', 'క్షామ', 'స్టేట్‌హుడ్', 'సంతాపం', 'డెడ్‌కౌ(మృతగోవు)', డిసైర్ అండ్ డెత్, సింఫోని, హార్వెస్ట్ వంటి మోడ్రన్ ఆర్ట్‌లో వేసిన చిత్రాలన్నీ బహుమతులను సాధించుకున్నాయి. భువనేశ్వర్‌లోని శిల్పాలను చిత్రించిన శేషగిరిరావు రామప్ప దేవాలయంలోని శిల్పకళా నైపుణ్యాన్ని తమ రేఖా చిత్రాలతో జాతికి తెలియజేసి రామప్ప అందాలనూ వెలికితీశారు. వెలుగులోకి తెచ్చారు. తెలుగు సాహిత్యంపైనా, తెలుగుభాషపైనా ఎనలేని మక్కువ ఉన్న ఆయన ... నిరంతరం తెలుగు సాహిత్యాన్ని చదివేవారు. వానమామలై వరదాచారి, దాశరథి, సినారె, పల్లా దుర్గయ్య, బి. రామరాజు, అడవి బాపిరాజు, వట్టికోట ఆళ్వారుస్వామి వంటి కవులెందరితోనో సన్నిహిత సంబంధాలుండేవి కొండపల్లికి. పురాణాలను చదవడం, సాహితీ గోష్ఠుల్లో పాల్గొనడం వీరికెంతో ప్రియం. రామాయణ, భారత, భాగవతాలు చదివి ఆకళింపు చేసుకొని కథానుగుణంగా, వర్ణనానుగుణంగా చిత్రాలు వేశారు.

1961. 1969ల్లో ఢిల్లీలో గణతంత్ర దినోత్సవాల్లో ఆంధ్రప్రదేశ్ తరపున శేషగిరిరావు ప్రాతినిధ్యం వహించారు. ఆయన ఆధ్వర్యంలో నిర్మించిన టాబ్లోను చూసి అప్పటి ప్రధానులు నెహ్రూ, ఇందిరాగాంధీలు ముగ్ధులయ్యారట. 1969లో వేసిన 'కృష్ణవేణి' టాబ్లో విశేషంగా ఆకట్టుకుందట! కృష్ణానదీ ప్రవాహాన్ని అందమైన స్త్రీ ముఖ బింబంగా శిరోజాలను ప్రవాహంగా, ఆ నదీ తీరంలోని ప్రసిద్ధ గ్రామాలను ఆ చిత్రంలో వేశారు. గాంధీ శతజయంతి ఉత్సవాల్లో వీరు చిత్రించిన 'ఎవేకనింగ్ ఆఫ్ ది పీపుల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ – విత్ బ్లెసింగ్ ఆఫ్ బాపు' అనే చిత్రం సుప్రసిద్ధం.

సామాజిక స్పృహతో వేసిన వీరి చిత్రాల్లో తెలుగు వెలుగులు, తెలంగాణా విముక్తి, రాళ్ళు, వ్రేళ్ళు, ఓ బిచ్చగాడు, బెస్తవాడు, డెడ్‌కౌ అన్నీ గొప్పవే. దేవత, పౌరాణిక, కుడ్య, దేశభక్తి చిత్రాలతో సహా ఏ వర్గంలోని వర్ణచిత్రాలనైనా అద్భుతంగా చిరతించే కుంచె కొండపల్లిది.

'వేద సంస్కృతిలో అంతర్భాగమైన ఆనాటి సత్సంప్రదాయాలు, సంస్కారాలు మరుగున పడిపోతున్న దుస్థితి పట్టింది. పాశ్చాత్య విద్యా ప్రభావం చేత భావదాస్యాలు కలిగి సనాతన భావాల మీద వ్యతిరేకత ఏర్పడిన ఈ ప్రస్తుత కాలంలో మన సంస్కృతీ సంప్రదాయాలను ఆచరించడం మన ధర్మం' అంటారు శేషగిరిరావు. ఆ దృష్టితోనే వేసిన లక్ష్మీగణపతి, జగన్మాత, రాముడు, గుహుడు, విష్ణుదుర్గ, పార్వతీకళ్యాణం, గజేంద్రమోక్షం, వ్యాసుడు – గణపతి, నన్నయ్య, వేమన, అన్నమయ్య, పోతన, మాదన్న,

భాగమతి, పతంజలి మహర్షి, అభినవ గుప్తుడు వంటి చిత్రాలు శేషగిరిరావు పరిశీలనా శక్తిని తెలియజేస్తాయి.

'పోతన చరిత్ర' కావ్యానికి తగినట్లు అనేక చిత్రాలు వేశారు శేషగిరిరావు. అంతేకాదు 'చిత్రమయీ కావ్యం' అనే చక్కని వ్యాసాన్ని రాసి కొత్తకోణంలో ఆ కావ్యాన్ని ఆవిష్కరించారు. 1964లోనే ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం కోరికపై "కుడ్య చిత్రకళ, అలంకరణ కళ"పై విశ్లేషణాత్మక వ్యాసాలు రాసిచ్చారు శేషగిరిరావు. ఈ వ్యాసాలు సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశంలో ముద్రించారు. ఆదిమ కళ నుంచి ఆంధ్రదేశ చిత్రకళ వరకు, శిలల నుంచి తెలుగువారి శిల్పకళా వైభవం వరకు ఎన్నో వ్యాసాలు రాశారు. తెలంగాణలో మరుగునపడిన 'కాకిపడిగెలు' అనే పురాతన పట చిత్రాలను వెలుగులోకి తెచ్చారు. వట్టికోట ఆళ్వారుస్వామి, కల్లూరు సుబ్బారావు, అడవి బాపిరాజు, అంట్యాకుల పైడిరాజు, కాపు రాజయ్య వంటి ప్రముఖులపై వారి అభిప్రాయాల్ని వ్యాసరూపంలో చక్కగా వివరించారు. లేపాక్షి, హంపి శిల్పాలను రేఖాచిత్రాలుగా వేసి పుస్తకంగా వేయించిన శేషగిరిరావు ఎన్నో పల్లెటూళ్ళు తిరిగి ముగ్గులను సేకరించారు. ఆ ముగ్గుల్లోని మలుపులు, ముడులు, చుక్కలు, రేఖలు అన్నింటికీ వివరణ ఇచ్చారు.

ప్రముఖుల నిలువెత్తు చిత్రాలు వేయడంలో శేషగిరిరావు సిద్ధహస్తులు. అమెరికాలోని భారతీయ రాయబార కార్యాలయంలోని టంగుటూరి, హైదరాబాద్ శంకరమఠ్‌లోని శంకరాచార్యులు, రామచంద్ర మిషన్‌లోని రామచంద్రాజీ మహరాజ్ నిలువెత్తు చిత్రాలన్నీ కొండపల్లి కుంచె నైపుణ్యాన్ని పట్టిచ్చేవే! 'నిలువెత్తు చిత్రాల చిత్రీకరణంలో హృదయ స్పందన చాలా అవసరం' అంటూనే 'నేను వేసిన ఈ చిత్రాల్లో వారి వారి సంతానం కూడా చెప్పలేని సందర్భాలను నాకుంచె చెప్పగలిగింది అంటే మాటలందించని భావాలను కుంచె అందించగలదన్న మాట' అన్నారు శేషగిరిరావు.

1960 దశకంలో శేషగిరిరావు వేసిన నిలువెత్తు గోదాదేవి చిత్రం ఓ కలికితురాయి. సుందరమైన విశాల నయనాలు, సంపెంగపువ్వంటి ముక్కుతో, సుందర దరహాసంతో లేతకాషాయ వర్ణ లేపనాలతో ఉన్న గోదాదేవి చితాన్ని చూడగానే దేవులపల్లి కృష్ణశాస్త్రి కళ్ళు చెమర్చాయట. 'ఆ చిత్రం, మరణించిన తన కూతురును గుర్తుకు తెప్పించింద'న్నారట ఆ కవి. వెంటనే శేషగిరిరావు తన గోదాదేవి చిత్రాన్ని కృష్ణశాస్త్రికి ఇచ్చేశారట! అది! అదీ జీవత్వం ఉట్టిపడే వీరి బొమ్మలతీరు! కవి పండితులంటే, సాహిత్యమంటే ఉండే అభిమానం తీరు.

మహాకవి కాళిదాసు రాసిన 'అభిజ్ఞాన శాకుంతలం' పుస్తకాన్ని చదివి, ఆ కథానుగుణంగా దాదాపు 25, 30 చిత్రాలను వేశారు. విశ్వామిత్ర మేనకల కథ నుంచి,

శకుంతల దుష్యంతుల ప్రణయం వరకు, శకుంతలను అత్తవారింటికి పంపించే దృశ్యం నుంచి అంగుళీయకం నదిలో పడిపోవడం వంటివన్నీ చిత్రించారు. ఆ వర్ణచిత్రాలన్నీ ప్రేక్షకుల కళ్ళను తిప్పనీయవు. మనసులను సుందర లోకాల్లో విహరింపజేస్తాయి. ఒక్కటా, రెండా, పదా, ఇరవయ్యా! వందల చిత్రాలు! అవన్నీ విభిన్న ప్రక్రియల్లో వేసిన శేషగిరిరావు చిత్రాలను గురించిగానీ, వారు రాసిన, సేకరించిన విషయాలుగానీ వారు చిత్ర కళారంగానికి అందించిన విశిష్ట సేవలను గురించిగానీ, ఎందరో నేటి ఆధునిక చిత్రకారులకు ప్రఖ్యాత చిత్రకారులకు ప్రొఫెసర్‌గా విద్యాదానం చేసిన విషయాలుకానీ, వారికి లభించిన అవార్డులు, రివార్డులు, బహుమతులు ఎన్నని చెప్పగలం.

1987లో ఢిల్లిలో చిత్రకళా ప్రదర్శనలో ఎన్టీ రామారావు కొండపల్లివారి 'హరిహరరాయలు, విద్యారణ్యస్వామి' చిత్రాన్ని చూసి ఆశ్చర్యపడి ఎంతో ప్రశంసించారు. 1996లో పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 'గౌరవ డాక్టరేట్'ను బహూకరించింది. 1997లో ఎన్టీఆర్ పురస్కారాన్ని ప్రకటించారు. 2003లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'హంస' అవార్డును ప్రధానం చేసిమది. కేంద్రప్రభుత్వం నుంచి 'ఆర్టిస్ట్ ఎమరిటస్'గా గుర్తింపు పొందిన శేషగిరిరావును మరెన్నో అవార్డులు, సన్మానాలు పొందారు.

స్థితప్రజ్ఞులైన ఒక ప్రసిద్ధ చిత్రకారుని సమగ్ర జీవితాన్ని ఎంత వ్యాఖ్యానించినా అది అసమగ్రమే! 'ఇంత కడివెడు పాలపై మీగడలాగా రాజులు రాజ్యాలు కాలగర్భంలో కలిసిపోయినా శతాబ్దాల చరిత్ర సంస్కృతికి సజీవ సాక్ష్యాలుగా కళాఖండాలు మిగిలాయ'ని శేషగిరిరావు చిత్రాలను చూస్తూ డా॥ సి.నారాయణరెడ్డి అశువుగా ఇలా అన్నారు.

'ఎన్నిసార్లు చెక్కితే ఒక శిల్పం
ఎన్నిసార్లు తీర్చితే ఒక చిత్రం
కబుర్లేవో చెప్పకే ఓ కాలమా
ఎన్నిమార్లు చస్తే ఒక జీవితం'

చెరగని చిరునవ్వు, సుందరరూపంతో ఆప్యాయంగా పలకరించే శేషగిరిరావు.... రాష్ట్ర ప్రజల మనస్సుల్లో చిరంజీవి.

**– కొండపల్లి నీహారిణి**
(శేషగిరిరావు గారి కోడలు)
విశ్రాంత ఉపాధ్యాయిని
హైద్రాబాద్,
9866360082

తెలుగు వెలుగు – జనవరి, 2013

# కళాస్రష్ట కొండపల్లి శేషగిరిరావు

తెలంగాణలో ప్రసిద్ధమైన ముగ్గురు చిత్రకారులు కాపురాజయ్య, పి.టి.రెడ్డి, కొండపల్లి శేషగిరిరావులు. ముగ్గురూ చిత్రకళలో మూడు శైలులకు ప్రతినిధులుగా నిలిచారు. కాపు రాజయ్యది జానపద శైలి. ఆయన కొండపల్లితోపాటు హైద్రాబాద్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో చదువుకున్నాడు. రాజయ్య సిద్ధిపేటలో స్థిరపడి "బుద్ధునిలాగా తపస్సు చేసి ఆధునిక భారతీయ చిత్రకారుల్లో ఒక ప్రత్యేక స్థానం సంపాదించాడు; అని శేషగిరిరావు "కాపు రాజయ్య చిత్రకళ" వ్యాసంలో అంటారు. రాజయ్య ఎక్కువగా స్త్రీలను చిత్రించాడు. స్త్రీల ముఖాలను పక్క నుంచి కొనదేలిన ముక్కు పెద్ద కండ్లు చిత్రించిన బొమ్మలు చూస్తే అతనిది జెమినీరాయ్ చిత్రశైలి అని అనిపిస్తుంది- అనుకుంటాం కూడా. రాజయ్యది తెలంగాణ తెలుగుదనం రపదర్శించే జానపదశైలి ఆని అన్నారు. పి.టి.రెడ్డి బొంబాయిలో జె.జె.ఆర్ట్స్ స్కూలులో చిత్రకళనభ్యసించాడు. ఆయన చిత్రకళలో పాశ్చాత్యుల ఆధునిక ఇంప్రెషనిజం, సింబాలిజం వంటి ధోరణులు కన్పిస్తాయని అంటారు శేషగిరిరావు పి.టి.రెడ్డి మీద వ్రాసిన వ్యాసంలో. "లేపాక్షి-కల్లూరు సుబ్బారావు" వ్యాసంలో నాగజెముడులు మొలిచిన లేపాక్షి దేవాలయాన్ని పునరుద్ధరింపజేసిన ఎమ్మెల్యే కల్లూరు సుబ్బారావును గురించి శేషగిరిరావు వ్రాశారు.

సుబ్బారావుగారు గబ్బిలాలతో అంధకారంలో మూసుకొనిపోయిన లేపాక్షి వీరభద్రాలయానిన్న తెరిపించి అక్కడికి పిలకా నరసింహమూర్తి, కె. శ్రీనివాసులు వంటి చిత్రకారులను రప్పించి దేవాలయ కుడ్య చిత్రాల నకళ్ళు చేయించాడు. ఆ నకలు చిత్రాలు మద్రాసు మ్యూజియంలో ఉన్నాయట. సుబ్బారావుగారు లేపాక్షి చిత్రాలను ఫొటోలు తీయించి అనేక పత్రికల్లో ముద్రింపజేశారట. ఆవిధంగా ఆంధ్రుల కుడ్య చిత్రాల శైలిని ప్రపంచానికి తెలియజెప్పాడు. శేషగిరిరావు కుడ్యచిత్రణ కళను గురించి ప్రత్యేకంగా ఈ పుస్తకంలో ఒక వ్యాసం వ్రాశారు. డా. కొండపల్లి శేషగిరిరావుగారు వ్రాసిన వ్యాసాల్ని వారి కోడలు కొండపల్లి నీహారిణి ఒకచోట చేర్చి 'చిత్ర, శిల్పకళా రామణీయకము' శీర్షికన పుస్తకంగా తీసుకువచ్చారు. అందులో ఉన్న వ్యాసాల్లో ఒకటి కుడ్య చిత్రణ కళ.

భారతదేశంలో ముఖ్యంగా దక్షిణ భారతంలో కుడ్యచిత్రణ కళ-మ్యూరల్



పెయింటింగ్స్ చాలా ఎక్కువగా కన్పిస్తాయి. అసలు ఆదిమ మానవుడు తాను నివసించే రాతిగుహల్లో ప్రజల మీద వేటాడే జంతువులను చిత్రించాడు. చిత్రకళాభివృద్ధికి ఆదిమ మానవునిలోనే బీజం పడింది. ఆదిమ మానవుడు వేసిన బొమ్మలు మనకు ఫ్రాన్స్, స్పెయిన్ దేశాల గుహల్లో దొరికాయి. అదేవిధంగా భారతదేశంలో దక్కను ప్రాంతంలో రాయచూరు జిల్లా భూపాల్ దగ్గర గుహల్లో కన్పించాయి. ప్రాచీన నాగరికతలో గ్రీసు రోమ్ ఈజిప్టుల్లో కుడ్య చిత్రకళ వికసించిందని శేషగిరిరావు అన్నారు. గ్రీసులో అంతగా కుడ్యచిత్రకళ కన్పించదు. ఇక రోమ్‌లో వెటికన్‌లో సెయింట్ పీటర్ చర్చి గోపురం గోడల మీద మైకలాంజిలో వేసిన బైబిల్ కథలను చిత్రించే కుడ్యచిత్రాలు రినాయసెన్స్ కాలం నాటివి కన్పిస్తాయి. కాని ఈజిప్టులో పిరమిడ్లు ప్రవేశద్వారం మొదలుకొనే కుడ్యచిత్రాలు అనేకం కన్పిస్తాయి. పిరమిడ్‌ల లోపల అంధకారం నిండిన కన్ను పొడుచుకున్నా కన్పించని సందుల్లో చిత్రకారులు వేసిన కుడ్యచిత్రాలు చూస్తే చాలా ఆశ్చర్యం కలిగిస్తాయి.కరెంటు లేని ఆ కాలంలో చిత్రకారులు ఆ చీకటిలో ఎట్లా చిత్రాలను అదీ చాలా పైన గోడల మీద కప్పుల మీద వేసారో తెలియదు.

ఈజిప్టు తర్వాత మనకు భారతదేశంలోనే కుడ్యచిత్రాలు ఎక్కువగా కన్పిస్తాయి. అజంతా కుడ్యచిత్రాలు రెండువేల సంవత్సరాల కింది నుంచి వేసినయి. వీటిని బౌద్ధులు వేసారు. ఆ తర్వాత నాగరికత సంస్కృతి వికాసంతో కుడ్యచిత్రాలు దేవాలయాల్లోను నివసించే గుహల్లోను చిత్రింపబడినాయి. తమిళనాడులోని చోళుల, పల్లవుల, నాయక రాజుల కాలంలోని దేవాలయాల్లో కుడ్య చిత్రాలు లభించాయి. విజయనగర రాజుల నాటి కుడ్యచిత్రాలు లేపాక్షి, తాడిపత్రి, సోమపాలెం, చిప్పగిరి మొదలైన చోట్లఉన్న దేవాలయాల్లో కన్పించాయి. దేవాలయాల్లోనే కాక రాజప్రాసాదాల్లో, ధనికుల ఇండ్లల్లో శయనాగారాల్లో కుడ్యచిత్రాలను వేయటం ఆచారంగా ఉండేది.

క్రీడాభిరామం కావ్యంలో ఓరుగల్లులోని మాచల్దేవి భవనంలో కుడ్య చిత్రాలున్నట్లు ప్రసక్తి ఉంది. దాన్నిబట్టి కాకతీయుల కాలంలో కుడ్యచిత్రకళ లేదా భిత్తికా చిత్రకళ ఉండేదని తెలుస్తున్నది. కాని కాతీయుల నాటి కుడ్యచిత్రాలేవి మనకు దొరకలేదు. శిల్పసంపద చాలా లభించింది. అయితే శిల్పకళలోని రూప చిత్రణమే కాకతీయుల కుడ్యచిత్రాలలో తప్పక ఉండి యుండవచ్చునని శేషగిరిరావు అభిప్రాయపడినారు. (పెజీ64) అజంతా కుడ్యచిత్రకళ తర్వాత చెప్పుకోదగింది లేపాక్షిలోనే గోచరిస్తున్నదని శేషగిరిరావు అభిప్రాయం. అజంతా లేపాక్షి చిత్రకళలు భిన్నశైలుల్లో ఉన్నాయంటారు ఆయన. ఈ వ్యాసంలో శేషగిరిరావు కుడ్యచిత్రాల కోసం భిత్తికగా గోడలకు పేడ మిశ్రణంతో గాని, రేగడిమట్టి పుట్టమట్టి మిశ్రణంతోగానీ తయారు చేసిన లేపనాన్ని పూసేవారని ఆ తర్వాత

సహజమైన ప్రకృతిలో లభించే బొగ్గు, రాళ్ళు మొదలైన వాటినుంచి రంగులను తయారుచేసుకునేవారని శేషగిరిరావు చెప్పారు.

గోడను భిత్తికగా తయారుచేసుకునే విధానాలను చాలా వివరంగా వర్ణించి చెప్పారు. అంతేగాక కుడ్యచిత్రంలో చిత్రకారులు ఒక వృత్తాంతాన్ని తీసుకొని వరుసలో క్రమంగా చిత్రం చేసేవారని కుడ్య చిత్రణ ధోరణులను (టెక్నిక్‌ను) గురించి విశదంగా చెప్పారు. అజంతాలో బుద్ధుని జాతక కథల చిత్రణ ఎక్కువగా కనిపిస్తే దేవాలయాల్లో విష్ణు, శివులకు సంబంధించిన పౌరాణిక కథలు చిత్రింపబడినాయి. కథలో వచ్చే పాత్రల సన్నివేశాల ప్రాధాన్యాన్ని బట్టి కొన్ని బొమ్మలను పెద్దగా కొన్ని బొమ్మలను చిన్నవిగా చిత్రించేవారని కథాక్రమంలో సన్నివేశాలను చిత్రించేవారని ఆయన అంటారు.

చిత్రీకరణ కళను బాగా అధ్యయనం చేసిన శేషగిరిరావు, ఆయన సమావేశాలకు వేసిన బ్యాక్‌డ్రాప్ చిత్రాలు–గిరిజన సంక్షేమశాఖ వారి సభలకు వేసిన చిత్రం, తెలుగు మహాసభలకు వేసిన బ్యాక్‌డ్రాప్ చిత్రం, తెలంగాణ పోరాటాన్ని చిత్రిస్తూ వేసిన చిత్రం మొదలైనవన్నీ కుడ్య చిత్రణకళ శైలిలో (టెక్నిక్‌లో) ఉన్నాయి. శేషగిరిరావు ఇవేగాక భారతీయ విద్యాభవనంలో, మాదాపూర్ సి.ఓ.జి. భవనంలో ఎన్నో చోట్ల భిత్తికా చిత్రాలను – "మ్యూరల్స్"ను వేశారు. ఆయన పోట్రెయిట్స్ వేయటంలోనూ ప్రావీణ్యం కలవారు. ఆయన వేసిన రాజీవ్‌గాంధీ చిత్రం పలువురి ప్రశంసలను అందుకుంది. సోనియాగాంధీకి కన్నీళ్ళను తెప్పించింది.

శేషగిరిరావు రచించిన "చిత్రశిల్పకళా రామణీయకము" గ్రంథంలోని మొదటివ్యాసం ఆదిమ మానవుని చిత్రకళతో ఆరంభమైంది. చివరి వ్యాసం ఆధునిక చిత్రకళల్లో నూతన ప్రయోగాలను గురించి వివరిస్తూ ముగిసింది. మరో వ్యాసం "తెలంగాణములో చిత్రకళ". నిజాం రాజ్యంలో వికసించిన చిత్రకళను గురించి వివరించే వ్యాసం. నిజాంరాజుల కన్నా ముందు పాలించిన కుతుబ్‌షాహి రాజులు కావ్యకథల్లో, శాస్త్రీయ గ్రంథాల్లో చిత్రాలను చిత్రించటానికి చిత్రకారులను ఢిల్లీ నుంచి తీసుకొనివచ్చి పోషించారని "తస్వీర్‌ఖానా"లల్లో కూర్చొని వాళ్ళు నిరంతరం చిత్రాలు వ్రాసేవారని శేషగిరిరావు చెప్పారు. ఆ కాలంలో చిత్రకళలో ఒక వినూత్నశైలి ఏర్పడిందని దానికి "దక్కను కలమ్" అని పేరు ఏర్పడిందంటారు. ఆ చిత్రాలను ఇప్పటికీ ఢిల్లీ నేషనల్ మ్యూజియంలో సాలార్జంగ్ మ్యూజియం లో చూడవచ్చునని ఆయన చెప్పారు. తర్వాత తర్వాత కొందరు చిత్రకారులు పాశ్చాత్య దేశాలకు పోయి చిత్రకళను పెంపొందిచుకున్నారని నిజాం రాష్ట్రంలోని చిత్రకళను చరిత్రను వివరించారు. ఈ వ్యాసం వట్టికోట ఆళ్వారుస్వామి 1956లో ముద్రించిన "తెలంగాణము" పుస్తకంలో అచ్చయింది. నిజాం కాలంలో హైద్రాబాద్‌లో మెహదీ

నవాజ్‌జంగ్ అధ్యక్షతన ఒక ఆర్ట్ సొసైటీ ఏర్పడింది. ఆ నవాబ్‌జంగ్ ఆదరణలోనే శేషగిరిరావు హైద్రాబాద్ స్కూల్ ఆఫ్ ఆర్టులో ఐదేండ్ల డిప్లొమా చేశారు. శేషగిరిరావు శాంతినికేతన్ పోయి నందలాల్‌బోసు శిష్యరికం చేసి చిత్రకళను పెంపొందుకోవాలని కోరికగా ఉండేది. అప్పుడు శేషగిరిరావు నవాజ్ జంగ్ సహాయంతో శాంతినికేతన్ చేరుకొని నందలాల్ బోసును కలుసుకొని అతని శిష్యరికం చేసి చిత్రకళను పెంపొందుకోవాలని కోరికగా ఉండేది. ఆప్పుడు శేషగిరిరావు నవాజ్ జంగ్ సహాయంతో శాంతినికేతన్ చేరుకొని నందలాల్ బోసును కలుసుకొని శిష్యరికం చేసారు.

ఆరోజుల్లో ఆంధ్ర ప్రాంతాల నుంచి రాయప్రోలు, బెజవాడ గోపాలరెడ్డి వంటి వాళ్ళెందరో శాంతినికేతన్ పోయి విద్యనభ్యసించారు. చాలామంది కవులు చిత్రకారులు "శాంతినికేతన్" చేత రవీంద్రనాథ్ టాగోరు మొదలైన వాళ్ళచేత ప్రభావితులయ్యారు.

కాని తెలంగాణం నుంచి అంటె నైజాం నుంచి శాంతి నికేతన్ పోయిన వాళ్ళు ఒకరిద్దరిలో శేషగిరిరావుగారు ఒకరు.

రవీంద్రనాథ్ టాగోరు శిష్యరికం చేసిన నందలాల్ బోసు దగ్గర శేషగిరిరావు శ్రద్ధతో చిత్రకళలోని మెళకువలు నేర్చుకున్నారు. శాంతినికేతన్ ప్రభావం వల్లనో యేమో ఆయన రేఖల్లో లాలిత్యం కన్పిస్తుంది. ఆయన పాశ్చాత్య ప్రభావానికి గురికాకుండా భారతీయ సంప్రదాయ పద్ధతిలో రూప చిత్రణ చేశారు. నైరూప్యం వైపు పోలేదు–అని అనిపిస్తుంది. తర్వాత శాంతినికేతన్ నివాసంతో, ప్రభావంతో అతనిలో జాతీయతా భావాలు ఏర్పడ్డాయేమో! ఈ వ్యాస సంపుటిలో "శాంతినికేతన్ – నా అనుభవాలు" అనే వ్యాసమే కాక "మారుతున్న కళారీతులు–జాతీయ బాధ్యత" అనే వ్యాసం కూడా ఉంది. సమాజం నిర్మాణం సమాజం అభివృద్ధినిబట్టి కళలు వికసిస్తాయని ఆయన అభిప్రాయపడినారు. కళల్లో మౌలికత సృజనాత్మకతలు అవసరమని అంటారు శేషగిరిరావు. అనుకరణలో పురోగమనం లేదన్న ఆయన అభిప్రాయం గొప్పగా ఉంది.

శేషగిరిరావు ఈ వ్యాస సంపుటిలో "కాకిపడిగెలు" చిత్రణ ప్రక్రియ గురించి మూడు వ్యాసాలు రచించారు. జనగామ దగ్గరున్న చీర్యాల గ్రామానికి పోయిన శేషగిరిరావు ఒక పెంకుటిల్లు ఆవరణలో ఆరబెట్టి ఉన్న చిత్రాలను చూచి వాటి శైలికి ఆశ్చర్యపోయాడు. వాటిని నక్కాషి వెంకట్రామయ్య వేసిన కాటమరాజు కథలోని బొమ్మలని తెలుసుకున్నారు. బొమ్మలను నిడివైన కాగితం ముద్రగా బట్టమీద చిత్రించి ఆ కాగితాన్ని విప్పుతూ ఒక్కొక్క బొమ్మను చూపిస్తూ పౌరాణిక జానపద కథకులు పౌరాణిక గాథలను చెప్తారు. అట్లా చెప్పే కులాలు, ఆ కులాలను పోషించే కులాలుంటాయని శేషగిరిరావు తెలుసుకున్నారు. కాగితంమీద బొమ్మలు పూర్తిగా చీకిపోయినప్పుడు కొత్తగా బొమ్మలను వేసి ఇచ్చే

వెంకట్రామయ్యవంటి నక్కాషి కళాకారులుంటారు. ఈ చిత్రకళ వేల సంవత్సరాల నుంచి వస్తున్నది.

జానపదుల్లో ఉన్న ఈ కళను "కాకిపడిగెలు" అంటారు. ఆంధ్రప్రదేశ్ లలితకళా అకాడమీ వారి దృష్టికి శేషగిరిరావు ఈ జానపద కళను తెచ్చారు. వారి ప్రోత్సాహంతో 24 గ్రామాల్లో సర్వే జరిపి, ఫోటోలు తీయించి మారుమూల పల్లెల్లో ఉన్న ఈ కళను అందరి దృష్టికి తీసుకవచ్చారు. తెలంగాణలో 64 గ్రామాల్లో "కాకిపడిగెల" పీట చిత్రకళ వ్యాపించి ఉన్నదని తెలుసుకున్నారు. కాకిపడిగెల చిత్రాలను జానపదులు ఎట్లా వేస్తారు, రంగులను తయారుచేసుకోవటం, బ్రష్‌లను తయారు చేసుకోవటం భిత్తికగా వస్త్రాన్ని తయారు చేసుకునే విధానాలను శేషగిరిరావు చాలా వివరంగా వర్ణించి చెప్పారు.

"చిత్రకళలో శ్రీకృష్ణుడు" అనే వ్యాసం చిత్రకళలో శ్రీకృష్ణునికి అతనికి సంబంధించిన గాథలకు ఎంత ప్రాధాన్యముందో గుర్తించి వివరించారు. పుర్వం బుద్ధుడిని, అతని కథలను చిత్రించే చిత్రాలు ఎక్కువగా ఉండేవి. కాని రానురాను కృష్ణభక్తి సంప్రదాయం వ్యాపించేకొద్దీ కృష్ణుడు, అతని కథలను చిత్రకారులు పరవశించి చిత్రించారు. దక్షిణంలో తంజావూరు నుంచి ఉత్తరంలో కాంగ్డా, పశ్చిమంలో గుజరాత్, రాజస్థాన్ మొదలుకొని, తూర్పున మధువని బెంగాల్ వరకు చిత్రకళలోని సంప్రదాయ జానపద శైలుల్లో శ్రీకృష్ణున్ని అతని చరిత్రను చిత్రించటం కన్పిస్తుంది. కుడ్య చిత్రాల్లో "మినియేచర్" చిత్రాల్లో పీట చిత్రాల్లో అంతటా శ్రీకృష్ణుని బాల్యలీలలు గోపికలతో శృంగార లీలలు కాళీయ మర్ధనం గోవర్ధన పర్వతం ఎత్తటం వంశీగానలోలుడైన కృష్ణుని అట్లా ఎన్నో రూపాల్లో శ్రీకృష్ణుని రూప చిత్రణ చిత్రకళలో జరిగింది. స్వయంగా శేషగిరిరావు శ్రీకృష్ణుని, గోపికలను చిత్రాలుగా ఎన్నో గీసారు.

హైద్రాబాద్‌లో జూబ్లీహిల్స్ మొదలుకొని అనేకచోట్ల రాతిబండలు కన్పిస్తాయి. ఈ శిలలు రక్షించే సొసైటీ కుడా హైద్రాబాదులో ఏర్పడింది. మేము విద్యార్థులుగా ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కాలేజీకి బస్సులో పోతూ వస్తూ ఉన్నప్పుడు లా కాలేజి పక్కనున్న గుండురాళ్ళు మమ్మల్ని ఆకర్షించి ఆకట్టుకునేవి. అవి లక్షల సంవత్సరాల కిందట ఏర్పడిన శిలలని తర్వాత తెలిసింది. అటువంటి శిలల్లో సౌందర్యాన్ని చూసిన చిత్రకారుడు శేషగిరిరావు. ఈ వ్యాస సంపుటిలో ఆ శిలలు సౌందర్యం గురించి ఒక వ్యాసం వ్రాసారు. ఎన్నో శిలలను ఆయన చిత్రించి చూపరులను మంత్రముగ్ధులను చేశారు.

ఈ వ్యాస సంపుటిలో మరో ఆలోచింపజేసే వ్యాసం "అలంకరణ కళ" వ్యాసం శీర్షికను బట్టి చిత్రకళలో అలంకరణ కళ గురించి చెప్తున్నారని అనుకున్నాను. కాని శేషగిరిరావు నిత్య జీవితంలో ఇంటా బయట మనం ఉపయోగించే వస్తువులను కళతో

అలంకరించటం ఈ వ్యాసంలో వస్తువు. "చెక్కణములేని చెంబు, అంచు లేని చీర, తిలకము లేని ముఖము కళా విహీనమైనవని శేషగిరిరావు అభిప్రాయం. ఇంట్లో వాడే కుర్చీలు, పీటలు, కుండలు, కత్తిపీటలు, ఉయ్యాలలు, ఇత్తడి రాగి పాత్రలు ఇంటికి వాడే గుంజలు మొదలగు – అన్నింటినీ కళాత్మకంగా నక్కాషే పనితో కూడినయి పూర్వులు వాడుతుండే వాళ్ళు – యంత్ర యుగం వచ్చిం తర్వాత వస్తువుల్లో కళాకృతి లోపిస్తున్నది. యంత్రంలొ అన్ని ఒక్కమాదిరే తయారవుతున్నాయి. కాని మనం వాడే వస్తువులు అలంకారంతో ఉన్నట్లయితే ఆహ్లాదం కలుగుతుంది. మన చుట్టూ ఉన్న అందమైన పనితనంతో కూడిన కళాత్మకమైన వస్తువులు మనలో శాంతి ప్రశాంత స్నేహం పరస్పర సౌమనస్య భావాలు పుట్టటానికి ప్రేరకమవుతాయి. కళ కళకోసమె కాదు. కల నిత్యజీవితంలో మనకు ప్రశాంతిని కలిగిస్తుంది. ఆనందాన్ని తద్వారా స్నేహాన్ని ఆవిర్భవింపజేస్తుంది. సుఖశాంతులతో కూడిన సంస్కృతికి పునాదులు వేస్తుంది. ఏ ఆకృతిలేని కళాత్మకం కాని వస్తువులు మన మనసులను బండబారేట్లు చేస్తాయి. రసరమ్యతను సౌందర్యానందాన్ని ఆహ్లాదాన్ని కలిగించలేవు. జీవితం యాంత్రికంగా నీరసంగా మారుతుంది. శేషగిరిరావు ఈ వ్యాసం వ్రాసి పాఠకుల్లో కళకుండే ప్రయోజనాలను ఎన్నిటినో స్ఫురింపజేసారు. ఇప్పుడీ ప్రాచీన అలంకరణ వస్తువులు కాలగర్భంలో కలిసిపోయాయి. దొరికిన వాటిని "యాంటిక్" పేరుతో కలెక్ట్ చేసేవాళ్ళు సేకరిస్తున్నారు.

వానమామలై వరదాచార్యులు రచించిన "పోతన చరిత్ర" కావ్యాన్ని చదివి శేషగిరిరావు చాల ప్రభావితులయ్యారు. "కవిత్వమంటే నాకు పిచ్చి" అని ఈ పుస్తకంలో ఒకచోట అన్నారు కూడా. "పోతన చరిత్రము–చిత్రమయి కావ్యము" అనే ఈ వ్యాసంలో శేషగిరిరావు వరదాచార్యుల బొమ్మకట్టించే వర్ణనల చేత ప్రభావితుడై వ్రాసారు. వరదాచార్యుల వర్ణనా చాతుర్యం గొప్పది. ఆయన వర్ణించిన ప్రతి పాత్ర పాత్రల చలనం ప్రకృతి దృశ్యం, సన్నివేశం ఆ కావ్యాన్ని చదువుతున్నప్పుడు కన్నుల ముందు సాక్షాత్కరిస్తుందంటారు శేషగిరిరావు. అందుకే ఆ కావ్యాన్ని చిత్రమయి కావ్యము" అని ప్రశంసించారు.

ఆదికవి వాల్మీకి తన రామాయణ రచనను ముగించగానే ఋషులకు చదవి వినిపించాడట సహృదయులైన ఋషులు వారి రామాయణం వింటుంటే ప్రతి సన్నివేశం మా ముందు జరుగుతన్నట్లుగానే కన్పించింది. సర్వం మేము దర్శించాం–అన్నారట. రామాయణం స్క్రీన్‌ప్లే ప్రపంచంలోనే గొప్పది. అట్లా రూపుకట్టించే గుణం పోతన్న చరిత్రలో ఉంది. దానిచేత స్పందించిన శేషగిరిరావు ఆ కావ్యంలోని ఘట్టాలను చిత్రిస్తూ

పద్నాలుగు వర్ణ చిత్రాలను చిత్రించారు. "ఇంకా కొన్ని వందల చిత్రాలు వేయ వీలున్నదని గ్రహించితిని" అని ఆయన ఆ వ్యాసంలో వ్రాసారు. ఇటువంటి ప్రత్యక్షం చేసే గుణం కాళిదాసు రచనల్లోనూ కన్పిస్తుంది. శేషగిరిరావు అందుకేనేమో ముఖ్యంగా కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలంలోని సన్నివేశాలను తీసుకొని ఇరవైరెండు చిత్రాలను చిత్రించారు.

డా. కొండపల్లి శేషగిరిరావు చిన్నతనం నుంచే చిత్రశిల్పకళ అంటే ఇష్టపడేవాడు. వరంగల్ జిల్లా మానుకోట ప్రాంతంలో జన్మించిన ఆయన వరంగల్‌లో విద్యాభ్యాసం చేశారు. విద్యార్థిగా ఉన్నప్పుడు తరచుగా వేయిస్థంభాల గుడిని చూచి దాని అద్భుత నిర్మాణానికి ఆశ్చర్యపడి ఆనందించేవాడని "కాకతీయ కళ – నా అనుభవం" అనే వ్యాసంలో చెప్పుకున్నాడు. కాకతీయ శిల్పంతో అతనికి ఏకలవ్య బాంధవ్యం ఉందని ఆయనే చెప్పుకున్నారు. కాకతీయ శిల్పాల్లోని రూప సౌందర్యం అతన్ని ఆకర్షించింది. అందుకే అతని చిత్రాల్లో స్త్రీలు సౌష్టవంగా సుందరంగా కన్పిస్తారు. కాకతీయుల రామప్ప దేవాలయంలోని నాగిని శిల్పాలు లయాన్వితమైన రూపకల్పనకు పరాకాష్ఠ చెందినవని ఆయన అంటారు.

చిన్నతనం నుంచి శేషగిరిరావును కాకతీయుల శిల్పకళ ప్రభావితం చేసింది. ఒక మహాతపస్విగా ఆయన చిత్రకళను ఆరాధించారుఈ అందులో రమించారు. ప్రతిఫలాపేక్ష లేకుండా చిత్రాలను అనేక సంఖ్యలో చిత్రిస్తూపోయారు. ధ్యానం ధారణలతో ఒక ఋషిగా చిత్రకళాసృష్టి చేసిన కళాస్రష్ట శేషగిరిరావు. ఆయన రచించిన ఈ గ్రంథంలోని వ్యాసాలు చక్కని శైలిలో ఉన్నాయి. భావాలను స్పష్టంగా చెప్పటం ఉంది. చిత్రకళకు సంబంధించి ఎన్నో విషయాలను సరళంగా చెప్పి అందరూ అర్థం చేసుకునేటట్లుగా అతని వచన రచన ఉంది. ఒకచోట "పర్‌స్పెక్టివ్" అనటానికి పరిప్రేక్షిత అనే పదాన్ని వాడటం నాకు చాలా ఆశ్చర్యం కలిగించంది. సామాన్యంగా అందరూ ఇంగ్లీషు పదాన్నే వాడుతారు. కాని దాని సమానార్థకమైన సంస్కృత పదం "పరిప్రేక్షిత"మనే పదం చాలా కొంతమందికే తెలుసును. అట్లా ఆయన వచన, రచన పదప్రయోగాలు చాలా అర్థవంతంగా ఉన్నాయి. "కళాసృష్టి", "నేనూ–నాకళ" వ్యాసాల్లో ఆయన, కళాస్రష్ట కళాసృష్టి ఎట్లా చేస్తాడు ఎందుకు చేస్తాడు అనే విషయాలను చాలా లోతుల్లోకి పోయి వివరించారు.

"చిత్రశిల్పకళా రామణీయకము" పుస్తకంలో ఆయా సందర్భాల్లో ఆయన చిత్రశిల్పకళకు సంబంధించిన వ్యాసాలే కాక వట్టికోట ఆళ్వారు స్వామి, అడవి బాపిరాజు, పైడిరాజు, పి.టి.రెడ్డి, కాపు రాజయ్య మొదలైన వ్యక్తులను గురించి వ్రాసిన వ్యాసాలు చాలా సమాచారాన్ని తెలుపుతున్నాయి. ఒక చిత్రకారుడు ఇంత మంచి భావాభివ్యక్తితో వ్యాసాలు వ్రాయటం ఇంత మంచి వచన రచన చేయటం చాలా అరుదైన విషయం.

కొండపల్లి శేషగిరిరావుకు ఉన్న చిత్రకళా నైపుణ్యం పార్శ్యాన్నే కాక అతనికి శిల్పంతో ఉన్న ప్రావీణ్యాన్ని ఈ పుస్తకం చాటుతున్నది. ఆయన కోడలు నీహారిణి ఈ పుస్తకాన్ని సంపాదీకరిస్తూ అక్కడక్కడ తగినట్లుగా చిత్రాలను చేర్చటం చాలా బాగుంది. ఆమెకు నా అభినందనలు!

***– ముదిగంటి సుజాతారెడ్డి***

పాలపిట్ట మాసపత్రిక, సెప్టెంబర్ 2012



# కొండపల్లి శేషగిరిరావు 'ది ఓరియంటలిస్ట్'

కవిని కదిలిస్తే కాలం డొంకంతా కదులుతుందని మహాకవి శ్రీశ్రీ అంటారు. కాలాన్ని, తలాన్ని (స్థలం) కట్టివేసే రంగుల ఆటకట్టు మాత్రం కొండపల్లి శేషగిరిరావుదే. గాలినీ, ఎండను, వాననూ తట్టుకుని మనదేశ ప్రాచీనతవల్లే ఏళ్ళతరబడి కదలని, మెదలని చెట్ల వేర్లలో దక్కన్ గండు శిలల్లో, పుట్టులూ, పుంజులలో సౌందర్యాన్ని పసిగట్టి తన రంగుల ప్రపంచానికి పట్టం కట్టిన కొండపల్లి చైనా, జపాన్ చిత్రకారులవలె అచ్చమైన ఓరియంటలిస్ట్, ప్రాచ్యదేశ చిత్రకారులవలె ఆయనకూడా ప్రకృతి ప్రేమికుడు. ఐరోపా చిత్రకళారీతుల ధాటికి తలవొగ్గి దేశమంతా వారి అడుగులో అడుగేసి పైకి మాత్రమే చూసుకుంటున్నప్పుడు పుట్టిన కొండపల్లి తన కాళ్ళకింద ఉన్న నేలనూ తన పక్కనే ఉన్న రాళ్ళనూ, ఇంటిముందు ఆలమందలతోపాటు తచ్చాడే కోళ్ళను చూసి గీసి రంగులద్దినవారు. పడవ సరంగుల సముద్రజలాలు, నీలి కొండల శిఖరాలు, రాచకన్యల విధివిలాసాలు, సుదూరంగా కానవచ్చే సంధ్యాకాశాలు, ముఖచిత్రాలు తదితర అంశాలు ఐరోపా అనుసరణలే చిత్రకళగా చెలామణి అవుతున్న కాలాన అందుకు పూర్తి భిన్నంగా పయనించిన తిరుగుబాటు చిత్రకారుడు శేషగిరిరావు. ఆయన చిత్రాలను అత్యధికం గీసింది వాష్ టెక్నిక్‌లోనే. ఈ కళాసాంకేతికత తూర్పుదేశాలైన చైనా, జపాన్‌లలో మాత్రమే ప్రసిద్ధి. ఆయన చిత్రాలలో సంప్రదాయానికి చిహ్నమైన పసుపుకే ప్రాముఖ్యత.

తాను 1942వ సంవత్సరాన నగరంలో అడుగుపెట్టే నాటికి ఐరోపా పోకడలకు భిన్నంగా తనదైన దారికోసం హైదరాబాద్ చిత్రకళా ప్రపంచం అన్వేషణలో పడింది. అప్పటికే అబ్దుల్ రహమాన్ చుగ్తాయి చిత్తరువులతో స్థానిక కళాప్రపంచం బిత్తరపోయి ఉంది. పర్షియన్ సౌందర్యరాశుల కనుసైగల తీరుకు షేర్ షాయరీల మంజిల్ల మెహెఫిల్‌లలో, గల్లీల గజల్ గాన సౌందర్యంలో మునిగి తేలే స్థానిక కళా ప్రపంచం వంగి వంగి సలాం చేస్తున్నది. అంతకు రెండు దశాబ్ధాల ముందే అజంతా గుహల సుందరీమణులను యథాతథంగా దించిన సయ్యద్ అహ్మద్ (ఈయన చిత్రం బుద్ధ జననం పార్లమెంట్ హౌస్‌లో ఉంది), ముఖ చిత్రాల చిత్తరువుల తయారీలో కొత్తపోకడలు పోయిన ఖయాం, హైదరాబాద్ ఆకాశాన్ని తిరుగులేని విధంగా ఏలుతున్న చిత్రరాజన్యులు.

ఇటువంటి సందిగ్ధ సంధ్యలో తచ్చాడిన కొండపల్లి శేషగిరిరావు రెడ్డి హాస్టల్‌లో ఉంటూ హైదరాబాద్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ కళాశాలలో చేరాడు. అప్పటి తెలంగాణ వ్యాప్తంగా ఆంధ్రమహాసభ తెలుగు భాషా సంస్కృతుల వికాసంకోసం ఉధృతంగా ఉద్యమిస్తున్న కాలమది. ఆయన సమీప బంధువు కొండపల్లి గోపాల్‌రావు మహాసభ వరంగల్ జిల్లాశాఖలో క్రియాశీలి. ఆయన స్వయంగా పూనుకుని ఒక సదస్సు నిర్వహణలో పాల్గొన్నారు. ఆయన రచయిత కూడా (తొలితరం తెలంగాణ కథ'లు లో ఆయన రచన ఉంది). తెలంగాణ వికాస ఉద్యమంలో తలమునకలైన కుటుంబంలో పుట్టిన శేషగిరిరావుకు చిన్ననాటి గురువువల్ల చూపు చిత్రకళపై మరలింది. ఆనాటి తెలంగాణ గ్రామీణ ప్రాంతాల నుంచి ఎవరైనా ఈ కళారంగంపై ఆసక్తి పెంచుకోవడం ఊహించరానిదే. ఇంకా ఆనాటికి ఈ కళ మొత్తంగా కొన్ని కులాల వృత్తిగానే ఉంది. వారికి రాజుల, జమిందారుల ఆదరణ ఉండేది. ఆప్పటి తెలుగునాట పరిస్థితులను చూస్తే ఈ బ్రిటిషు పాలిత ప్రాంతాల పరిస్థితి పూర్తిగా వేరు. కోస్తా ప్రాంతంలో 1915 నాటికే ఆధునిక చిత్రకళ సామాన్యునికి అందుబాటులోకి వచ్చింది. హైదరాబాద్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ కాలేజీ ఏర్పడినా అది 1930లలోనే. తెలంగాణ గ్రామీణ ప్రాంతాల నుంచి చిత్రకళారంగంలోకి ప్రవేశించి ఖ్యాతిగాంచిన నలుగురిలో ఆయన ఒకరు. మరో ముగ్గురిలో పీటీరెడ్డి, కుమారిలస్వామి ఆ తర్వాత కాపు రాజయ్య ఉన్నారు. పీటీ, కుమారిల జేజే స్కూలులో చేరారు. వరంగల్ జిల్లా మొత్తం కాకతీయ శిల్పకళకు ప్రసిద్ధి. చిన్నప్పటినుంచి వాటిని పదేపదే చూడడం వల్ల శేషగిరిరావుకు కళలపై మక్కువ ఏర్పడింది. పాఠశాలలో ప్రఖ్యాత చిత్రకారుడు, కళావిమర్శకుడు, సరోజినీ నాయుడు బంధువు దీన్‌దయాళ్ నాయుడు డ్రాయింగ్ టీచరు. రామప్ప దేవాలయం గల పాకాల అడవులకు తనతో తీసుకుపోయి శేషగిరిరావుకు శిక్షణ ఇచ్చేవారు. హనుమకొండ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న కాలంలోనే వేయి స్థంభాల గుడికి వెళ్ళి శిల్పకళను తదేకంగా చూడడం ఆయనకు ఇష్టమైన పని. ఈ వ్యాపకమే ఆయనను చిత్రకళ వైపు మళ్ళించింది. నగరానికి వచ్చిన కొత్తలో ప్రఖ్యాత రచయితలు ఆళ్వారుస్వామి, పెండ్యాల రాఘవరావు, గుండవరపు హనుమంతరావువంటి రచయితలు సహాధ్యాయులు. హైదరాబాద్ ఫైనార్ట్స్ కళాశాల నుండి 1947లో బయటపడ్డ శేషగిరిరావు తన సమకాలిక చిత్రకళా ప్రపంచంలో ఒంటరి బాటసారి. ఇదే సమయంలో ఆధునిక భావాలను స్వీకరిస్తూ వలస పాలకుల నుండి దిగుమతి అయిన ఐరోపా చిత్రకళా రీతులను, వాటి పనిముట్లను తిరస్కరించి ప్రగతిశీల కూటమి సృష్టించిన సామాన్య మానవ ప్రతినిధి తమదైన రీతిలో సృజించిన ఐదుగురు చిత్రోపాసకుల్లో ఒకరు శేషగిరిరావు. మరో నలుగురు బెంగాల్‌కు చెందిన జెమినీరాయ్, తెలంగాణకు చెందిన పీటీరెడ్డి, కాపు

రాజయ్య, ఆంధ్ర ప్రాంతానికి చెందిన పిలకా నరసింహమూర్తులు తమదైన దేశి కళారీతికి పాదులు కొల్పారు. కేవలం రాజస్థాన్, తంజావూర్, దక్కన్ బెంగాల్‌లో కొనసాగిన ప్లాట్ టటెక్నిక్‌ను యధాతథంగా తమ ఆధునిక చిత్రకళా సృజనలో చొప్పించి గొప్ప చిత్తరువులను చిత్రించిన ఈ ఐదుగురు అప్పటికే కొడుగట్టిపోతున్న తరతరాల దేశీయ చిత్రకళ సంప్రదాయరీతులను నిలబెట్టగలిగారు. జెమినీరాయ్ 'ఉమెన్', కాపు రాజయ్య 'పాలు అమ్ముకునే స్త్రీలు' పిలకా నరసింహమూర్తి 'జానపద వీరుడు' ఈ కోవకు చెందినవే. శేషగిరిరావు సమకాలికుడు, హైదరాబాద్‌కు చెంది బొంబాయిలో స్థిరపడ్డ ఎంఎఫ్ హుస్సేన్ ఉపయోగించింది ఈ ప్లాట్ టెక్నిక్‌నే. జపాన్ చైనా దేశాల్లో ప్రఖ్యాతిగాంచిన వాష్ టెక్నిక్‌లో తర్ఫీదు పొంది హైదరాబాద్ నగరంలో ఆంధ్రదేశాన నిపుణతను సాధించిన ఏకైక చిత్రకారుడు శేషగిరిరావు. పల్చటి నీటి రంగులతో చిత్రణకు ఉపయోగించే ఈ సీదాసాదా చిత్రకళా రీతిని భారతదేశానికి పరిచయం చేసింది రవీంద్రనాథ్ టాగూర్, నందలాల్‌బోస్, అబ్దుల్ రహ్మాన్ చుక్తాయిలు. వీరిలో నందలాల్ బోస్‌కు శిష్యుడైన ప్రమోద్‌కుమార్ చటర్జీ కోస్తా చిత్రకారులకు ఈ చిత్రలిపిలో తర్ఫీదునిచ్చినప్పటికీ వారు తమదైన ముద్ర వేయలేకపోయారు. నవాబ్ మెహదీ నవాజ్‌జంగ్ సిఫారసుతో 1947లో శంతినికేతన్‌కు వెళ్ళిన శేషగిరిరావు టాగూర్ మేనల్లుడు మహాచిత్రకారుడైన అవనీంద్రనాథ్ టాగూర్, నందలాల్‌బోస్‌ల దగ్గర వాష్‌టెక్నిక్‌లో శిక్షణ పొందాడు. అబ్దుల్ రహ్మాన్ చుక్తాయి నీటి చిత్రణలో ఆరితేరినవాడు (హైదరాబాద్ స్టేట్ మ్యూజియంలో ఈయన కళాఖండాలు 48 ఉన్నాయి.) ఆయన చిత్రాలను 1930వ దశకంలోనే నిజాం ప్రభుత్వం సేకరించి మ్యూజియంలో ప్రత్యేక గ్యాలరీని ఏర్పాటు చేసి ప్రదర్శనకు పెట్టింది. చుక్తాయి ప్రభావం శేషగిరిరావు, బాపులపై అంతకుముందు పిటి రెడ్డిపై ఉందనేది విజ్ఞుల అభిప్రాయం. నీటి చిత్రణలో తనదైన ముద్ర వేసిన శేషగిరిరావు చిత్రాలు ప్రసాద్ ల్యాబ్స్‌లో రెండు ఉన్నాయి. అందులో ప్రఖ్యాతిగాంచిన శకుంతల మరొకటి వరూధిని ప్రవరాఖ్యులు.

**– ఎస్. జగన్ రెడ్డి**

28.07.2012, ఆంధ్రజ్యోతి

# 'కొండపల్లి' రంగుల దుర్గం అనితరం .. అసాధ్యం

ఆకుపచ్చ రంగుల్లో ముద్రితమైన ఈ చిత్రంలో తాను ఒదగనంటున్నట్లుగా జీవం పోసుకుని ఈ ప్రపంచంలోకి దూసుకువస్తున్నట్లుగా జవ్వని శకుంతల, జీవితంలో ఆదర్శాలను వల్లించడమే కాదు ఆచరించిన చిత్రకారుడు కొండపల్లి శేషగిరిరావు చిత్రరాజంలో కణ్వ ఆశ్రమంలో శకుంతల అత్తింటి పయనం ఘట్టం ఒకటి చాలు ఆయన చిత్తరువుల ఖ్యాతి ఖండాంతరాల వెలుగును ప్రసరింపజేస్తుంది. తెలుగునాట ముంగిట్లలో వెలిసే ఆడపడుచుల ముగ్గులపై ఆయన ముచ్చటైన అధ్యయనమే చేశారు. జానపద కళాకారుల సృష్టికి ఆయన ప్రాచుర్యత కల్పించారు. ఎక్కడో వరంగల్ జిల్లాలో మారుమూల ప్రాంతాలలో తరతరాల నుంచి మట్టితో తయారయ్యే నకాషీ బొమ్మలకు, రంగుల్లో చిత్రించబడే రామాయణ, మహాభారత, ఎల్లమ్మ, పోచమ్మ గాధలకు ఆయన ఖ్యాతి కల్పించారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్టి రామారావు హయాంలో కొండపల్లి వారే తెలుగుతల్లి బొమ్మకు దృశ్యరూపం ప్రసాదించారు. అప్పుడే తెలుగు జాతి వైభవం పేరిట ఆయన గీసిన సంపూర్ణ కళారూపం వన్నెతరగని ఆయన కళాత్మకతకు నిదర్శనంగా నిలుస్తుంది. చిత్రకారుడిగా, అధ్యాపకుడిగా ఆయన సాగించిన ప్రస్థానం ఎందరికో ఆదర్శంగా నిలుస్తుంది. తాను ఎక్కడికి వెళ్ళినా అక్కడి మరుగున పడిన కళారూపాలను పలకరించేవారు. పదిమందికి పరిచయం చేసే బాధ్యత తీసుకునేవారు. వరంగల్ ప్రాంతంలో పరిచయమైన కాకిపడగలు వంటి కళారూపాలకు ఆయన చేసిన వ్యాఖ్యానాలు చిరస్థాయిగా నిలుస్తాయి. ఆయన చిత్రాలలో రంగుల మిళితం సంగీత భరితంలా తోస్తుంది. తెలుగుదనం ఉట్టిపడే ఆహార్యం ఆయన సొంతం. ఏ ఘట్టాన్ని చిత్రించినా నేపథ్యంలోని ప్రతి అణువణువునూ తన కళాత్మకతతో పలకరించి వాటికి జీవం పోయడం కొండపల్లి ఘనత. ఓ చంద్రదర్శనం తరువాత జనాలకు ఎంతటి హాయానుభూతి కలుగుతుందో కొండపల్లి చిత్రాల వీక్షణం అనంతరం అంతటి భాగ్యమే కలుగుతుంది. ఆయన పురస్కారాల కోసం పరుగులు తీయలేదు. ఎప్పుడూ తాపీ ధర్మారావే. చేతిలో నశ్యం డబ్బా, తెల్లటి దుస్తులు, పైన నెహ్రూ స్వెట్టర్, మఫ్లర్, తన ఇంటి బయట బాదం చెట్టు నీడలో, ఎగిరే పతంగులలోనూ రంగుల లోకాన్ని సందర్శించిన ఘనుడు. ఈ చిత్రకారుడిది ఓ కుగ్రామం.

చదువుకోసం వాగులు వంకలు దాటి ఆరేడు మైళ్ళు నడిచి గురువుల బోధనలతో బతుకును తీర్చిదిద్దుకున్నాడు. ఓ ఇంద్రధనుసు ఆకాశంలో తళుక్కుమన్న రోజు ఆయనకు రంగుల లోకంపై మనసు పడింది. ఊర్లో పొలాల మధ్య కన్పించే ఆరుద్ర పురుగులలోని కుంకుమ వన్నెలు, సీతాకోకచిలుకలలోని పొందికైన వర్ణాలు, పరుగులు తీసే సెలయేళ్ళు, కమ్మని కోకిలల సరాగాలు ఇవన్నీ ఆయనలోని కళాత్మకతను తట్టిలేపాయి. ఆ తరువాత అప్పటికి ఎవరూ చేయని సాహసం చేసి ఏకంగా బెంగాల్‌కు సాగిపోయాడు. అక్కడ శాంతినికేతన్‌లో చేరాడు. రవీంద్రనాథ్ టాగూర్ స్థాపించిన ఈ నికేతన్ దేశంలోని ఎందరో ఆణిముత్యాలైన చిత్రకారులకు ప్రాణం పోసింది. వారిలోని కళా తపనకు రూపం ఇచ్చింది. అక్కడ ఓ పరిపూర్ణ విద్యార్థిగా ఎదిగిన తరువాత ఈ కళాకారుడు హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. అప్పట్లో వితంతు వివాహం అంటే ఏదో పాపం చేసినట్లుగా చూసేవారు. అయితే తనలోని మానవతావాదంతో ఆ కళాకారుడు ఓ వితంతువును పెళ్ళి చేసుకున్నాడు. ఆమె జీవితంలో వెన్నెల వెలుగులు కురిపించాడు. ఆమె తన జీవిత భాగస్వామి అయిన నాటి నుంచి ఆయనలోని కళా నైపుణ్యం మరింతగా పరిమళించింది. ఎందరి ప్రశంసలనో అందుకుంది. తన భార్యనే తన చిత్రాలకు తొలి విమర్శకురాలు. ఆమె స్పందన ఆధారంగానే తన చిత్రాలకు మెరుగులుదిద్దేవాడు. పద్మశ్రీ బిరుదుల కోసం ఆయన పరుగులు తీయలేదు. పైరవీలు చేయలేదు. జాతికి ఆణిముత్యాల్లాంటి బొమ్మలను అందించిన ఆయనను కాదని చివరికి గల్లీ కుర్రోళ్లకు కూడా పద్మశ్రీలు, ఇతర శ్రీలు, సిరులు ఇప్పించిన ఘనత వహించిన నేతలున్న నేల మనది.

ఈ సుడిగుండపు లోకం వదిలి, రంగుల లోకంలో పయనమయ్యారు. అక్కడ తన సహధర్మచారిణితో రంగుల కలల్లోనే విహరిస్తాడని భువిలో ఆయన రంగులు ఇంటింటా ముగ్గులు మెరిసినంత కాలం నిలిచి ఉంటాయని అంతా ఆశిస్తున్నారు. సహస్రచంద్ర దర్శన భాగ్యశీలి ఆయన... జాంపండు లాంటి మేనిఛాయ గల ఓ చిత్రకారుడా... ఓరుగల్లు ఖ్యాతిని నయాగరా వరకూ ప్రవహింపచేసిన మొనగాడా .. కుంచెతో అందాల లోకపు అంచుల వరకూ సాగినవాడా... అక్షరం ఉన్నంతకాలం, రంగులు విరజిమ్మినంత కాలం కొండపల్లి బొమ్మ తెలుగునాట కొంగుబంగారమే నిత్య సింగారమే.....

***- వార్త ఎడిటోరియల్***

28.07.2012

# బొమ్మల కొండపల్లి!

కొండపల్లికీ బొమ్మలకూ ఏదో సంబంధం ఉందనిపిస్తుంది. కృష్ణా జిల్లా కొండపల్లిలో 30 కుటుంబాలకు చెందిన ఆర్య క్షత్రియులు 'తెల్ల పొణికి' కర్రతో అద్భుతాలను నాలుగు శతాబ్దాలుగా సృష్టిస్తున్నారు. హైదరాబాద్‌లోని దోమల్‌గూడలో కొండపల్లి శేషగిరిరావు గారు కంటికింపయిన రంగుల్లో మహాద్భుతాలను – ఏడెనిమిది దశాబ్దాలపాటు – సృష్టిస్తూపోయారు. ఆ కొండపల్లి బొమ్మలూ, ఈ కొండపల్కి బొమ్మలూ కూడా ప్రపంచమంతటా తెలుగువాళ్ళ జెండా ఎగరేశాయి.

## లాలిత్యం–లావణ్యం

ఎనభై ఎనిమిదేళ్ళ వృద్ధాప్యంలో భార్యపోయిన ఒంటరితనంలో ఇక కట్టెని ఈడ్వలేక కన్నుమూశారు సుప్రసిద్ధ చిత్రకారులు – మంచి మనిషి – డాక్టర్ కొండపల్లి శేషగిరిరావు. సంస్కారం – లాలిత్యం – లావణ్యం నిండిఉండే ఆయన చిత్రాలయినా మనకు మిగిలినందుకు సంతోషించాలి. ఒక సీతనూ, సావిత్రినీ, శకుంతలనూ, వరూధినినీ, రాణీ రుద్రమనూ, ఒక నన్నయనూ, పోతననూ, త్యాగయ్యనూ, అన్నమయ్యనూ – తెలుగుతనం మూర్తీభవించే తీరులో – తీర్చిద్దిన కొండపల్లికి మన జాతి కలకాలం రుణపడి ఉంటుంది. ఎన్నడూ రాముణ్ణి చూడని తనకు ఆ భాగ్యం కొండపల్లి శేషగిరిరావు బొమ్మలద్వారానే దక్కిందనీ విప్లవ కవి వరవరరావు చెప్పడం గమనార్హం.

## మూలమలుపు

వరంగల్ జిల్లా మహబూబాబాద్‌ను స్థానికులు, దాని పూర్వనామమయిన మానుకోట పేరిటే వ్యవహరించడం కద్దు. ఆ మానుకోట సమీపంలోని పెనుగొండే కొండపల్లి జన్మస్థలి. 1924 జనవరి 27న మానుకోటలో పుట్టిన శేషగిరిరావు చిన్ననాటనే చిత్ర రచనపట్ల మక్కువ ప్రదర్శించారుఈ ఆయన ఉపాధ్యాయవర్గం కొండపల్లి ఆసక్తిని గమనించి, ఆ రంగంలో అన్యులకు అసాధ్యమయిన ఎత్తులను అధిరోహించేలా ప్రోత్సహించారు. అయితే అది తొలిమెట్టు మాత్రమే నవాబ్ మెహ్‌దీ యార్ జంగ్ ఆదరణ పుణ్యమాని శేషగిరిరావు

రవీంద్రుడి శాంతి నికేతనానికి వెళ్ళి, నందలాల్ బోస్ శిష్యరికంలో ఒక సంవత్సరం పాటు మెలకువలు నేర్చుకుని రావడం ఆయన జీవితాన్నే మలుపు తిప్పిన పరిణామం. మన దామెర్ల, వరదా, అడివీ, మాగోఖలే, రాజాజీ వేసిన చిత్రాలకూ – కొండపల్లి బొమ్మలకూ తేడాలకన్నా పోలికలే ఎక్కువ!

## సాహిత్యమే మోడల్!

కొండపల్లి వేసిన భక్త పోతన చిత్రం (1982లో ఆంధ్ర సచిత్ర వార పత్రిక ముఖచిత్రంగా వచ్చింది) ఇప్పటికీ చిత్రకళా విద్యార్థులకు పాఠ్యాంశంలా పనికొస్తోంది. ఆంధ్ర మహా భాగవతాన్ని మథించి దానికర్త ముఖ కవళికలను తీర్చిదిద్దడమనే మెథడ్‌లోనే ఉంది ఆ బొమ్మ విశిష్టత. వీరేశలింగం అనువాదం చేసిన అభిజ్ఞాన శాకుంతలం క్షుణ్ణంగా చదివి, కొండపల్లి వేసిన శకుంతల బొమ్మలు అప్పట్లో ఓ సంచలనం. ముఖ్యంగా కొలను నుంచి నీళ్ళు తెచ్చుకునే శకుంతల వెనక్కి తిరిగి (దుష్యంతుడిని?) చుస్తున్న భంగిమలో వేసిన చిత్రానికి వందల సంఖ్యలో నకళ్ళు 'ఉత్పత్తి' కావడం ఓ చరిత్ర! 'మనుచరిత్ర'లో పెద్దన సృష్టించిన వరూధినే కొండపల్లికి 'మోడల్' జానపద, చారిత్రక, పౌరాణిక గాథలనే మూలాలుగా తీసుకుని బొమ్మల్లోకి అనువదించడమనె ప్రక్రియలో కొండపల్లి శేషగిరిరావుకు సరిసాటి ఎవరూ లేరనే చెప్పాలి.

## తెలుగుబొమ్మే....

కార్టూనిస్ట్ మోహన్ చెప్పినట్లు తెలుగువాడు తెలుగు బొమ్మే వెయ్యాలన్న సందేశం ఇస్తాయి కొండపల్లి బొమ్మలు. రవివర్మ ప్రాధాన్యం తగ్గించే కుట్రలో భాగంగా ఆయనను 'క్యాలెండర్ ఆర్టిస్ట్'గా కొట్టిపారేసే మహానుభావులున్నట్లే, కొండపల్లిని నియో క్లాసిసిస్టుగా తీసిపారేసే ప్రభుద్ధులు కూడా ఉన్నారు. వీళ్ళలో ఎందరు ఆయన వేసిన ప్రకృతి దృశ్యాలనూ, జానపదుల చిత్రాలనూ చూశారో అనుమానమే. కళాకారులకు లేబిల్స్ తగిలించడం తేలిక–వాళ్ళ కృషి వెనకాల ఉన్న స్ఫూర్తిని అర్థం చేసుకోవడం కష్టం.

కొండపల్లి శేషగిరిరావు జీవితం–కృషి–వ్యక్తిత్వాలను ఆవిష్కరిస్తూ, ఆయన గురించి ప్రముఖ చిత్రకారుల అభిప్రాయాలను రికార్డు చేస్తూ ధన్‌రాజ్ తీసిన డాక్యుమెంటరీ చిత్రం యూ ట్యూబ్‌లో దొరుకుతుంది – ఇదీ లింకు: http://www.youtube.com/watch?v=OnRgg3d2uls&feature=playerdetailpage

**– పారక్**

30/7/2012, సాక్షి

# కొండంత భాగ్యం.... శేషగిరిరావు

శాంతాకారం, ప్రశాంత నిష్క్రమణం ఆయనది!

శాస్త్రం, సాంప్రదాయం అంటూ చివరంటా పట్టుకువేళ్ళాడి, మనసుపడి, ప్రాణంపెట్టి మాట్లాడే పెద్దాయన, చిత్రకళని ఒళ్ళంతా వ్యసనంలా పట్టించుకున్నాయన కొండపల్లి వారు....మరి లేరంటే అసలు హైదరాబాద్ నగరమే బెంగపెట్టుకోదా! గంటలకొద్దీ అమరావతి శిల్పాల్లో ఆభరణాల వివరాల నుంచీ నకాషీ రంగుల తయారీ వరకు చెప్పుకుపోయే గొప్ప ఉపాధ్యాయులాయన.

సన్నగా, పల్చగా పొడవుగా, పచ్చగా, పొడవాటి పాయింట్ బ్రెష్‌ని వదలకుండా పహాడీ, బసోలీ చిత్రకళ, చింతపిక్కల గుజ్జు దట్టీవేయించి, సహజ వర్ణాలు నూరుకునే వివరాలూ చెబుతూంటే ఆయన ధార ఆగదు... తమ శాంతినికేతన్ విద్య, హైదరాబాద్‌లో నవాబు కాలపు పాత మిత్రుల కళాశైలి, ఆపై ఫైనార్ట్స్ కాలేజీలో పాత గురువుగా ఆయన అనుభవాలన్నీ సునాయాసంగా నిషా ఎక్కించేలా ఉంటాయి.

పూర్వం కృష్ణాపత్రిక, ఆంధ్రపత్రిక, భారతి వగైరాల్లో వజ్రోత్సవ ప్రత్యేక సంచికల్లోనూ నలుపు తెలుపుల్లో, ఓ మాదిరి రంగుల్లోనూ అచ్చయిన శేషగిరిరావుగారి బొమ్మలేగాదు, ఆయన సంతకం కూడా మరో తీరున ఉండేవి. పత్రికల్లో ఆయన చిత్రకళ మీద రాసిన వ్యాసాలు, ఇచ్చిన ఇంటర్వ్యూలూ సద్విమర్శ, విశ్లేషణ, సమీక్షా...వెరసి చిత్రకళా చరిత్ర మొత్తం గొప్ప ముచ్చటలుగా గుర్తుండిపోతాయి మనకు. భారతీయ శిల్పం, మరీ ముఖ్యంగా కాకతీయ శిల్పం, అజంతా, లెపాక్షి చిత్రాలు ఆద్యంతం అరిగించుకుని వాటిని యథాతథంగా జిరాక్స్ తీసినట్టుగాక వాటి శైలి కొనసాగింపులాగ, సారాంశంలాగ ఆయన ఉద్యమించి బొమ్మలు, డిజైన్‌లూ వేసి మన తెలుగువాళ్ళకి అందించారు. అటు బెంగాలీ హోరు, ఇటు మహా మినియేచర్ జ్వరం పట్టుకోగా సొంతశైలి, లేక సాంప్రదాయ తెలుగుశైలి అంటూ ఏదీ మిగలకుండా పోయిన ఆయన తరం వారెందరో లేకపోలేదు. అక్కడే శేషగిరిరావుగారు కుదురుగా నిలబడి ఒకతీరు ఎంచుకున్నారు. రామాయణ దృశ్యాలు, ఇతర తెలుగు, సంస్కృత కావ్యదృశ్యాలూ సాధారణిలస్ట్రేషన్‌లలా గాక అతి జాగ్రత్తగా ప్రతి పరిశోధకాంశాన్ని పెయింటింగ్‌లో చూపెడుతూ తమ చిత్రాలకు కావ్య గౌరవాన్ని

చేకూర్చారు. ప్రాచీన సంస్కృతాంధ్ర సాహిత్య విశేషాలు తెలుగు మహాకవుల స్థాయిలో చెప్పగల లోతు మనిషి కనుక ఆయన చిత్రాల్లో రంగులు, ఆకారాల ఏర్పాటూ మహాహుందాగా ఉంటాయి.

మ్యూరల్, ఫ్రెస్కో-రెండింటా అధ్యయనం ఉన్నాయన గనుక ఆయన బొమ్మలు బలమైన రంగుల్లోనే ఉంటాయి. ముఖ్యంగా రేఖలు. ఆయన మాటల మధ్యలో చిత్ర శిల్పకారులకు స్పష్టంగా ఒకశైలి ప్రాచీన కాలం నుంచీ నేటివరకు కొనసాగుతూ వస్తుంటే మనకొక శైలి దర్జాగా లేకపోవడమేమిటి?" అంటూ ఆయన తన కట్టుబాటు చిత్ర ప్రదర్శనలా చూపెట్టేవారు.

అలాగని శేషగిరిరావుగారు వట్టి కొయ్య బొమ్మలాగా ఒకేచోట నిలిచిపోలెదు. విశేష ధర్మంలాగ తెలుగు సాంప్రదాయశైలి సాగిస్తూనే తన సొంత ఆసక్తిలో ఆవగింజ మాత్రం కూడా వదులుకోకుండా ఆధునిక చిత్రకళలో 1960లనాటి ఆధునికతను కొంత ప్రయత్నించారు. నాటి చిత్రాల్లో చనిపోయిన ఆవు, రహదారి దృశ్యాలూ వాటి ఆకారాల్ని కొత్తగావేసే పద్ధతికి కృషిచేశారు. దీనికన్నా ఆయన ఎక్కువగా చైనా ఆర్టిస్టుల సాంప్రదాయ శైలిని మంచినీళ్ళు తాగినంత సులభంగా పట్టుకున్నారు. తమ సంతకం కూడా చైనీస్ 'ముద్ర'ల్లాగ! ఇంకు రంగుల కోళ్ళు, నెమళ్ళు, మంచుపట్టిన గడ్డి, గుట్టలూ మన చుట్టూ పెరేడ్ చేసినట్టు కనిపిస్తాయి. ఇదంతా పక్కన పెట్టేసి కొంతకాలం కొండపల్లివారు దక్కనీ రాళ్ళ పనిపట్టారు. అందమైన బండరాళ్ళను అంత బరువుగా తాకితే స్పర్శ తెలిసేంతగా ఒక టెక్నిక్ సంపాదించారు. డ్రైపేస్టల్‌తో కొంత గరుకుగా ఉండే కాయితం మీద లాగించెయ్యడం కాదు - రంగు కలిపి దాన్ని బ్రెష్‌తో వాడే పద్ధతిలోనే ఏదో మాయ చేసిపెట్టారాయన. ఒకే స్ట్రోక్‌లో రెండుమూడు రంగులు కలిసి ఒకే ఛాయపట్టడం అన్నమాట. నమస్కారం పెట్టి బుద్ధిగా ఆయన ముందు చేతులుకట్టుకుని కూర్చోవలసిందే!

బాగా ఓపిక ఉన్న కాలంలో తెలంగాణ దేవాలయాలు తిరిగి కాకతీయశైలి గల ప్రతి శిల్పంలోని డిజైన్ ఒక్కటైనా విడవకుండా అధ్యయనం చేయడమే కాదు సరసరమని ఇంకు నల్లగీతల్లో కాగితాల కొద్దీ నిక్షేపం చేసి ఉంచారాయన. కాకతీయ నంది మీద శిలా జలతారు ముళ్ళు, పూసలపేర్లు, చిరుగంటల పట్టీల కట్టు, స్థంభాల డిజైన్‌లో కూర్చిపెట్టిన ముద్రలూ, ఒకటేమిటి - అన్నీ సర్వ సమగ్రంగా, సుఖంగా గీతల్లోకి అనువాదం చేసి ఉంచారాయన. స్కెచ్‌లు, బలమైన డ్రాయింగ్‌లు వెరసి కాకతీయ శిల్ప ఘన సౌందర్యం 'దించి'పెట్టారు. అధ్యయనవేత్త, పరిశోధకుడైన ఉపాధ్యాయుడూ ఒకటైన చిత్రకారుడు గనుక కొండపల్లివారు ఆ తరానికి అసలు గుర్తు. మంచిగ వేసిన మన బొమ్మ ఆయన!

కొండపల్లివారికొక సభ పెట్టేసి మనం తప్పుకో జూస్తే అది గొప్ప అధర్మం కదూ?! మరి చేయవలసింది చాలానే ఉంది. ముఖ్యంగా ఆయన వ్యాసాలు, ఆయన స్కెచ్‌లు రంగు బొమ్మలూ భారీ పుస్తకంగా వేయటం అత్యవసరం. ఉస్మానియా, తెలుగు యూనివర్సిటీలు, మ్యూజియంలూ ఆయన బొమ్మల్ని కొని మరీ సగర్వంగా అందరూ చుసేలా ప్రదర్శించాలి. సాంస్కృతిక శాఖవారు, విశ్వవిద్యాలయాలు ఆయన పెయింటింగ్స్‌ని భారీ సైజు కేలండర్‌లుగా అచ్చువేసి తీరాలి. ఆయన స్మృతిలో ఈపాటి పనులయినా చేయకపోతే తెలుగువారు వట్టి నిరర్థకపు ఉద్రేకులుగా మిగిలిపోవటం ఖాయం.

***– శివాజీ***

28/7/2012, సాక్షి



# ప్రాచ్య చిత్రకళ జీవనాడి: 'కొండపల్లి'

రోజులు గడుస్తున్నకొద్దీ కొందరి మరణం పూడ్చలేని లోటులా ఉంటుంది.

చాలామంది మరణం తక్షణం తీరని బాధలా అనిపించినా రానురాను పెద్ద లోటులా కనుపించదు.

ఆ మరణించినవాడు చేసిన కృషి ఇతరులెవరూ చేయలేరనిపించినపుడు మాత్రం తెలియని లోటు మనని వెంటాడుతుంది. వ్యక్తిగతంగా కాకుండా సమాజపరంగా ఫీల్ అయినప్పుడు ఆ వ్యక్తి ఎంతటి చిన్నవాడైనా, గుర్తింపు లేని వాడైనా మనకి గౌరవం రెట్టింపు అవుతుంది. వ్యక్తులే కాదు సమాజం కూడా వినమ్రంగా గుర్తు తెచ్చుకుంటుంది.

అదో అలాంటి మరణం ఒకటి మొన్న 26 జులై 2012న సంభవించింది. మరణించిన ఆ మనిషి పేరు కొండపల్లి శేషగిరిరావు. అతని ప్రవృత్తి, వృత్తి చిత్రకళారంగం. బొమ్మలు గీయడమే అతని పని. బొమ్మల గురించి ఆలోచించడమె అతని శ్వాస. రంగులతో బొమ్మలకి ప్రాణం పోసిన చిత్రకారుడుతన శ్వాస వదిలాడు. అతను సృష్టించిన తైల వర్ణాలు, నీటి రంగుల బొమ్మలు ఒక్కసారి చెల్లాచెదురైనాయి. తన కుంచె ద్వారా ప్రాణప్రతిష్ట చేసిన భారత, రామాయణ పౌరాణిక పాత్రలు కేన్వాసుపై జీవిస్తూ, తమని రూపొందించిన సృష్టికర్త తీరం దాటడంతో అనాథ శిశువులయ్యాయి. అలాంటి బొమ్మలను, అలనాటి ఆకారాలను సృష్టించేవాడు ఇక లేకపోవడంతో చిత్రకళా లోకం తల్లడిల్లింది.

ప్రాచ్య చిత్రకళ చివరి జీవనాడిని కోల్పోయింది. ఆధునిక వర్ణాలు మసకబారాయి. ఆరెంటిని కలిపిన ఒక ప్రయోగవాది ఇక ముందు కనుపిస్తాడా. తన జీవితాన్నే ప్రయోగంగా మలుచుకున్నవాడు కొండపల్లి. వరంగల్ జిల్లా కేసముద్రం మండలంలో మారుమూల పెనుగొమడ గ్రామంలో పుట్టి, వరంగల్‌లో విద్యాబుద్ధులు నేర్చి హైదరాబాదు ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో చేరి చిరతలేఖనం అభ్యసించాడు. ఆ తరువాత శాంతినికేతన్ వెళ్ళి నందలాల్‌బోస్ వద్ద శిక్షణ పొందాడు.

1924లో పుట్టిన శేషగిరిరావు 1950లో ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో అధ్యాపకునిగా చేరాడు. అంటే నేర్చుకోవడం ఆపి శిక్షణకు అంకితమయ్యాడు. అధ్యాపకునిగా తన బాధ్యత, కర్తవ్యాలకి వన్నె తెచ్చాడు. వందలాదిమంది పేరెన్నికగన్న శిష్యులను

తయారుచేశాడు.

చిన్నతనంలో సాతాని అయ్యవారు వేసిన హనుమంతుని బొమ్మతో చిత్రాల పట్ల మక్కువ పెంచుకున్నాడు. ఆ మక్కువతో గ్రామీణ రంగంలో దాగిన చిత్రకళని జీవితాంతం విస్మరించలేదు. చేర్యాల జానపద చిత్రాల గురించి మొదటిసారిగా లోకానికి వెల్లడించింది కొండపల్లే.

1979లో హైదరాబాద్‌లోని సూర్యానగర్‌లో మా పక్క ఇంటిలో ఉండే ఆనాటి కమ్యూనిస్టు నాయకుడు చకిలం యాదగిరిరావుకి కొండపల్లి దగ్గరి బంధువు. ఆయనని కలవడానికి కొండపల్లి వచ్చినప్పుడు జనగామ ప్రాంతం పోరాటాల గురించి మాట్లాడుకునే సందర్భంలో చేర్యాల పేరు తీశారెవరో. వెంటనే ఉద్యమం గురించి ఆపి చేర్యాల చిత్రకళ గురించి అక్కడున్న వాళ్ళకి ఆసక్తికరంగా చెప్పాడు. ఆప్పుడు పటం చిత్రకళ, మంద హెచ్చుల చెక్కబొమ్మల గురించి తెలియదు. కాని ఆయన చెబుతుంటే ఎన్నడైనా అటువేపు వెళ్ళినప్పుడు తప్పక చూడాలని అనిపించింది.

మరోసారి తెలుగు అకాడమిలో పుస్తకాలు కొనడానికి వచ్చి బెంచిపై కూర్చున్న కొండపల్లిని చూశాను. లంచ్ టైం కాబట్టి విక్రయశాల మూసివేశారు. ఆ అరగంట ఆయనతో గడిపాను. యాదగిరిరావు పోరాటం గురించి ఎంతో విశ్లేషణాత్మకంగా చెప్పారు. ఆయనలో దాగిన వామపక్ష సానుభూతి వ్యక్తం అయింది. ఆ తరువాత అతను మగ్దుం, కాళోజి, రావి నారాయణరెడ్డి వంటి వారితో పనిచేశాడనితెలిసింది. రాజకీయ రంగంలో ఉద్యమకారులు, చిత్రరంగంలో సంప్రదాయవాదులు అతని గురువులు. పాఠశాలలో దీన్‌దయాళ్‌నాయుడు, శంకరరావు, ఫైన్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ అహమద్ వంటివారు అతని అధ్యాపకులు.

సంప్రదాయ చిత్రకళా విధానం అతని ప్రాణం ఆధునిక చిత్రకళ పట్ల మక్కువ. ఈ రెంటినడుమ వైరుధ్యం లేదని నిరూపించాడు. వాటి వారధిగా కొండపల్లి నిలిచాడు.

తాను హనుమకొండలో, హైదరాబాదులో వారాలు చేసి చదువుకున్న అనుభవం మరిచిపోలేదు. అందుకే తన శిష్యులు కష్టాలు పడకుండా, వారికి సంపూర్ణమైన సహకారం ఇస్తూ చిత్రకళ మెలకువలు నేర్పేవాడు.

1947లో శాంతి నికేతన్‌లో దేశ విదేశాల చిత్రాలు చూశాక అతనిలో నిద్రాణమైన కళాభినివేషనం మిక్కుటమైంది. తనదైన శైలికోసం పరిశ్రమించడం మొదలైంది. 1949లో జరిగిన భారతీయ చిత్రకళా ప్రదర్శనలో మొదటి బహుమతి గెలుచుకున్నాడు. అభినవ పోతన వానమామలై వరదాచార్యతో ఆదిలాబాదు జిల్లాలో పర్యటించాడు. దాదాపు అదే కాలంలో మహాకవి పోతన చిత్రాలు గీశాడు.

ఎన్ని చిత్రాలు గీసినా ఏక వ్యక్తి ప్రదర్శనలు మాత్రం రెండే ఇచ్చాడు. ఆధునిక చిత్రకళకుండే ఆకర్షణ సంప్రదాయ చిత్రాలకు లేకపోవడం ఒక కారణం. రెండోది ఒక చిత్రకారుడిగా పేరు ప్రఖ్యాతుల కోసం వెంపర్లాడే స్వభావం లేకపోవడం. తనకు నచ్చిన చిత్రాలు తాను వేసుకుంటూ బహుమతులు, సత్కారాలకు దూరంగా ఉండే మనిషి అతను. డబ్బు కొరత వల్ల కూడా తన చిత్రాల ప్రదర్శన ఏర్పాటు చేయలేకపోయానని దగ్గరి వాళ్ళ వద్ద చెప్పేవాడు.

నిజానికి చిత్రకళ కాసుల కళ. కాని కొండపల్లి దానిని పౌరాణిక కళగానే భావించాడు. ఒక పౌరాణికుడు తన ప్రదర్శనని ఎంత నిజాయితీగా ఇచ్చేవాడో కొండపల్లి కూడా తన కళని అంత పవిత్రంగా చూసుకునేవాడు. అతని స్వభావం లోనే అవకాశాల కోసం వెంపర్లాడే తత్వం లేదు. ఎలాంటి భావజాలం అయినా అతడిని అంతగా ప్రభావితం చేసేది కాదు. తన అనుభవం ద్వారా జ్ఞానాన్ని, కళని సాధించేవాడు. అంకిత భావంతో వర్ణాలను గౌరవించేవాడు. కేన్వాసు అంటే డబ్బులు కురిపించే యంత్రం కాదు అని నమ్మేవాడు.

తనలాగే శిష్యులు ఉండాలనుకునేవాడు కొండపల్లి. చిత్రకళ పట్ల అంకితభావం, సంస్కృతి సంప్రదాయాల నుండి రేఖలను నిర్మించే విధానం, శ్రమ వంటివి విద్యార్థికి ముఖ్యం అని నమ్మేవాడు. అందుకే అతని శిష్యులు తోట వైకుంఠం వంటివారు గురువుని మించిన శిష్యులు అయ్యారు.

చిత్రకళారంగంలో వెలుగుకు రాని అంశాలను పరిశోధించే జిజ్ఞాసి. రామప్ప ఆలయం శిల్పరీతిని తనదైన శైలిలో బయటిలోకానికి తెలియజెప్పాడు. స్త్రీలు ఇంటిముందు వేసుకునే ముగ్గుల ప్రాశస్త్యాన్ని గురించి రాశాడు. చేర్యాల చిత్రకళ గురించి రాశాక విదేశీ చిరతకారులు అక్కడికి వెళ్ళడం మొదలైంది.

ఇరవై ఏళ్ళ తరువాత నేను చేర్యాల వెళ్ళి ఆ చిత్రకారుల చిత్రాలు చూసి ఆశ్చర్యపోయాను. జానపద కళలు, కుల గాధలకూ, కళకి గల అవినాభావ సంబంధం మొదటిసారిగా తెలియవచ్చింది. సుమారు పన్నెండు కుల గాథలకు ఆరు నుండి పది గజాల పట చిత్రాలు ఉంటాయి. వాటిని నకాశి చిత్రకారులు వేస్తారు. గుడులపై బొమ్మలు, గుడులలో వివిధ రకాల విగ్రహాలు తయారు చేయడంలో వీరు సిద్ధహస్తులు. 1990 ప్రాంతంలో తెలుగు విశ్వవిద్యాలయంలో నకాశీ చిత్రకళ ప్రదర్శన, శిక్షణ శిబిరం ఏర్పాటు చేశాను. కొండపల్లి తరువాత మరో తరానికి ఆ కళని పెద్దఎత్తున ప్రచారం ఇవ్వగలిగిన సంతృప్తి కలిగింది. అందుకు కొండపల్లికి కృతజ్ఞతలు చెప్పుకొనవలసిందే.

చిత్రకారుడైన కొండపల్లి సాహిత్యపరులతో దగ్గరి సంబంధం ఉండేది. చిత్రకళ

గురించి ఎన్నో వ్యాసాలు రాశాడు. ఎంతో మందిని ప్రోత్సహించాడు. గుప్పున వెలిగి చప్పున చల్లారే నిప్పు కాదు కొండపల్లి. తీసినకొద్దీ అతని శ్రమ వెలుగులోకి వస్తున్నది. అతని చిత్రాలు భారతీయ చిత్రకళకి అందమైన ఆభరణాలు.

అతని లేని లోటు తీర్చేవారు లేరంటే అతిశయోక్తి కాదు.

**- జయధీర్ తిరుమలరావు**

ఆంధ్రభూమి, 5/8/2012



# ప్రాచ్య చిత్రకళకు ప్రతీక...

'ఇజా'లకు, వర్గాలకు అతీతుడైన శేషగిరిరావు వరంగల్ జిల్లా మానుకోట తాలూక పెనుగొండ గ్రామానికి చెందినవారు. పదేళ్ళ వయసులో ఉండగా సాతాని పంతులు వేసిన హనుమంతుడి బొమ్మ చూసినపుడు ఆయనకు చిత్రకళపట్ల అభిరుచి పెరిగింది. చిత్రకారుడిగా ఎదిగాక ఆయన మొదట హనుమంతుడి బొమ్మనే చిత్రించారు. తర్వాత డి.రంగయ్య అనే చిత్రకారుడు వేసిన జంతువుల బొమ్మలు చూశాక అలాంటివే చిత్రించాలని ప్రయత్నం చేశారు. శేషగిరిరావు చిన్నతనంలో గుండాల కెంపెనీ, వి.రామయ్య కంపెనీలు విరివిగా డ్రామా ప్రదర్శనలు ఇస్తూ ఉండేవి. వాళ్ళు ఉపయోగించే తెరపై ఉండే డిజైన్లు, బొమ్మలు ఆయనను ఆకర్షించాయి. ఆ బొమ్మలు వేయాలనే ఉత్సాహాన్ని పెంపొందించాయి.

పెనుగొండలోని అటవీ ప్రాంతంలో దట్టంగా ఉన్న వృక్షాలు, తీగల గుంపులు, నల్లటి రాళ్ళు, ఎగిరే పక్షులు, తామర పువ్వులు, పచ్చని పొలాలు శేషగిరిరావును ఎంతో ఆకట్టుకున్నాయి. ఆ రమణీయ ప్రకృతి దృశ్యాల పట్ల తనకు కలిగిన ఆకర్షణే ఆయనకు చిత్రకళ పట్ల ఆసక్తి పెరగడానికి దోహదం చేసింది. దీన్‌దయాళ్ నాయుడు డ్రాయింగ్ టీచర్‌గా తను చదివే స్కూల్‌కు రావడంతో శేషగిరిరావు జీవితం మలుపు తిరిగింది. దీన్‌దయాళ్ ప్రోత్సాహంతో, ఆయన చిత్రించిన పాకాల అడవి దృశ్యాలను చూసిన స్ఫూర్తితో తాను కూడా బొమ్మలు వేయడం నేర్చుకున్నారు. వరంగల్‌కోట, పద్మాక్షమ్మ గుడి, వెయ్యి స్థంభాల గుడి ప్రాంతాల్లో కళాత్మకంగా ఉండే శిల్పాలు ఆయనను సమ్మోహితుడిని చేశాయి. ఆరోజుల్లో ఆయన స్కెచ్చెస్ వేయడం అభ్యసించేవారు. అలాగే పత్రికల్లో వచ్చిన బొమ్మలను కాపీ చేస్తుండేవారు. దీన్‌దయాళ్ నాయుడు వద్ద చిత్రకళకు సంబంధించిన అనేక మెళకువలు నేర్చుకున్నాడు. కాఫీ తాగుతున్న కాంచనమాల శేషగిరిరావు వేసిన మొదటి పోర్ట్రయిట్. ఆతర్వాత ఆయనకు ఇండియన్ స్టైల్ పెయింటింగ్‌లో సిద్ధహస్తుడైన శంకర్‌రావుతో పరిచయం ఏర్పడింది. అప్పటి నూంచి భారతీయ చిత్రకళారీతుల పట్ల ఆయనకు అభిమానం పెరిగింది.

1942లో హైదరాబాద్‌లోని స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్‌లో శేషగిరిరావు

చేరారు. అజంతాలో క్యూరేటర్‌గా చాలాకాలం పనిచేసిన ఖాన్ బహదూర్ సయ్యద్ అహ్మద్ ఆ స్కూల్ ప్రిన్సిపాల్. చిత్రకళ పట్ల తనకు ఉన్న మక్కువతో కేవలం జత బట్టలు, చెంబు, నాలుగు పెయింటింగ్‌లతో శేషగిరిరావు హైదరాబాద్ చేరారు. వారాలు చేస్తూ చిత్రకళను అభ్యసించారు. కాళోజీ రామేశ్వరరావు బంధువులు ఆయన విద్యాభ్యాసానికి చాలా సహాయం చేశారు. కిద్వాయి అనే టీచర్ కాలేజీ ఫీజు కట్టారు. గ్రంథమాల పుస్తకాలను ప్రచారం చేయడమే కాకుండా వాటిని అమ్మి తన ఖర్చులను వెళ్ళదీసుకునేవారు. ఒకసారి మెహదీ నవాజ్ జంగ్ బహదూర్ శేషగిరిరావు చిత్రాలను చూసి ప్రశంసించారు. అంతేకాకుండా ఆయనను వారాలు మాన్పించి రెడ్డి హాస్టల్‌లో ఉండేందుకు ఏర్పాట్లు చేశారు. ఆర్ట్స్ స్కూల్‌కు దేశ విదేశాల నుంచి ప్రముఖులు వస్తుండేవారు. అప్పుడు శేషగిరిరావు వేసిన 'గోపికలతో నృత్యం చేస్తున్న కృష్ణుడి బొమ్మ'ను ఒక విదేశీ వనిత లూయిస్ కొనుగోలు చేశారు. ఇది తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని ఆయన అన్నారు. ఆరోజుల్లో శేషగిరిరావు గోలకొండ పత్రికలో బొమ్మలు వేసేవారు. సురవరం ప్రతాపరెడ్డి రాసిన 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర' పుస్తకానికి గద్వాల శోభనాద్రి, అడియారం రామరాజు తదితర ప్రముఖుల పెయింటింగ్‌లను సేకరించి ఇచ్చారు.

1947లో శాంతినికేతన్ లో నందలాల్ బోస్ వద్ద ఏడాదిపాటు ఆయన శిష్యరికం చేశారు. అక్కడ రవీంద్రనాథ్ టాగోర్ సేకరించిన దేశవిదేశాల పెయింటింగ్స్‌ను చూశాక ఆయనకు కళ పట్ల ఒక అవగాహన ఏర్పడింది. శాంతినికేతన్ నుంచి శేషగిరిరావు బయటికి వచ్చేటప్పటికీ రాష్ట్రంలో రాజకీయ కార్యకలాపాలు ఉధృతంగా ఉన్నాయి. తర్వాత కొంతకాలం వానమామలై వరదాచారితో కలిసి ఆదిలాబాద్, చెన్నూరు ప్రాంతాలలో పర్యటించారు. అప్పుడే ఆయన పోతన పై చిత్రాలు వేశారు. 1949లో జరిగిన ఆలిండియా ఆర్ట్స్ ఎగ్జిబిషన్‌లో ఆయన నాలుగు ప్రథమ బహుమతులను గెలుచుకున్నారు. ఆర్ట్స్ సొసైటీ ద్వారా హైదరాబాద్‌లో ఆర్ట్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. 1950లో స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో టీచర్‌గా చేరి ముప్పై ఐదేళ్ళపాటు ఆ వృత్తిలో కొనసాగారు. హైదరాబాద్, రాజమండ్రిలలో వన్‌మేన్ షోలు నిర్వహించారు. తన మొదటి ప్రదర్శనకు నాటి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు వచ్చి కొన్ని బొమ్మలు కొన్నారు. డబ్బు కొరతవల్లే ఎక్కువ వన్‌మేన్ షోలు నిర్వహించలేకపోయానని ఆయన చెప్పేవారు. వాటర్ కలర్ పెయింటింగ్‌లో ఎనిమిదేళ్ళపాటు కృషి చేసి, ఎక్కువగా శ్రమపడకుండా 'టెక్చర్ వాల్యూ' చిత్రించే పద్ధతిన ఆయన కనుగొన్నారు. ఈ ప్రక్రియలో చిత్రించిన చిత్రాలను మాక్స్‌ముల్లర్ భవనంలో ప్రదర్శించి పలువురు కళాప్రియుల ప్రశంసలను అందుకున్నారు.

సరోజినీనాయుడు, పద్మజానాయుడు, డాక్టర్ జయసూర్య వంటి జాతీయ భావాలు

గల నేతలతోనూ, రావినారాయణరెడ్డి, బద్ధంఎల్లారెడ్డి, డాక్టర్ పరంజా, మఖ్దుం వంటి కమ్యూనిస్టులతో ఆయనకు సన్నిహిత సంబంధాలుండేవి. అయినా ఆయనపై రాజకీయ ప్రభావం పడలేదు. చిత్రకళనే జీవిత ధ్యేయంగా ఎంచుకుని అందులో రాణించాలనే ధృఢ సంకల్పంవల్ల ఆయన రాజకీయాల పట్ల ప్రభావితుడు కాలేదు. అలాగే దాశరథి, సి. నారాయణరెడ్డి, వానమామలై వరదాచార్యులు, రామరాజు వంటివారితో కలిసి సాహిత్య ఉపన్యాసాలు, కవితాగోష్ఠులలో పాల్గొన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా చిత్రాలు వేశారు. స్టూడెంట్ మూవ్‌మెంట్‌తో సంబంధం ఉండేది. దీంతో మఖ్దుం ప్రోత్సాహంతో 'పీపుల్స్‌వార్'లో కొన్ని కార్టూన్లు వేశారు. ఆ రోజుల్లో కార్టూనిస్టులకు రాజకీయ నేతలకు దగ్గరివారనే అభిప్రాయం ఉండేది. అలాగే పెయింటర్ అంటే గౌరవభావం ఉండేది.

ఒకసారి దేవులపల్లి కృష్ణశాస్త్రి తమ ఇంటికి వచ్చి, తాను వేసిన గోదాదేవి చిత్రాన్ని చూసి చలించిపోయారని శేషగిరిరావు చెప్పారు. పీటీ రెడ్డిపై దత్ తీసిన చిత్రం గురించి ఒక చిత్రకారుడిపై మరో చిత్రకారుడు చిత్రం తీయడం అభినందనీయమని శేషగిరిరావు అభిప్రాయపడ్డారు. ప్రజల కోసం పెయింటింగ్స్ చేసి బజారులో పెడితే కూలీలు, రిక్షాకార్మికులు చూస్తారని, ఆ చిత్రాలు వాళ్ళలో మార్పుతెస్తాయని ఆయన విశ్వసించకపోయేవారు. తెలంగాణ గర్వపడే చిత్రకారుడు శేషగిరిరావు. ఆయన మరణంతో తెలంగాణ సమాజం ఒక గొప్ప సృజనశీలిని కోల్పోయింది. తెలంగాణ పల్లె జీవితానికి, ప్రకృతికి రంగులద్ది సజీవంగా ప్రపంచానికి చూపిన శేషగిరిరావు ధన్యజీవి. మట్టిరుణం తీర్చుకున్న భూమిపుత్రుడు. ఆయన కుంచెపట్టి కళకే ప్రాణం పోశారు. చిత్రకళలో సరికొత్త పోకడలకు బాటలు వేసిన ఆయన మన మధ్య లేకుండ పోవడం మనందరికీ లోటు. తెలుగు సమాజం ఓ కళా పితామహుడ్ని, సృజనను కోల్పోయింది. ఆయనకు నివాళులు.

**– భరత్‌భూషణ్**

నమస్తే తెలంగాణ, 27/7/2012



# కొండంత చిత్రకారుడు

తెలంగాణ బిడ్డడు, చిత్రకళకు కొండంత సేవ చేసిన పెద్దమనిషి కొండపల్లి శేషగిరిరావు మరణం కళారంగాన్ని కాదు, తెలంగాణ సమాజాన్ని దుఃఖంలో ముంచింది. తెలంగాణలో పునరుజ్జీవన పవనాలు వీస్తున్న కాలంలో రూపుదిద్దుకున్న ఈ చిత్రకారుడు జాతీయ చిత్రకళలో పునరుజ్జీవ తరం అందించిన చేయిని అందిపుచ్చుకున్నాడు. పాశ్చాత్య పెను దుమారంలో రెపరెపలాడుతున్న ప్రాచ్య కళాజ్యోతికి అరచేతులతో అండనివ్వాలని కోరుకున్నవాడు. తెలంగాణలో జనజీవనంలో భాగమైన కళారీతులను గుర్తించినవాడు. ఇరవయవ శతాబ్ది ప్రథమార్థంలో అనేకమంది ఉద్యమకారులను, సాహితీవేత్తలను, మేధావులను ఇంకా వివిధ రంగాల ప్రముఖులను తెలంగాణ తల్లి కడుపారా కన్నది. అందులో కళారంగానికి ప్రతినిధి కొండపల్లి శేషగిరి రావు.

కొండపల్లి శేషగిరిరావు జీవితంలోకి తొంగి చూస్తే అందులో తెలంగాణ సగటు జీవి బతుకు చిత్రం ఫక్కున నవ్వుతూ అగుపడుతుంది. కష్టాలను తొక్కుడు బండలుగా చేసుకుని ఒక్కో మెట్టు ఎక్కిన గంభీరత్వం ఆయనది. పేదరికం ఆయన కళా తపస్సుకు భంగం కలిగించలేక పోయింది. వరంగల్ జిల్లాలోని మారుమూల ప్రాంతం నుంచి శాంతినికేతన్‌కు వెళ్ళడం నాటి పరిస్థితుల్లో అసాధారణం. కొండపల్లి జీవితాన్ని పరిశీలిస్తే నాటి తెలంగాణ సమాజాన్ని అర్థం చేసుకోవడం సులభమవుతుంది. తెలంగాణ సామాజిక జీవనంలో కళా, సాంస్కృతీ, సాహితీ సౌరభాలు విరజిమ్ముతూ ఉంటాయి. ఆయన జీవితంలోని ప్రతి దశలో కళారంగంలో గురువులనదగిన వారు తారసపడడం గమనార్హం. కాకతీయ కళా సంపద ఆయనకు ప్రేరణనిచ్చింది. తెలంగాణ రమణీయ ప్రకృతి ఆయనలోని కళాభినివేషాన్ని తట్టిలేపి దారి చూపింది. తెలంగాణ వాడు కనుకనే తెలంగాణ పట చిత్రాలు – కాకి పడగల గురించి చెప్పగలిగాడు. వివిధ కులాలను ఆశ్రయించుకుని ఉన్న కళా సమాజాల గురించి వివరించగలిగాడు. మెహది నవాజ్ జంగ్ ఆయనను ఆదరించి తోడ్పాటును అందించడం ఆనాటి సామాజిక సంబంధాలకు అద్దం పడుతున్నది. తెలంగాణలో ఆనాటి సాంఘిక జీవనం ఎట్లాఉండేది, హిందు, ముస్లిం సంబంధాలు ఎట్లా ఉండేవి మొదలైన అంశాలను తెలంగాణ కోణంలో, తెలంగాణ హృదయంతో



అధ్యయనం చేయవలసిన అవసరం ఉంది.

కోడిపుంజులు, కాకులు, కుక్క, మృత గోవు మొదలుకొని పౌరాణిక ఇతివృత్తాలవరకు కొండపల్లి కళా ప్రపంచం విస్తృతమైనది. గోదాదేవి మొహంలో ఎంత అమాయకత్వం గోచరిస్తుందో, వరూధిని, మేనకల్లో అంత కవ్వింత కనబడుతుంది. 1947లోనే ఆయన బతుకమ్మను చిత్రించాడు. నిజాంకు వ్యతిరేకంగా బొమ్మలు వేశాడు. శాంతినికేతన్ కొండపల్లికి చిత్రకళను నేర్పడమే కాదు ఒక ధృక్పథాన్ని కూడా ఇచ్చింది. పాశ్చాత్య కళారీతుల వెంటపడి ఉరుకకుండా, నాటి దేశంలోని ప్రసిద్ధ చిత్రకారులు రవీంద్రనాథ్ టాగోర్, నందలాల్ బోస్, జెమినీ రాయ్‌ల రివైవలిస్టు పోకడలను ఆయన అనుసరించాడు. ఆధునిక కళను ఆయన తిరస్కరించలేదు. దాని ప్రభావాన్ని కాదనలేదు. అయితే అనుకరణను కాదని భారతీయత చిత్రకళా రీతుల పట్ల గాఢ అభిమానాన్ని ప్రదర్శించాడు. పాశ్చాత్యుల బ్రష్‌లకన్నా మన ఉడుత వెంట్రుకలతో చేసే కుంచెలె ఉత్తమమైనవని ఆయన వివరించాడు. కొత్త సాధనాలు మన చిత్రశైలినే మాయం చేసిందనేది ఆయన బాధ. శేషగిరిరావులో చిత్రకారుడు ఎంత ప్రస్ఫుటంగా కనిపిస్తాడంటే ఆయనలోని ఇతర పార్శ్వాలను కళారంగం కమ్మేసింది. తెలంగాణ సాయుధ పోరాట కాలంలో మఖ్దూం, రావి నారాయణ రెడ్డి వంటి వామపక్ష ప్రముఖులతోనూ, జమలాపురం కేశవరావు వంటి జాతీయ వాదులతోనూ ఆయనకు సంబంధాలున్నాయి. సాహితీవేత్తలతో అనుబంధం ఉన్నది. రచనా కౌశలాన్ని కూడా ఆయన ప్రదర్శించారు. కాళోజీ సోదరులు, పెండ్యాల రాఘవరావు, పొట్లపల్లి రామారావు, వట్టికోట ఆళ్వారుస్వామి వంటి మహమహుల సాంగత్యం ఉన్నది. అయితే కళారంగానికి ఆయన అంకితమైన తీరు ఇతర రంగాలను పక్కకు నెట్టింది. చిన్ననాటి పరిస్థితులూ ప్రభావాలు, చిత్రకళపై ఆయన పెంచుకున్న మమకారం మూలంగా ఆయన భిన్న భావోద్వేగాల వ్యక్తీకరణకు కళారంగమే ఏకైక రూపంగా నిలిచింది. ఆయన సంప్రదాయవాదిగా కనిపిస్తాడు. కానీ అభ్యుదయ భావాలు కలవాడు కనుకనే ఆ కాలంలోనే వితంతువును వివాహమాడాడు. ఒకరికొకరు చూసుకుని అంగీకరిస్తే తప్ప పెళ్ళి జరగకూడదని షరతు పెట్టాడు. చిత్రకళను అభ్యసించేందుకు నాగ్‌పూర్ వెళ్ళిన కొండపల్లి, ఆయన మిత్రులు ఇంకా అటేటు వెళ్లి వార్ధాలో గాంధీని కలుసుకున్నారు. జాతీయ భావాల వ్యక్తీకరించడానికి చిత్రకళను ఆశ్రయిస్తానని ఆనాడే గాంధీకి చెప్పాడు కొండపల్లి.

కళాకారుల దైన్యస్థితి గురించి కొండపల్లి శేషగిరిరావు వాపోయారు. కళలంటే చతుష్షష్టి కళలంటూ వాటితో పొట్టపోసుకోవడం సాధ్యమవుతుందా అని ఆయన ప్రశ్నించాడు. వడ్రంగి, కమ్మరి, కుమ్మరి, మంగలి, మాదిగ వంటి కుల వృత్తులవారు

పొట్టపోసుకున్నా, తమ బిడ్డల వివాహాలు చేయలేకపోవడానికి కారణం ఆయన వివరించాడు. లంచగొండులు, కాంట్రాక్టర్లు, పెట్టుబడిదార్లు మొదలైన వారి అన్యాయాలు పెరిగిపోయాయని, వారిని ఎదుర్కోవడానికి ప్రభుత్వ సిబ్బంది ఏర్పాటయిందని, ఈ సిబ్బంది సంఖ్య కార్మిక, కర్షక, కళాకారుల సంఖ్యను మించిపోయిందని ఆయన అంటాడు. ఈ కష్టజీవుల పన్నులతో మిగతావారు బతుకుతున్నారని అంటాడు. రాజులు, జమీందారుల కాలంలో కళాకారులకున్న పోషణ నేడు ఎందుకు కరువయ్యిందన్న ప్రశ్న మనలను ఆలోచింపచేస్తుంది. కళాకారులు ఏదో ఒక ఉద్యోగం చేసుకుంటూ కళాసేవ చేస్తున్నారని, అట్లా కాకుండా కళాకారుడు తన కళను నమ్ముకుని బతకగలగాలనేది ఆయన అభిప్రాయం. కొండపల్లి ఆవేదన తెలంగాణ కళాకారులందరిలో ఉండే ఉంటుంది. కొండపల్లికి నివాళులర్పించడానికే పరిమితం కాకుండా కళాకారులకు భద్రమైన జీవనం కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలె.

***- సంపాదకీయం***

నమస్తే తెలంగాణ - 27/7/2012





# దాశరథి స్పందన

ప్రముఖ కవి దాశరథిగారు, శేషగిరిరావు గారి గురించి ఈవిధంగా స్పందించారు. 'సామాన్య వర్ణ విన్యాసంతొ గంభీర భావాలు ప్రదర్శించగల ప్రతిభాశాలి' అంటూ 1976 అక్టోబర్ 9వ తేదీనాడు ఆంధ్రప్రభ దిన పత్రికలోని రాగవల్లరిలో డాక్టర్ దాశరథి కృష్ణమాచారిగారు శేషగిరిరావుగారిపైన ఒక చక్కని వ్యాసం రచించారు.

*పరుగెత్తే నదినైనా*
*బంధించును చిత్రం!*
*అంతటి ఆకాశమైన*
*ఇంతవును విచిత్రం!*

## గదిలో నది....

చిత్రికారుని కుంచె గంగానదినైనా కాన్వాస్‌మీద బంధించగలదు. శేషగిరిరావుగారి 'గంగ'ను చూసిన వారికి ఆశ్చర్యం, ఆనందం కలుగుతాయి. "అన్నీపోతాయి కళ ఒకటే మనతో ఉంటుంది" అన్నారు అస్టీన్ డాల్ఫన్, రాజ్యాలు, సింహాసనాలు పోయాయి, అజంతా, ఎల్లోరాలు మనకు మిగిలాయి. కాలం పరుగెత్తుఉంది. కళ నిలిచి ఉంటుంది. కదలాడే ప్రకృతి ఘనీభవిస్తుంది కళతో అర్థంకానిదేదైనా గొప్పది అనే అభిప్రాయం కొందరిలో ఉంటుంది.

ఉత్తమ కళ ఏ కాలంలోనైనా తన కాలానికంటె ముందు పరుగెత్తుతుంది. తనకాలపు సమాజాన్ని ప్రతబింబిస్తుంది. కళ పయనించే వేగాన్ని, సమాజం అందుకోలేదు. కళ నేడు అందుకొన్న దాన్ని సమాజం రేపుగాని అందుకొనదు. ఇక్కడే సమాజానికి కళాపథ ప్రదర్శకురాలు అవుతుంది' అన్నారు ప్రసిద్ధ చిత్రకారులు, విమర్శకులు సంజీవదేవ్‌గారు.

సమాజం కళను సజీవపరుస్తుంది. కళ సమాజాన్ని ఆనందపరుస్తుంది. సమాజం గుప్తపరిచేదానిని, కళ వ్యక్తపరుస్తుంది. గుప్తతా, వ్యక్తతా రెండూ కూడా జీవన సాఫల్యానికి సమానావసరాలే అన్నారు ఆయనే. అయితే గుప్తతా, వ్యక్తతా ఏ పాళ్ళలో ఉండాలన్నదే ప్రశ్న. గుప్తత ఎక్కువైపోయి వ్యక్తత తగ్గిపోతే సుబోధికత తగ్గుతుంది. కొండపల్లి శేషగిరిరావు

చిత్రాలలో వ్యక్తత హెచ్చు. గుప్తత తక్కువ. కనుక ఆయన చిత్రాలు చాలా వరకు సుబోధకంగా ఉంటాయి. వీరు స్పష్టతను కోరే కళాకారులు. అందులో అయోమయత్వం లేదు. పెన్సిల్‌తో గీసినా కళంతో వ్రాసినా, కుంచెలో వాడినా, తైలవర్ణాలు ఉపయోగించినా, లలితములైన జలవర్ణాలు ప్రయోగించినా, ప్రాచీన చిత్రాలు రచించినా, పాశ్చాత్యరీతులను అనుసరించినా శేషగిరిరావు తన చిత్రంలోనే కనబడేలా చేయగల ప్రతిభాశాలి. చిత్రకళా నిపుణులు, విమర్శకులు ఇది శేషగిరిరావుగారి బొమ్మ అని ఇట్టే చెప్పగలరు.

శిల్పులకు ప్రోత్సాహం ఇచ్చిన వ్యక్తి. ప్రపంచంలోని సుప్రసిద్ధ కళాకారులు, శిల్పులు ఆయన మిత్రులు. ఆయనది సుకుమార హృదయం. ఉదారమైన మనస్తత్వం. నవాబ్ మెహదీ నవాజ్ జంగ్ కేంద్ర లలితా కళా ఎకాడమీకి తొలి అధ్యక్షులు. అలాంటి వ్యక్తి అనురాగం, ఆశ్రయాలు శేషగిరిరావుకు లభించింది. ఉచిత విద్య శాంతినికేతనంలోని విశ్వభారతిలో చేసినపుడు ఆచార్య నందాలాల్ బోస్ శిష్యులుగా ఎంతో అనుభవాన్ని పొందారు. ప్రముఖ చిత్రకారులు కుమారిల్‌స్వామి వీరికి అక్కడ సహాధ్యాయి.

చిత్ర విద్యా నిపుణులు, విమర్శకులు అయిన వేలూరి రాధాకృష్ణగారి శేషగిరిరావు నందాలాల్ బోసు గురించి అన్న మాటలు ఈ సందర్భంలో గమనించవలసి ఉంది.

'నందాలల్ బోస్‌వద్ద నేర్చుకోవడం మూలంగా నాలోని చాలా లోపాలు దిద్దుబాటు చేసుకోగలిగాను. ఆయన వద్ద నేర్చుకోవడం, గురుకులంలో మునివర్యుని వద్ద నేర్చుకోవడం వంటిది'. తమకూ అదే అనుభవం కలిగినట్లు వేలూరి రాధాకృష్ణగారు అభిప్రాయపడ్డారు. 'ఆయన తను చేయు 'కర్మ'కు బద్ధుడైన యోగిపుంగవుడు' అన్నారు నందా బాబు గూర్చి.

బనస్థలీ విద్యాపీఠంలో కుడ్యచిత్రరచనలో తర్ఫీదు పొందిన శేషగిరిరావు ఎన్నో కుడ్యచిత్రాలు రచించారు. భారతీయ పౌరాణిక చిత్రాలు, ప్రకృతి చిత్రాలు రచించడంలో శేషగిరిరావుది అందెవేసిన చెయ్యి. పల్లె ప్రజల జీవితాలను వివిధ కోణాల నుండి సునిశితంగా పరిశీలించి చిత్రాలు రచించడం శేషగిరిరావులోని మరో విశిష్టత. రోజూ మనం వీధిలో వెళుతూ రకరకాలైన వృక్షాలను చూస్తాం, దాటిపోతాం. తన కుంచెలోని నైపుణ్యంతో శేషగిరిరావు వేసిన వృక్ష చిత్రాలు చూసి ఆగిపోతాం, దాటిపోలేం. ప్రేక్షకుణ్ణి ఆకట్టుకుని ఆగిపోయేలా చేసి, ఆశ్చర్యచకితుణిగా చేసే శక్తి శేషగిరిరావు చిత్రాలలో ఉంది. అతడు వేసిన 'గుల్ మొహర్' చూచి తీరవలసిందే.

ఈయన చిత్రాలలో మరో విశేషం ఏమిటంటే రంగులు సామాన్యమైనవిగా ఉంటూ ఎంతో కన్నులపండువుగా గంభీర భావాలను వ్యక్తపరుస్తాయి. ఈయన మ్యూరల్ పెయింటింగ్స్‌లో కంపోజిషన్ అద్భుతంగా ఉంటాయి. ఈయన బ్రష్ వర్క్‌లో వేగం శక్తి జీవం స్పేసింగ్ ఉట్టిపడుతుంటాయి. సంతాల్ నృత్యం, వసంతం, కాకులు అనే చిత్రాలకు

1949లో గేదెలు, నెమళ్ళు ఈ చిత్రాలకు 1953లోను, సంతాపం క్షమ అనే చిత్రాలకు కలకత్తా అకాడమీ అవార్డు లభించాయి.

1963 ఏప్రిల్‌లో హైదరాబాద్‌లోని ఆంధ్రసారస్వత పరిషత్తు హాలులో ఈయన పెయింటింగ్స్ ప్రదర్శన చూశాను. సాలార్‌జంగ్ మ్యూజియం డైరెక్టరు వి.ఎల్.దేవస్కర్ ప్రదర్శనలో ప్రేక్షకులను ఎంతగానో ఆకర్షించినవి, నన్ను ముగ్ధుణ్ణి చేసినవి కొన్ని చిత్రాలు ఇక్కడ ఉదహరించడం యుక్తమని భావిస్తున్నాను. చేదిత ద్రుమం, గుల్మొహర్, గంగ, నూతన ప్రభాతం, అడవికోన, విశాల ప్రకృతి ఒక తరహాకు చెందిన ఉత్తమ చిత్రాలైతే పద్మం, గర్భిణి, చిత్రాంగ, శకుంతల, అరుంధతి, బతుకమ్మ, అహల్య, గాయత్రి, రామానుజ, పార్వతి, దమయంతి మరొకరకమైన ఉత్తమ చిత్రాలు.

శేషగిరిరావు చిత్రాలు స్వదేశంలోను, విదేశాలలోను ఎందరో కళాభిమానులు కొన్నారు. హైదరాబాద్ మ్యూజియంలో, సాలర్‌జంగ్ మ్యూజియంలోను, హైదరాబాద్ లేక్ వ్యూ గెస్ట్ హౌజ్‌లోను, ఢిల్లీలోని వెస్టర్న్ కోర్ట్‌లోను, కాబుల్, కైరో, మాస్కో మ్యూజియం, లండన్, ఇటలీలలోను శేషగిరిరావు చిత్రాలున్నాయి. ఆంధ్రప్రదేశ్ లలితకళా అకాడమీ భవనంలోను, ఆంధ్రప్రదేశ్ హైకోర్టులోను ఈయన చిత్రాలున్నాయి.

అలంకరణ కళపై శేషగిరిరావు ఒక గ్రంథం వ్రాశారు. ఇది ఇంకా ప్రచురణ కావలసి ఉంది. లేపాక్షి, తాడిపత్రి, హంపి దేవాలయాలలోని శిల్పాల రేఖాచిత్రాలు శేషగిరిరావు రచించారు. వాటి సంపుటమే 'సురేఖ'. ది ప్రచురించబడింది. శేషగిరిరావు రచించిన పోతన, తిమ్మరుసు, అల్లసాని పెద్దన, ఉభయపార్శ్వాలలో గల అశ్వారూడుడైన శ్రీకృష్ణదేవరాయలు, కొంగలు మరపురాని చిత్రాలు.

ప్రముఖ విమర్శకులు వేలూరి రాధాకృష్ణగారు అభిప్రాయపడినట్లు అతని రేఖలలో నుంచి జీవం ఉట్టిపడుతూ ఉంటుంది. అతని రంగులలో మంచి తేజస్సు తాండవమాడుతూ అతని చిత్రాలు చూపరులను ముగ్ధులను చేస్తవి. పట్టువస్త్రంపై శేషగిరిరావుగారు చక్కని 'భారతీయ శైలి'లో చిత్రించిన చిత్రాలు కూడా ఎన్నో ఉన్నవి. అన్నింటికన్నా మించినవి అతని నలుపు, తెలుపు చిత్రాలు చైనా సిరాలో 'వాష్' శైలిలో రచించిన చిత్రాలూనూ, వాటిలోని వేగం గమనింపతగింది. శేషగిరిరావుగారు తైలవర్ణాలతో కూడా మిగతా రీతులలో వలె సులభంగానూ చిత్రించగలడు. మనదేశంలోని అనేక ముఖ్య నగరాలలో శేషగిరిరావు తన స్వంత చిత్రాల పదర్శనలను ఏర్పాటు చేసి, పండిత పామరుల మన్ననలు పొందారు.

సాంఘిక ప్రయోజనం లేని కళను ఆధునికులు హర్షించరు. ఇటీవల హైదరాబాద్ నగరంలో జరిగిన బ్రహ్మాండమైన హరిజన మహాసభలో శేషగిరిరావుగారు చిత్రించి,

ప్రదర్శించిన 'హరిజనోద్యమం' అనే ప్యానల్‌లో సాంఘీక ప్రయోజనంతోపాటు ఆయన చిత్ర విద్యానైపుణ్యం పరాకాష్టనందుకుంది. అందుకే అశేష ప్రజ్ఞాధురీణుడు శేషగిరిరావు. అయితే కళ కూడా వెర్రితలలు వేస్తుంది. ఒక చిత్రకళా ప్రదర్శనంతో ఒక కంచు బొమ్మని ప్రదర్శించారట. ఆ బొమ్మని పత్రికలూ పొగిడాయట, విమర్శకులూ మెచ్చుకున్నారట. ఆ కాంశ్య శిల్పం క్రింద ఇటాలియన్ భాషలో ఏదో పేరుంది. ఇటాలియన్ భాష తెలిసిన వారిని అడిగితే 'ఏనుగులద్ది' అని అర్థం చెప్పారట!

అర్థంకానిదేదైనా గొప్పది – అనే అభిప్రాయం కొందరిలో ఉంటుంది. క్యూబిస్ట్, సర్రియలలిస్ట్, డాడాయిస్ట్, నైరూప్య ఆధునాతన చిత్రకళా రూపాలను తెగ పొగిడేవారున్నారు. తెగ తెగిడేవారూ ఉన్నారు. మనకు అర్థంకానిదల్లా గొప్పదనుకోవడం ఎంత పొరపాటో అందులో ఏమీలేదనుకోవడం అంత పొరపాటే. పాశ్చాత్య సంగీతం వినీ వినడంతోనే అందులో శ్రావ్యత లేనేలేదు అనేస్తారు కొందరు. మరి మన సంగీతం వారికెలా ఉంటుందో! అర్థంచేసుకోవడానికి కొంత సంస్కారం కావాలి మరి'. అని దాశరథిగారు శేషగిరిరావుగారి చిత్రాల స్వభావాలను చక్కగా విశ్లేషించారు.

(కొండపల్లి శేషగిరిరావుగారి గురించి దాశరథి గారు వ్రాసిన వ్యాసం కోసం ప్రయత్నం చేశాము. కానీ పూర్తి వ్యాసం లభ్యం కానందున కొండపల్లి నిహారిణి గారి సంపాదకీయంలో వెలువడిన "చిత్రకళాతపస్వి డా॥ కొండపల్లి శేషగిరిరావు జీవిత చరిత్ర" అనే పుస్తకంలోంచి దాశరథి గారి స్పందనను ప్రచురిస్తున్నాము.)

**– దాశరథి**



*ప్రపంచ తెలుగు మహాసభల సందర్భాన జలగం వెంగళరావు, మండలి వెంకట కృష్ణారావుగార్లతో*

# కుంచె సామ్రాజ్య మహారాజు

మాది ఏలూరు. నేను హైస్కూలు. అలాంటి పీరియడ్‌లో మా ఊరికి లలితకళా అకాడమీ వారి ఎగ్జిబిషన్ వచ్చింది. అన్నింటికంటే పెద్ద పెయింటింగ్ కొండపల్లి శేషగిరిరావుగారిది. రెండు చేతులూ బార్లా చాపినా అందనంత వెడల్పుంది. అందులో చచ్చిపోయిన ఆవు పడిఉన్న బొమ్మ. తలమీద కాకివాలి కన్నుపొడుస్తూఉంది. ఆవుమీదా వెనుకా అరిచేయంత పెద్ద కుంచెతో ఆ చివరినుంచీ ఈచివరికి విసిరి కొడుతున్నట్టు రంగులు. ఏయే రంగులు కలిపితే అలా వస్తుందో ఎంతమాత్రం అంతుపట్టని మిస్టరీ. వట్టి సర్‌ప్రైజ్ ఎలిమెంటే కాదు. షాక్ ఎఫెక్ట్ అది. ఈ ఆవు శేషగిరిరావుగారి చేతిలో చచ్చిందేమో గాని, మేము కూర్చున్నా, నుంచున్నా వెంటాడేది. కలల్లోకి నడుచుకుంటూ వచ్చేసేది.

హైస్కూల్ అయిపోయి కాలేజి వచ్చేసింది. బెజవాడలో జర్నలిస్టుగా ఉద్యోగంలో చేరాను. ఇన్నేళ్ళు ఆయన మీద ఏ పుస్తకమూ దొరకలేదు. వేరే బొమ్మలూ తగల్లేదు. ఆయన బొమ్మలతో చిన్న పుస్తకం ఉందని కాలేజీ రోజుల్లో మా లెక్చరర్ వెల్పేరు నారాయణరావుగారు చెప్పారు.

1970 దశకం మధ్యలో మొత్తంమీద ఓ చిన్న బుక్ దొరికింది. బొమ్మలు తక్కువే ఉన్నాయి. ఆయన గురించి వివరాలూ టూకీగా ఉన్నాయి. అయినా భారతీయతగల ఆయిల్స్, చైనీస్ వాటర్ వండర్స్. అలాంటివి "చైనా రీకన్‌స్ట్రక్ట్"లాంటి పత్రికల్లోనూ వాళ్ళ ఆల్బమ్స్‌లోనే ఉండేవి. చైనీస్ కేలిగ్రఫీలాగా ఆయన సంతకం పైనుంచి కిందికీ మరీ షోకు. జీరో బ్రష్ ఇండియన్ ఇంక్‌లో ముంచి తెల్లకాయితం పెట్టి అలాంటి ఫోర్జరీ చేద్దామంటే బొత్తిగా రాదే. ఆ కోడిపుంజూ, చెట్టుల వేళ్ళూ కూడా అంతే. పంచరంగులైనా, వట్టి బూడిద రంగైనా అదే వరస. మిమిక్రించడం ప్రాణాంతకం. అది శేషగిరి అనీ, మనం దాని పాదాల కింద పచ్చగడ్డి అనీ చచ్చుకుంటూ తెలిసొచ్చింది. కాపీ చేయడం ఆపలేదనుకోండి. కొండపల్లిగారి బొమ్మల ఒరిజినల్స్ ఎప్పటికేనా చూడగలనా అనిపించేది.

హైదరాబాద్ ఆంధ్రప్రభలో కార్టూనిస్టు ఉద్యోగమొచ్చింది. పెట్టే బెడా సర్దుకు బయల్దేరా. ఉద్యోగంలో చేరి ఇల్లు వెతుక్కునేలోగా నా సొంతిల్లులాంటి మఖ్దూం భవన్‌లో మకాం. మొదటి రోజే షాక్. మఖ్దూం భవన్‌లో గోడమీద పెద్ద పెయింటింగ్. డెడ్ కౌ

అంత పెద్దగానూ ఉంది. లాగి లెంపకాయ కొట్టే ముదురు రంగులు. నేవీ బ్లూ కొండలు, మిలిటరీ గ్రీన్ చెట్లు, మధ్యలో ధవళ వస్త్రాల్లో మెరుస్తూ రావి నారాయణరెడ్డి, గంభీరంగా కుడిచేయి పైకెత్తి తెలంగాణను ముందుకురకమంటున్నాడు. వెనక తుపాకులతో పోరాట యోధులు, రజాకార్ల గుంపులు, నేలకొరుగుతున్న వీరులు, ఆడవాళ్ళు, రావి నారాయణ రెడ్డి పైన నీలాకాశం తేలి మబ్బుల కాంట్రాస్ట్‌లో ఆదర్శమంత ఎత్తెగురుతున్న ఎర్రని జెండా, దానిపై హత్తిన తెల్లని సుత్తీ కొడవలి. కళ్ళు నిండిపోతాయి. నిజానికి అలాటిలాటివాడు వేస్తే పరమ గాడీగా ఉండాల్సిన కాంపోజిషన్ అది. రంగుల ఎంపిక కూడా అంతే ప్రమాదకరమైంది. మరి వేసిందెలాటి వాడు! అందుకే అలాగుందా బొమ్మ.

కానీ, ఓ అనుమానం. నుదుట నామం దిద్దుకుని పరమ సాంప్రదాయకంగా కనిపిస్తూ, అంతకంటే పరమాతి పరమ సాంప్రదాయక చిత్రాలు గీసె ఈ పవిత్ర బ్రాహ్మణ మూర్తికి ఎర్రజెండా జబ్బు ఎలా సోకిందబ్బా? అదే విషయం మఖ్దుం భవన్‌లో ఓ పెద్ద నాయకుడినడిగాను. ఆయన పార్టీ కార్డ్ హోల్డరేమీ కాదు కానీ, హార్డ్ కోర్ సింపతైజెర్ అని చెప్పాడాయన. పైగా మఖ్దుం మొహద్దీన్, రావి నారాయణ రెడ్డి లాంటి పెద్ద కమ్యూనిస్టు నాయకులెందరో ఆయనకు జీగిరీ దోస్తులని చెప్పాడు. ఇంకా ఆయన జీవిత విశేషాలు చాలా తెలిశాయి. మఖ్దుం భవన్ గోడ పెయిమటింగ్ ఏ అర్ధరాత్రో ఎత్తుకుపోయి ఇంట్లో పెట్టుకుంటె అనే కల డ్రీమ్‌గానే మిగిలింది.

ఉదయంలో కార్టూనింగ్ బోర్ కొట్టి గుడ్‌బై కొట్టి చిన్న అద్దె కొంప తీసుకుని స్టూడియో అని ముద్దుగా పిలుచుకునే వాళ్ళం 1991 అనుకుంటా, కాగితాల నిండా న్యూడ్స్ స్కెచ్‌లు వేసుకుంటున్నా. 'చిత్రకారులు మోహన్ మీరేనా' అనే గ్రాంధిక గొంతు వినిపించి తలపైకెత్తా. ఆయనే. గుండె జారింది. పొడుగ్గా నుంచుని ఉన్నారు. డ్రాయింగ్ ప్యాడ్ ముందుకు తోసి అమాంతం లేచా. నోట మాట రాలేదు.

అందంగా ఉన్నాడు. మనిషి పొడుగు. ముక్కు పొడుగు. ఫాల భాగం అన్నీ, మాలాగా వెర్రి మొహంలా లేదు. 'నీ సహాయముని కోరి వచ్చాను'. అంటూ ఒక సంచీ లోంచి చిన్న కవిలి కట్ట బైటికి తీసాడు. పద్నాలుగేళ్ళ వయస్సునుంచి వెతుకుతున్న మెరుపు తీగ, నలభై ఏళ్ళ వయసుండగా ఎదురొచ్చి కాళ్ళకీ, ఒళ్ళంతా చుట్టుకుని ఊపిరి సలపనీయక పోతుంటే ఎలా! పైగా కుంచె సామ్రాజ్యం మహారాజావారు అంబారీ దిగి వచ్చి ఈ కుచేలుణ్ణి అటుకులకై అర్థించుటయా, దైవమా నీ లీలలు కనుగొనుట ఈ ముష్కరుడి తరమా! విషయం. ఆయన పెద్ద గ్రంథం రాశారు. అది మన దేవాలయాల్లో స్తంభాలు, విగ్రహాలు, మానవ, జంతు రూపాలకు ఎన్నో అలంకరణలుంటాయి కదా. వాటన్నింటికీ అనేక ముడులుంటాయి. మచ్చుకి రామప్ప దేవాలయం మీద నాగకన్యలుంటారు. మెడలో నగలకీ, నడుముల గుడ్డకీ, కుచవల్కలానికీ, నడుము నుంచి కుచ్చిళ్ళ మీదకి వేలాడే తాళ్ళకీ ఒక్కోచోట ఒక్కోరకంగా ముడి వేసి ఉంటుంది. అలాగే

ఆలయం బైట నంది మెడలో గంటల వరుసలకీ, మూపురం మీద వేలాడే నగలకీ, తోకనుండి చట్టల మీదుగా పైకి వెళ్ళి కిందకి వేలాడే తాళ్ళకీ మరో రకం ముడి ఉంటుంది. వీటన్నింటికీ ఖచ్చితమైన గ్రామర్ ఉంటుంది.

ఆ వేలకువేల చిక్కుముడుల శాస్త్రాన్ని ఆయన రాశారు. పైగా ప్రతి ముడి గురించీ వివరంగా చెప్పే బొమ్మలన్నీ ఓపికగా గీసారు. ఇంకా ఆ నగలూ, తాళ్ళూ ఆటూ ఇటూ తిరిగి ఎలా విడివడి, ఎలా కలసి ముడిపడుతాయో చూపే బొమ్మలు బాణం గుర్తులతో వేశాడాయన. చాలా పెద్ద వర్క్ ఈ కాలంలో మానవ మాత్రులెవరికీ తెలిసేది కాదు. ఎవరూ చేసేదీ కాదు. తెలిసినా, చేసినా యాతడు ఆర్టిస్టే కాక, పాశవిక భుజబల సంపన్నుడైన రాక్షసుడై ఉండవలెను. ఏమీ తెలియని-ఇలాంటి దానికేమీ సంబంధంలేని నేనేం చేయాలి. ఈ చిక్కుముడి విప్పవలసిందిగా ప్రాధేయపడ్డాను. చెప్పాడాయన. "ఈ గ్రంథమునకు నీ చైనీయమైన కేలిగ్రఫీతో టైటిల్ వ్రాయవలెను. నీ బొమ్మ ఆకర్షణీయమైన రంగులతో గీయవలెను. నీతెలుగు అక్షరములలో వేగమే కాదు, ఆ పొందియున్న నాకెంతో అభిమానము", అన్నాడాయన. నా కుర్చీ నాల్గు కాళ్ళ కింద గచ్చు పెనుకంపమునకు ఛిద్రమై సెకండ్ ఫ్లోర్‌లోకి పతనమవడానికి సిద్ధమవుతోంది. తమాయించుకున్నాను. నా బొమ్మల గురించాయన పొగిడిందీ, ఎనలైజ్ చేసిందంతా చెప్పలేను. కానీ ఇలా జరుగుతుందని ఎలా అనుకుంటాం. పర్వతమొచ్చి గడ్డి పరకను పలకరించటమా! పని అడగడమా! తేరుకున్నా. వేస్తానన్నా. ఆమాయకమైన ఆయన సుకుమార హృదయాన్ని ధర్భాంకురేణముతో నేనేల గాయపరచవలె! తప్పకుండా అంతా చేస్తానన్నా.

తర్వాత ఎన్నో సార్లు ఆయనింటికి వెళ్ళా. మేమిద్దరం ఏఐసీసీ సావనీర్‌కు పనిచేశాం. బాలల చిత్రకళా పోటీలకు జడ్జీలుగా వెళ్ళాం. ఇప్పటికీ ఆ స్క్రిప్టు అలాగే ఉంది. అందులో భారతీయ చిత్రకారుల గీతా రహస్యం ఉంది. మన దక్షిణాది నుండి ఎనిమిదో శతాబ్దంలోనే ఆగ్నేయాసియాకు వెళ్ళి కాంబోడియాలో "అంకార్ వాట్"గా నిలిచిన దేవాలయాల సముదాయం ఉంది. ఇది సెవెన్ వండర్స్ ఆఫ్ ది వరల్డ్‌లో ఒకటి. దీని పునరుద్ధరణకు ఐరాస వేలకోట్లు ఖర్చు చేస్తోంది. ఇది మాయా నాగరికత కట్టడాలకూ, ఈజిప్టు పిరమిడ్లకూ సమానమైనది. ఈ మూడింటికీ సమానమైనదేదీ ప్రపంచంలో లేదు. అలాంటి శిల్పకళ ఆత్మను పట్టి వివరించింది శేషగిరిరావు పుస్తకం. ఇది అంకార్ వాట్‌తో సమానమైనది. ఇలాంటి అపురూపమైన సంపదను అచ్చు వేసుకొని మన గురించి మనం తెలుసుకోవడం, తలచుకోవడం అత్యవసరమని అనుకుంటున్నాను. నా ఈ అరణ్యరోదనను విని ఎవరైనా అచ్చు వేయడానికి ప్రోత్సహిస్తారని ఆశిస్తున్నాను. జీవిత చరిత్రను రచించిన శ్రీమతి నీహారిణి గారిని అభినందిస్తున్నాను.

**- మోహన్**

హైదరాబాద్, 26/01/2009

# ప్రముఖుల పోర్ట్రయిట్స్‌తో పలకరించే కొండపల్లి వారి కుంచె

అక్కడ తలెత్తితే ఆలోచనలు రేకెత్తుతాయి. భావాలు పరవళ్ళు తొక్కుతాయి.

సూటిగా చూస్తే రంగులు పలకరిస్తాయి. గీతలు క్రీగంట చూస్తాయి.

తలతిప్పితే రసరమ్య కథలు శ్రావ్యంగా తమ గాథల్ని వినిపిస్తాయి.

అదొక రంగుల ప్రపంచం . కుంచె ఆత్మీయంగా కాన్వాస్‌ని పలకరిస్తే ఒదిగొదిగి రంగులు ప్రవహిస్తాయి.

అలా చిత్రం ... కాదు కాదు.... ఒక మూర్తి... ముడతలు పడ్డ ముఖంతో తనదైన శైలిలో కప్పుకున్న ఉత్తరీయంతో చేతిలో వొక పుస్తకంతో నిలదీస్తూ ... ఠీవిగా.. ఆ మూర్తి పుస్తకం ఉన్న చేతికి కాక రెండో చేతికి రంగులద్దుతూ, కుంచెని అతిసుతారంగా మీటుతూ.. తెల్లటి ధోవతి... ఆపైన ఒక తెల్లటి బనియన్... ఎత్తైన పొడవైన ముక్కు... తెల్లటి శరీర ఛాయ... ముడతలు పడ్డ బుగ్గలతో కొండపల్లివారు. ఆ గదిలోకి ప్రవేశించేటప్పటికి కొండపల్లివారు ప్రకాశంగారితో మాట్లాడుతున్నారా అనిపించేలా ఒక సీన్. జస్ట్ అలా అనిపించిందంతే.

పలకరింపులు... మాటలు....

ఇండియన్ ఎంబసీ కావాలంటే ప్రకాశం పంతులుగారి లైఫ్ పోర్ట్రయిట్‌ని వేయమని రాష్ట్రప్రభుత్వం పురమాయించింది. గత పదిరోజులుగా అదే పనిలో ఉన్నాను. ఒకటి రెండు రోజుల్లో ఈ పని పూర్తవుతుంది. మన రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖకు దీన్ని అప్పగిస్తే నా ఈ అసైన్‌మెంట్ పూర్తవుతుంది' అంటూ తాము వర్క్ చేస్తున్న ప్రకాశం పంతులు పోర్ట్రయిట్ గురించి వివరించారు.

"ఉండబట్టలేక వొక్క ప్రకాశం గారిదేనా? ఇంకా ఇలా రాజకీయ నాయకుల పోర్ట్రయిట్ వేశారా? అంటే దాదాపు అభిమానం ఉన్న వాళ్ళందరి పోర్ట్రయిట్స్ వేశానంటూ ఒక ఇందిరా గాంధీ, ఒక బ్రహ్మానందరెడ్డి, ఒక రాజీవ్‌గాంధీల పోర్ట్రయిట్స్ కాపీలను ముందుంచారు. అద్భుతం.. సజీవమూర్తులు నా వొళ్ళో నుండి పలకరించినట్లయింది. హాట్సాఫ్ శేషగిరిరావుగారూ అని మనసులో అనుకుంటూ రాజకీయ ప్రముఖుల వర్ణ చిత్రాలను వేసేటప్పుడు వారి పర్సనాలిటీస్ ఇంపాక్ట్ తమ వర్ణ సమ్మేళనంలో ఎలా

ఉంటుంది చెప్పమంటే ఒక్కసారి తమ గత నలభయ్యేళ్ళ అనుభవాన్ని క్రోడీకరించారు. ఇన్నర్ కారెక్టర్స్‌కి ఔటర్ షేపే ఈ పోర్ట్రయిట్స్ అన్నీను. ఒక పోర్ట్రయిట్ వేసేటప్పుడు ఆ వ్యక్తి ఉచ్ఛదశలో ఉన్నప్పటి పర్సనాలిటీని దృష్టిలో ఉంచుకోవటం జరుగుతుంది. పండిన వ్యక్తి అయితే, పెద్ద వయస్కుడయితే ఆ వయసుని రిప్రజెంట్ చేసేలా పోర్ట్రయిట్ చిత్రీకరిస్తాం. ఫర్ ఎక్జాంపుల్... ఇప్పుడు ఈ ప్రకాశం గారి పోర్ట్రయిట్ ఉందనుకోండి....ఆ కళ్ళజోడు... మొహంలోని ఆ ముడతలు, వల్లెవాటుగా వేసుకున్న ఆ ఉత్తరీయం చూస్తున్న తీరు... ప్రకాశం పంతులుగారిలోని ఠీవిని, గాంభీర్యాన్ని, తొణకని మనస్తత్వాన్ని తెలియజెబుతాయి. అలాగే ఆ పర్సనాలిటీని డెవలప్ చేయడం కోసం బాక్‌గ్రౌండ్ తీసుకోవటం జరుగుతుంది. అదే మూర్తిని ఒక గార్డెన్‌లో నడుస్తున్నట్లుగా వేస్తే ఒకరకంగా ఉంటుంది. ఒక రోడ్డుమీద నడుస్తున్నట్లుగ వేస్తే మరోలా ఉంటుంది. ... అదే కిటికీలు... అవీ వెనక బాక్‌గ్రౌండ్‌లో చూపించినప్పటికీ ఏ అసెంబ్లీ హాలులోకో ప్రవేశించబోయే ముందటి రూపం కనిపిస్తుంది. గట్టిగా మాట్లాడితే 'అసెంబ్లీలో నెన్నవరు ఎదిరిస్తారో చూస్తాను అని ధీమాగా చూస్తూ నడుస్తున్నట్లు అనిపిస్తుంది. కాబట్టి పోర్ట్రయిట్‌కి బాక్‌గ్రౌండ్ చాలా అవసరం."

"అన్నట్లు ఇందిరాగాంధీ పోర్ట్రయిట్‌లో చాలామంది జుట్టులో ఒక పాయ మాత్రమే నెరిసినట్టుగా చాలామంది చూపిస్తారు. అసలు అటువంటి ఫోటోలే ఆమె జీవితం దాకా కనిపించేవి. మరి మీరేమో ఒకవైపంతా పూర్తిగా నెరిసిపోయిన జుట్టు... మరో వైపేమో మెరిసిపోతున్న నల్లటి జుట్టుతో చిత్రీకరించారు. దీనికి కారణం అంటూ ఏదో అడగబోతుండగా కొండపల్లి శేషగిరిరావుగారు అంతేకాదు...ఆమె పక్కన ఒక చెట్టుని కూడా చూపించాను. ఆమె మొహంలో ముడతలు...ప్రక్కనే ఉన్న చెట్టులు చూపించిన పండుటాకులు ఆమె వయసుని ప్రతిబింబిస్తాయి. అలాగే ఆమె కట్టుకున్న చీరలోని అడ్డం గీతలు ఎదుర్కొన్న సంఘర్షణలకు, నిలువుగీతలు అధిరోహించిన ఉన్నత శిఖరాలని ప్రతిబింబిస్తాయి. ఇలా ఆర్టిస్ట్ అన్నవారు పోర్ట్రయిట్స్ అన్నప్పుడు వేస్తున్న పోర్ట్రయిట్ ఆ వ్యక్తి పర్సనాలిటీని ప్రాజెక్ట్ చేసేలా కొన్ని నిర్ణయాలు తీసుకోవాలి. చివరికి ఇది బాక్ గ్రౌండ్ వర్క్‌వుట్ చేసుకోవటంలోను, ఇంకా చెప్పాలంటే రంగుల కలనేత లోనూ కూడా తన అనుభవాన్ని రంగరించాలి అంటూ వివరించారు.

మరో మూర్తి నా చేతిలో ... బ్రహ్మానందరెడ్డి గారిది.... దాన్ని చూపిస్తు శేషగిరిరావుగారు "చూశారా ... ఆ టోపీ.. సూట్" బ్రహ్మానందరెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ధోవతి, లాల్చీ, టీపీలతో ఉండేవారు. అదే గవర్నర్ అయిన తర్వాత వేషం మార్చారు.... సూట్ వేసుకునే వారు. అయినా ఆయనకి టోపీ అంటే చాలా ఇష్టం. ..

అందుకని అలా ప్రాజెక్ట్ చేశాను. "ఇట్లానేను వేసిన చిత్రాలలో వర్డ్స్ చెప్పలేని సందర్భాలను కుడా నాకుంచె చెప్పగలిగింది. అంటే వర్డ్స్‌కందని భావాలని కూడా ఆర్టిస్ట్ కుంచె అందించగలదన్నమాట..."

"ఇలా మీరు వేసిన పోర్ట్రయిట్స్ దాదాపు అన్ని కాంగ్రెసు నాయకులవే కదా కారణం ఏమిటంటారు?"

"అవును... మీరన్నది నిజమే... అభిమానమే కారణం. ఎవరు ఏమనుకున్నా కాంగ్రెసంటే నాకు అభిమానం ... అందుకనే దాదాపు కాంగ్రెస్ నాయకుల అందరి పోర్ట్రయిట్స్ వేశాను. అంటే అంతమాత్రాన మిగతావారివి వెయ్యనని కాదు... సంపాదనకోసమూ వేస్తాను. ఆత్మీయితతోనూ వేస్తాను... అభిమానంతోను వేస్తాను.... ఒక్కొసారి అడిగే వ్యక్తి ఫైనాన్షియల్ స్టేటస్‌నిబట్టి అతడు నిరుపేద అయితే ఒక్కపైసా కూడా తీసుకోకుండాను వేస్తాను. అటువంటి సందర్భాలూ ఉన్నాయి. ఏదేమైనా పోర్ట్రయిట్స్ చిత్రీకరణలో హృదయస్పందన చాలా అవసరం."

***- డా॥ వాసిలి వసంత్ కుమార్***

ఉషోదయం, 22/11/1994



# ప్రకృతిమాత ఆరాధకుడు కొండపల్లి శేషగిరిరావు

తెలుగునాట ఉన్న అత్యంత ప్రముఖ చిత్రకారులలో ఒకరు శ్రీ కొండపల్లి శేషగిరిరావుగారు. రమణీయ ప్రకృతి వర్ణనలో ఆయన తర్వాతనే మరెవరినయినా చెప్పుకోవాలి. ఆయన తరచుగా వేసే పౌరాణిక, జానపద, చారిత్రక చిత్రాలలోని బ్యాక్‌గ్రౌండ్‌లో ప్రకృతి రమణీయత అద్భుతంగా ఉంటుంది. ఆయన ప్రకృతి వర్ణన సహజత్వంతోను, వర్ణ సంపదతోనూ అలరారుతుంది. కొండలు, బండలు, నదులు, సెలయేళ్ళు, జలపాతాలూ, చెట్లు, కొమ్మలు, ఆకులు, తీగలు, పక్షులూ, జంతువులూ వాటివాటి సహజరంగులూ, వివిధ వాతావరణ పరిస్థితులలో వాటి స్వభావాలు ఎంతో అద్భుతంగా చిత్రిస్తారు. ఆ చిత్రణకు వెనుక ఎంతో పరిశీలన, ఎన్నో సంవత్సరాల అనుభవమూ ఉండి ఉంటుంది.

శాంతి నికేతన్‌లో ఆయన నేర్చుకున్న భారతీయ సాంప్రదాయమూ, ఆతరువాత అధ్యయనం చేసిన చైనా, జపాను దేశాల టెక్నిక్‌లూ ఆయన రమ్యమైన శైలికి ఎంతో దోహదంచేసి ఉంటాయి. ఆయన చిత్రాలలోని మానవ రూపాలు కూడా ఎంతో సహజంగానూ, అందంగానూ, వయ్యారంగానూ ఉంటాయి.

"సహజం" అంటే పాశ్చాత్యుల వాస్తవికత కాదు. రవివర్మగారి క్లాసికల్ రియలిజం కాదు. ఈయనది ప్రాచ్యశైలి. ఈయన చిత్రాలకు సన్నని నాజూకైన ఔట్‌లైనులుంటాయి.

గీతోపదేశం, సీతారాములను గంగానది దాటిస్తున్న గుహుడు, అహల్యా శాపవిమోచనం, శకుంతల, దమయంతి, సీతారామ కళ్యాణము మొదలైన పౌరాణిక చిత్రాలేగాక, జగన్మాత, తెలుగుతల్లి లాంటి ఆదర్శ (సింబాలిక్) రూప చిత్రాలూ, నన్నయ, తిక్కన, పోతన, లాంటి చారిత్రక పురుషులను ఆయన చిత్రించారు. ప్రకృతి అంశాలను ప్రత్యక్షంగా కూడా అనేకం చిత్రించారు. నెమళ్ళు, కోతి, రాబందు, గేద, కొంగలు, కాకులు, వగైరా జీవరాసులనేగాక కొండలూ, బండలూ, చెట్లూ అనేకం గీశారు. వసంతం, లాంటి ప్రకృతి వర్ణనలను అనేకం చిత్రించారు. నీటి రంగుల చిత్రాలూ, తైలవర్ణ చిత్రాలూ, ఇంకు డ్రాయింగ్‌లే గాక ఆయనకు కుడ్య చిత్రణ కూడా తెలుసు. హైదరాబాద్‌లో అనేక ప్రభుత్వ భవనాల గోడలపై తెలుగువారి జీవితాన్ని (తెలుగు వెలుగులు) పెద్దపెద్ద చిత్రాలుగా వేశారు. కాబట్టి ఆయన గతకాలంలోనే జీవిస్తారని చెప్పలేం. వర్తమాన కాలంలో కూడా

జీవిస్తారు. ఆయన యువకుడిగా ఉండిన రోజులలో తెలంగాణాలో జరిగిన నైజాం రజాకార్ల దారుణాలనూ, ప్రజల ప్రతిఘటనను కూడా పెయింటింగ్‌లుగా వేశారు. 1977లో దివి తాలూకాలో సంభవించిన ఉప్పెన దుర్ఘటనను కూడా "గొప్పకెరటం" పేరుతో చిత్రించారు. పెద్ద కుడ్య చిత్రం "తెలుగు వెలుగులు" కూడా సమకాలీన జీవిత చిత్రణే. ప్రకాశంపంతులు, రాజీవ్‌గాంధి, ఇందిరాగాంధి, కాసు బ్రహ్మానందరెడ్డి, దేవులపల్లి రామానుజరావు, సి. రంగరాజన్ మొదలైన వర్తమాన కాలపు ప్రముఖుల మూర్తి చిత్రాలు కూడా సజీవ పరిమాణంలో పెయింట్ చేశారు. 1924 జనవరి 27న వరంగల్ జిల్లా పెనుగొండ గ్రామంలో జన్మించిన శ్రీ కొండపల్లి శేషగిరిరావుగారు హైదరాబాద్‌లో ఫైనార్ట్స్ కాలేజీలో చిత్రలేఖనంలో డిప్లొమాను 1947లో సాధించారు. ఆ తరువాత 1948లో పశ్చిమ బెంగాల్‌లోను శాంతినికేతన్‌లో గల విశ్వభారతిలో సర్టిఫికెట్ సంపాదించారు. శాంతినికేతనంలో నందలాల్ బోస్ గారి శిష్యుడుగా ఉన్నారు. దీనదయాల్ నాయుడు, జలాలుద్దీన్ షాహీబ్ కూడా తన గురువులంటారు శేషగిరిరావు గారు.

అంతటితో ఆయన కళాతృష్ణ ఆగలేదు. 1953లో రాజస్థాన్‌లోని జైపూర్‌లో విద్యాపీఠంలో ఫ్రెస్కో పెయింటింగ్‌ని నేర్చుకున్నారు. భిత్తి చిత్రణ అంటారు దానిని చిత్రకళలోని ఈ వున్నత విద్యార్జనకు శేషగిరిరావుకు ఆర్థిక సహాయం చేసి ప్రోత్సహించిన వారు. గుజరాత్ గవర్నరుగానూ, నేషనల్ లలితకళా అకాడమీకి అధ్యక్షులుగానూ, నేషనల్ లలితకళా అకాడమీకి అధ్యక్షులుగానూ పనిచేసిన మెహిది నవాజ్ జంగ్ గారట. చిత్రకళను నేర్చుకోవడంతోనే సరిపెట్టక తాను ఆర్జించిన విద్యను నవయువ చిత్రకారులకు పంచిపెట్టడం కూడా బాధ్యతగా స్వీకరించి హైదరాబాద్‌లోని జె.ఎన్.టి.యులో చిత్రకళోపాధ్యాయులుగానూ, ఉప ప్రధానోపాధ్యాయులుగానూ పనిచేశారు.

మాదాపూర్‌లో శ్రీమతి సురభి వాణీదేవిగారు ప్రారంభించిన శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఫైనార్ట్‌కు ప్రిన్సిపాల్‌గా పనిచేశారు.

ఎన్నో చిత్రకళా పోటీలలో పాల్గొని చాలా చాలా బహుమతులు పొందారు. హైదరాబద్, మద్రాస్, కలకత్తాలలో జరిగే ఆలిండియా ఆర్ట్ ఎగ్జిబిషన్‌లలోనూ, పలుసార్లు బహుమతులు సాధించారు.

1988లో భారత ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కల్చర్‌వారు ఎమిరిటస్ ఫెలోషిప్‌ను బహుకరించి "నేషనల్ ఆర్టిస్టు"గా ప్రకటించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారు 1988లోనూ 1989లోను రెండుసార్లు గౌరవించారు. 1996లో శ్రీ పొట్టిశ్రీరాములు తెలుగు యూనివర్సిటీవారు డి.లిట్ బహూకరించారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గారు 1997లో సత్కరించారు.

ప్రపంచ తెలుగు మహాసభవారు 1975లో సత్కరించారు.

సారస్వతి పరిషత్ తరపున అప్పటి ప్రధానమంత్రి శ్రీ పి.వి. నరసిహారావుగారు 1994లో సన్మానించారు.

అనేక కళా సంస్థలవారు సన్మానాలు చేశారు. చిత్రకళా సంస్థ (మచిలీపట్నం) వారు 1990లోనూ, గోల్‌కొండ లయన్స్‌క్లబ్‌వారు 1995లోనూ, వేంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఫైనార్ట్స్ వారు 1996లోనూ, చిత్రకళా నికేతన్ (రాజమండ్రి) వారు 1995లోనూ, భాగ్యనగర్ రోటరీక్లబ్‌వారు 1995లోనూ, సంస్కార భారతి వారు 1995లోనూ సన్మానాలు చేశారు.

ఇటీవల 2003 ఫిబ్రవరి 5న విజయవాడలోని కళా దర్శిని (ఆంధ్ర లయోలా కాలేజీ) లో ఘనంగా సన్మానించారు. ఆయన వేసిన చిత్రాలు అనేక గ్యాలరీలలో ఉన్నాయి. అనేక ఎగ్జిబిషన్‌లలో ప్రదర్శించబడ్డాయి. అంతేకాదు "ఆంధ్రప్రదేశ్", "భారతి", "ఆంధ్రపత్రిక" ప్రత్యేక సంచికలకు ముఖచిత్రాలుగా ప్రచురించబడ్డాయి. ఈనాడు, దక్కన్ క్రానికల్, ది హిందూ, ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లలో అనేకసార్లు ప్రచురించబడ్డాయి. బెంగుళూరు, భావనగర్, హైదరాబాద్‌లలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ సభలకు పెద్దపెద్ద గోడ పెయింటింగ్‌లు చిత్రించారు.

కొండపల్లి శేషగిరిరావుగారు చిత్రకారుడూ, చిత్రకళా ఉపాధ్యాయుడే గాక చిత్రకళా రచయితకూడాను. అనేక అంశాలపై వ్యాసాలు రాశారు. రేడియో ప్రసంగాలు చేశారు. "మహమ్మదీయ చిత్రకారులు", విమర్శ ప్రమాణాలు ఆధునిక చిత్రకారులు "చిత్రకళల ప్రగతి", "అడవి బాపిరాజు" మొదలగు అంశాలపై రేడియో ప్రసంగాలు చేశారు.

చిత్రకళకున్న వ్యాకరణ సూత్రాలను క్రోడీకరిస్తూ "రూపరుచి" అనే గ్రంథాన్ని రచించారు. కొండపల్లి శేషగిరిరావుగారి గొప్పదనం ఆయన చిత్రాలలోనే కాదు ఆయన స్వభావంలో కూడా కనిపిస్తుంది. ఆడంబరతలేదు. మృదుభాషిత్వం ఆయనది. వినయశీలి, గొప్పలు చెప్పుకోరు. అసామాన్యుడుగా పోజుపెట్టరు. నవ్వుతూ అందరిలో ఒకడిగా ఉంటారు. ప్రత్యేకత ఏమీ ఉండదు. గర్వం అసలేలేదు. ఇప్పుడాయనకు 80 ఏళ్ళ వయసు. అయినా ప్రతిరోజూ ప్రకృతి దృశ్యాలు చిత్రిస్తూనే ఉంటారు. అందుకే ఆయన్ను ప్రకృతి ఆరాధకుడంటాను. ప్రకృతి దేవతను పూవులతోనూ, అరటిపళ్ళతోనూ, కొబ్బరికాయతోనూ పూజించరు. కుంచెలతోను, రంగుల తోనూ, కేన్వాసుపై ముద్రించడం ఆయన ఆరాధనా విధానం. పూజలకు నిముషాలు పడుతుంది. ఆరాధనకు గంటలు, రోజులూ, సంవత్సరాలూ పడతాయి. పూజకంటే ఆరాధనే మిన్న.

విశాలాంధ్ర, 16/02/2003 — ***టి. వెంకట్రావ్***

# మన దేశం గర్వించదగిన చిత్రకారులు కొండపల్లి శేషగిరిరావు

అందమైన దృశ్యాలు, శిల్పాల వంటివి చూడగానే మనసు ఆనందపరవశమౌతుంది. ఆ అందాలన్నీ చక్కని వర్ణ మేళవింపులతో కాన్వాస్‌పైకెక్కితే అవి మన చూపులను కట్టిపడేస్తాయి. అలాంటి ప్రకృతి చిత్రాలు, శిల్పాలే కాకుండా ప్రబంధాల, కావ్యాల పాత్రలన్నింటికీ రూప లావణ్యాలను చేకూర్చి మనకందించిన ప్రఖ్యాత చిత్రకారులు కొండపల్లి శేషగిరిరావుగారు మనదేశం గర్వించదగిన చిత్రకారులు. చిన్ననాటి నుండి 'కృషితో నాస్తి దుర్భిక్షం' అనే సిద్ధాంతాన్ని గట్టిగా నమ్మి ఆచరణలోపెట్టి విజయకేతనం ఎగురవేసిన శేషగిరిరావుగారు భావితరాలకు స్ఫూర్తి ప్రధాత.

వరంగల్ జిల్లా మానుకోట (మహబూబాబాద్) సమీపంలోని పెనుగొండ గ్రామంలో 1924 జనవరి 27న శేషగిరిరావుగారు జన్మించారు. కన్న తల్లిదండ్రులైన రామచూడమ్మ, గోపాల్‌రావుల పేర్లు. పుట్టిన ఊరైన పెనుగొండ చరిత్రలో స్థిరస్థాయిని కల్పించిన వీరు ధన్యులయ్యారు. ఆగర్భ శ్రీమంతుడుగా పుట్టినా అనివార్య కారణాల వల్ల అత్యంత దయనీయమైన బ్రతుకుపోరాటం చేయాల్సిన పరిస్థితులేర్పడినా మొక్కవోని ధైర్యాన్ని ప్రదర్శిస్తూ అకుంఠిత విశ్వాసంతో జీవించారు. తను నమ్ముకున్న చిత్రకళను చేతబట్టుకుని భాగ్యనగరానికి బయలుదేరాడు. వట్టికోట ఆళ్వారు స్వామి, పెండ్యాల రాఘవరావు, గుండవరం హన్మంతరావుగార్ల సహాయంతో ఆనాటి ప్రభుత్వంలో మంత్రివర్యులైన మెహదీ నవాజ్ జంగ్ గారి పరిచయం కలగడం నిజంగా శేషగిరిరావుగారి జీవితంలో ఒక పెద్ద మలుపు. అణుకువ, సౌమ్యత, నిరాడంబరత, నిజాయితీ, పట్టుదల వంటి ఉత్తమ గుణాలతో స్ఫురద్రూపియైన శేషగిరిరావుగారిని మెచ్చి, మంత్రిగారు వీరికి భోజనాది సౌకర్యాలు, ఉండడానికి వసతులు, విద్యావకాశాలు కలిగించారు. అందిన అవకాశాన్ని గుప్పెట్లో పెట్టుకుని, గురుత్వ భావాన్ని గుండెల్లో పదిలపరచుకుని ఎంతో జాగ్రత్తగా, కష్టపడి చదువుతూ చిత్రకళాభ్యాసం చేశారు. ఐదేళ్ళపాటు స్కూల్ ఆఫ్ ఆర్ట్ అండ్ క్రాఫ్ట్స్ కాలేజీలో సయ్యద్‌బీన్ మహ్మద్ జలాబుద్దీన్ వంటి చిత్ర కళోపన్యాసకుల వద్ద చదువు పూర్తి చేసుకున్నారు. కష్టపడి పనిచేయడం, ఎలాంటి పరిస్థితులకైనా ఎదురునిలిచి, ఉన్నత స్థానంలో నిలబడాలన్న వీరి స్వభావం నవాజ్‌జంగ్ గారి మనసు గెలుచుకుంది. అలా

కాలేజీలో ఫస్టిన్ ఫస్ట్ వచ్చిన శేషగిరిరావుగారిని బెంగాల్‌లోని శాంతినికేతన్‌లో చిత్ర కళాధ్యయనం చేయడానికి పంపించారు నవాబ్‌గారు.

శాంతినికేతన్‌లో గురువు నందలాల్‌బోస్ గారి శిష్యరికంలో తమలోని చిరతకళకు మెరుగులు దిద్దుకుంటూ ఒక సంవత్సరం సర్టిఫికేట్ కోర్సు పూర్తిచేశారు. హైదరాబాద్‌లో తను చదువుకున్న కళాశాలలోనే ఉపాధ్యాయునిగా చేరే స్థాయికి ఎదిగారు. శాంతినికేతన్‌లో నేర్చుకున్న బెంగాల్ వాష్ టెక్నిక్ వంటి సంప్రదాయపూరిత అనుభవాలన్నీ జాగ్రత్తగా తమలో ఇముడ్చుకుని తమ చిత్రాల్లో ప్రతిబింబించారు. సంప్రదాయాలకు అత్యంత విలువనిచ్చే స్వభావం వంటబట్టించుకున్నారు కాబట్టే భారతీయ ఇతిహాసాలలోని కథా చిత్రాలను వస్తువుగా తీసుకుని అద్భుతమైన చిత్రాలు వేయడం అలవర్చుకున్నారు. ఆధునిక చిత్రాలతో ప్రేక్షకులకు ఒక మెసేజ్‌ను అందించే బొమ్మ వేయడం, బ్లాక్ అండ్ వైట్ చిత్రాలే గాని, వివిధ వర్ణ చిత్రాలే గానీ మనసుకు విమలానందాన్ని కలిగించేలా వేయడం వల్ల ఆంధ్రప్రదేశ్‌లో గుర్తింపు పొందిన చిత్రకారుల స్థాయిలో నిలిచిపోయారు.

వాటర్ కలర్, ఆయిల్ పెయింటింగ్, ఆక్వాటెక్టర్, వాష్ టెక్నిక్, రేఖా చిత్రాలు, మ్యూరల్స్ ఒకటేమిటి అన్ని ప్రక్రియల్లోనూ వారి ప్రతిభను చాటారనడానికి వారి చిత్రాలే సజీవ సాక్ష్యాలు. జాతీయ చిత్రకారునిగా ఎమరిటస్ ఫెల్లోషిప్‌ను అందుకున్న వీరిని వరించని బిరుదులూ అవార్డులూ లేవేమో! ఆల్ ఇండియా ఎగ్జిబిషన్ నుండి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిష్టాత్మక 'హంసా' అవార్డు వరఖూ వీరి చిత్రకళా పాండిత్యానికి నీరాజనాలు పట్టాయి. రామాయణ, భారత, భాగవతాలు చదివిన జ్ఞానంతో వాటిలోణి కథలకు రంగులతో రూపమిచ్చారు.

అశోక వనంలో సీత, శ్రీరాముడు, గుహుడు, పాండవ వనవాసం, కృష్ణలీలలు, దమయంతి, వరూధినీ ప్రవరాఖ్య, గోదాదేవి వంటి చిత్రాలు ఒకదానితో మరొకటి పోటీపడుతున్నట్లుంటాయి. అభిజ్ఞాన శాకుంతలంలోని వివిధ ఘట్టాలను దృశ్యకావ్యంగా మలిచారు. ఆదికవి నుండి అన్నమయ్యదాకా ఎందరో కవుల చిత్రాలు వ్యాసుడు-గణపతి, హరిహరబుక్కరాయలు, అభినవగుప్తుడు వంటి చిత్రాలు, ఝాన్సీరాణీ, రుద్రమదేవి వంటి పౌరాణిక చిత్రాలు మన దేశ చరిత్రను ఎన్నటికీ మరువకుండా చేస్తాయి. నాటి వీరుల త్యాగఫలంతో నేడు మనమనుభవిస్తున్న స్వాతంత్ర్యాన్ని నెమరువేసుకునేలా వీరు వేసిన గాంధీజీ స్వాతంత్ర్య పోరాటం, తెలంగాణా సాయుధ పోరాటం వంటి చిత్రాలు అద్భుతమైనవి. నేటి మన స్వేచ్ఛ ఎలా వచ్చిందో చెప్తూ ఆ త్యాగాలను మరవద్దని వెన్నులో ఒక్క చరుపు చరుస్తయి ఆ చిత్రాలు.

మానవీయ సంబంధాలకు అద్దంపట్టేలా వీరు చిత్రించిన కాకులు, మృతగోవు,

క్షామ వంటి చిత్రాలు నేటి సమాజంలో అస్తవ్యస్తంగా మారుతున్న నాగరికులకు కనువిప్పును కలిగిస్తాయి. సంతాల్‌డాన్స్, మదారి, గిరిజన స్త్రీలు వంటి చిత్రాలలో శేషగిరిరావుగారు జానపదులకు జీవం పోశారు. నిర్లక్ష్యానికి గురవుతున్న పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఉందని ఆలోచింపజేసే వీరి చిత్రాల్లోని రాళ్ళు, జలపాతాలు, జంతువులు, పక్షులు, పుష్ప పత్రాలు, అన్నీ మన వెన్నుతట్టేవే.

పొట్రయిట్స్ వేయడంలో సిద్ధహస్తులైన శేషగిరిరావుగారి ఖ్యాతి దేశవిదేశాలకు ప్రాకిందనడానికి వీరు వేసిన ఆంధ్రకేసరి చిత్రమే ఒక ఉదాహరణ. అమెరికాలోని వాషింగ్‌టన్ డి.సి.లోని ఇండియన్ ఎంబసీలో ఉన్న టంగుటూరి ప్రకాశం పంతులుగారి పోట్రయిట్ మనదేశ చిత్రకళా పాండిత్యానికి నిలువెత్తుగా నిలిపింది.

వీరి కుంచెకే కాదు కలానికీ మంచి పట్టుందనడానికి వీరు వ్రాసిన వ్యాసాలే ఋజువు. తెలుగువారి చిత్రకళావైభవం, చిత్రకళలో శ్రీకృష్ణుడు వంటి ఆర్టికల్స్ సాహిత్యపరంగా చిత్రలేఖన రీతులను విశ్లేషాత్మకంగా వ్రాశారు. నేను–నాకళ అంటూ వ్రాసిన ఆర్టికల్ శేషగిరిరావుగారిలోని కవితాత్మను కూడా బహిర్గతపరుస్తుంది. అంతరించిపోతున్న జానపద చిత్రకళయైన 'కాకిపడిగెలు' అనే పట చిత్రాలు వెలుగులోకి తేవడమే కాకుండా వాటిపై పేపర్ ప్రజెంటేషన్ కూడా చేసిన ఘనత శేషగిరిరావుగారిది! కళలను పరిరక్షించుకుంటూ తమవంతు సమాజసేవ చేయాలన్న తపనతో వీరు వ్రాసిన దాదాపు 35 వ్యాసాలు త్వరలో "చిత్ర, శిల్పకళారామణీయకం" అనే పుస్తక రూపంలో వెలుగులోకి రావడం నేటి చిత్రకళా విద్యార్థులకు దిక్సూచివలె నిలుస్తుందనవచ్చు. చైనా, జపాన్ చిత్రకళా రీతులను భారతీయ చిత్రకళ రీతులను జోడించి తమదైన శైలిలో కుంచెను నాట్యమాడించిన వీరి ప్రతిభా విశేషాలతో "మనోజ్ఞ చిరత కళాస్రష్ట డా॥ కొండపల్లి శేషగిరిరావు" అనే డాక్యుమెంటరీ ఫిల్మ్ కళాపిపాసులకు నేత్రానందాన్ని, మానసికానందాన్ని కలిగిస్తుంది. పాశ్చాత్య జీవన వ్యామోహంలోపడి కొట్టుకుపోతున్న యువత వీరి విధంగా అత్యున్నత స్థాయినధిరోహించాలని "చిత్రకళా తపస్వి డా॥ కొండపల్లి శేషగిరిరావుగారి జీవిత చరిత్ర" అనే పుస్తకం వెలుగులోకి వచ్చింది. ఈ పుస్తకాన్ని చదివి తమ జీవితాలను సన్మార్గంలో పెట్టుకొని జాతికి జీవగఱ్ఱలుగా యువత నిలవాలి.

**– డా॥ బి.డి.ఆర్.** *షష్టిపూర్తి అభినందన సాహితీ సంచిక (2010)*

**– కొండపల్లి నీహారిణి,** *రచయిత్రి*

# ఆ కుంచెకు ఎన్నెన్ని వయ్యారాలో .....

తెలుగు చిత్రకళా ప్రపంచంలో ఓ వటవృక్షం కూలిపోయింది. చిత్రకళకు అత్యంత కీర్తిని, బాహ్య సౌందర్యాన్ని మాత్రమే కాకుండా ఆత్మ సౌందర్యాన్ని సమకూర్చిన కొండపల్లి శేషగిరిరావు మనకు ఇకలేరు. భారతీయ ఇతిహాసాలను చిత్రిక పట్టడంలో శేషగిరిరావుది అందె వేసిన చేయి. ప్రకృతి, చారిత్రక గాథలను... ముఖ్యంగా కాళిదాసు 'అభిజ్ఞాత శాకుంతలం'ను అమెరికా, మాస్కో తదితర దేశాల్లో జరిగిన ఎగ్జిబిషన్లలో శేషగిరిరావు చిత్రాలు ప్రదర్శితమయ్యాయి. సాలార్‌జంగ్ మ్యూజియం సహా వాషింగ్టన్ డీసీలోని భారత రాయబార కార్యాలయం, పిట్స్‌బర్గ్ వేంకటేశ్వరస్వామి ఆలయాలకు ఆయన చిత్రాలు మరింత శోభను తీసుకువచ్చాయి.

మనం అంటే ఇది అని కళ్ళకు కట్టేలా చెప్పిన కళాకారుడు కొండపల్లి శేషగిరిరావు. నలభైఏళ్ళ క్రితం పోతన ముఖచిత్రంగా వచ్చిన ఆంధ్ర పత్రికను రంగుల్లో చూసి వందలాది తెలుగువారు ఫ్రేములు కట్టించుకున్నారు. కొండపల్లి ప్రతిభకు నీరాజనాలు పలికారు. అంత అందం, అంత ప్రశాంతత, అంత భక్తి భావం ఆ చిత్రంలో ఒలికించారు. పోతన భాగవతాన్ని 16 సార్లకు పైగా చదివి, మనోలోకాల్లో కాలయానం చేసి కొండపల్లి చిత్రించారు. అందుకే దానికి అంత జీవం వచ్చింది. అజంతా, ఎల్లోరా, రామప్ప, రాచకొండ, లేపాక్షి తదితర చారిత్రక చిత్రకళా కేంద్రాలను పర్యటించి, తన భావానుగుణంగా వరూధినీ-ప్రవరాఖ్యుడు, రాణి రుద్రమ, గణపతి దేవుడు, శకుంతల చిత్రాలను చిత్రించారు.

తొలి ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా కొండపల్లి శేషగిరిరావు 'తెలుగు తల్లి'ని సాక్షాత్కరింపజేశారు. ఆ చిత్రం ఆధారంగానే తెలుగుతల్లి విగ్రహాలనూ రూపొందించారు. అదే సందర్భంలో అప్పటి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి భాట్టం శ్రీరామమూర్తి ఆంధ్రుల సాంఘిక చరిత్రకు దృశ్యరూపం ఇవ్వవలసినదిగా కొండపల్లిని కోరారు. విశ్వామిత్రుడు వంటి ఐతిహాసిక వ్యక్తుల నుంచి, శాతవాహనులు, విష్ణుకుండినులు, పల్నాటి బ్రహ్మనాయుడు వంటి చారిత్రక వ్యక్తుల నుంచి రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ వరకూ తన చిత్రంలో నీరాజనం పలికారు కొండపల్లి. అన్నమయ్య,

త్యాగయ్య వంటి వాగ్గేయకారులు, జానపద కళాకారులు అంతా ... 12 అడుగుల పొడవు, 6 అడుగుల వెడల్పు ఉన్న శేషగిరిరావుగారి మహత్తర చిత్రంలో కొలువుదీరారు.

తెలుగు చిత్రకళను అంతర్జాతీయ వేదికపై సగౌరవంగా ఆవిష్కరించిన కొద్దిమందిలో శేషగిరిరావు ఒకరు. మహాత్మాగాంధి, జవహర్‌లాల్ నెహ్రూ, లాల్‌బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీలతో పాటు ఎంతోమంది ప్రముఖులు ఆయన చిత్రాలను మెచ్చుకున్నారు. తెలంగాణ కాకిపడగలు, రామప్ప దేవాలయం విశిష్ఠతను వివరించిన మొట్టమొదటి వ్యక్తి కూడా ఆయనే. 1975లో ప్రపంచ తెలుగు మహాసభలకు ఆయన రూపొందించిన తెలుగుతల్లి పెయింటింగ్ ప్రశంసలు పొందింది. 1994లో శేషగిరిరావును అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు ప్రత్యేకంగా సత్కరించారు.

సంగీత ఆంధ్ర విజ్ఞానకోశం ఎడిటర్ లక్ష్మీరంజన్, మ్యాక్స్ ముల్లర్ భవన్ డైరెక్టర్ పీటర్ స్విడ్జ్‌ల అభినందనలు అందుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ఆలిండియా ఫైనార్ట్స్ అండ్ క్రాఫ్ట్ సొసైటీల గౌరవం పొందారు. హైదరాబాద్, మైసూర్, మద్రాస్, ఆలిండియా ఆర్ట్ ఎగ్జిబిషన్స్, కోల్‌కతా అకాడమీ ఆఫ్ ఫైనార్ట్, ఏపీ లలిత కళా అకాడమీ అవార్డులను అందుకున్నారు. కేంద్ర మానవ వనరుల శాఖ పక్షాన 1988లో ఎమిరిటస్ ఫెలోషిప్‌ను, తెలుగు యూనివర్సిటీ ద్వారా డాక్టరేట్‌ను ఆయనకు అందజేశారు. ప్రతిష్ఠాత్మక హంస అవార్డును కూడా ఆయన అందుకున్నారు. ఆర్ట్స్ పై సురేఖ అనే పుస్తకాన్ని రాశారు. ఆయన భౌతికంగా లేకపోయినా ఆయన సృష్టించిన చిత్రాలు ఉంటాయి.

**– ప్రతాప్**

27/7/2012



*01-08-2003 రవీంద్రభారతిలో గవర్నర్ శ్రీ సుర్జీత్‌సింగ్ బర్నాలాగారు, సినారె చేతుల మీదుగా హంస అవార్డును అందుకుంటున్న శేషగిరిరావు*

రసమయ రేఖలతో రంగుల కుంచెలతో రమణీయ చిత్రాలను సృష్టించిన

# అద్వితీయ సంపన్నుడు కొండపల్లి శేషగిరిరావు

**అఖిలాంధ్రావనిలో, అఖిల భారత స్థాయిలో ప్రసిద్ధి పొందిన చిత్రకారుడు కొండపల్లి శేషగిరిరావు. చిత్రకళా రంగంలో ఆయన స్థానం సమున్నతమైనది, విశిష్టమయినది. వివిధ చిత్రకళా రీతులలో గడచిన అరవయి సంవత్సరాల కాలంలో శేషగిరిరావు ప్రదర్శించిన అద్వితీయ సృజనాత్మక నైపుణ్యం, వైవిధ్య విలాసం ప్రశంసనీయమయినవి. ఆధునిక చిత్రకళా నిష్ణాతుడుగా ఆయన గత అయిదున్నర దశాబ్ధాల కాలంలో అనేక అవార్డులను, బహుమతులను, ప్రశంసా పత్రాలను, గౌరవాలను అందుకున్నారు. 1996 నవంబర్‌లో తెలుగు విశ్వవిద్యాలయం వారి గౌరవ డాక్టరేట్‌తో సన్మానితుడయిన శేషగిరిరావును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక మండలి, రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ హైదరాబాద్ నగరంలో 2003 ఆగస్టు 1వ తేదీన హంస అవార్డుతో సత్కరించాయి.**

రాష్ట్ర స్థాయిలోనే గాక జాతీయ స్థాయిలో, అంతర్జాతీయ స్థాయిలో గూడ ఇంతకన్న ఉన్నతమయిన, ఉత్కృష్టమయిన అవార్డులకు అన్ని విధాల అర్హుడయిన చిత్రకళా ప్రతిభా సంపన్నుడు శేషగిరి రావు జీవిత యాత్రలో ఎన్నో కష్టాలను, అడ్డంకులను, అవరోధాలను ధైర్య సాహసాలతో, ధృఢ నిశ్చయంతో ఎదుర్కొంటూ వజ్ర సంకల్పంతో తన లక్ష్యసాధనకు ముందుకు సాగిన, స్వయంకృషితో సమున్నత శిఖరాలను అధిరోహించిన చిత్రకళా తపస్వి ఆయన. డైబ్బయితొమ్మిది సంవత్సరాల వృద్ధాప్యంలో సైతం అందమయిన రేఖలతో, రమణీయమయిన రంగులతో సుందర చిత్రాలను, మనోజ్ఞ దృశ్యాలను సృష్టిస్తున్న చిత్రకళా దురంధరుడు శేషగిరి రావు స్వాతంత్ర్య సమరయోధుడు. నాడు విద్యార్థి దశలో నిజామ్ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ధ్వజమెత్తిన శేషగిరి రావు ఆ నిరంకుశపాలనకు, హైదరాబాద్ (తెలంగాణ) స్వాతంత్ర్య సమరానికి ప్రతీకలయిన చిత్రాలను శక్తివంతమైన తమ కుంచెతో రూపొందించారు. భావితరాలలో ఉత్తేజాన్ని, స్వాతంత్ర్య స్ఫూర్తిని రేకెత్తించే చరిత్రాత్మక చిత్రాలు అవి.

తెలంగాణ కేంద్రమయిన కాకతీయ కళా సంపదకు నిలయమయిన వరంగల్లు జిల్లాలో, మానుకోట (మహబూబాబాద్) సమీపాన పెనుగొండ గ్రామంలో 1924 సంవత్సరం జనవరి 27వ తేదీన శేషగిరి రావు జన్మించారు. ఆయన తల్లిదండ్రులు

గోపాలరావు, రామచూడమ్మ. మానుకోటలో ఏడవతరగతి పూర్తిచేసిన తరువాత ఆయన హనుమకొండ వచ్చి కాలేజి యేట్ హైస్కూలులో చేరారు. అందులో చదువుకోసం ఆయనకు ఇబ్బందులు తప్పలేదు. స్వాతంత్ర్య సమరయోధులు హయగ్రీవా చార్యులు తదితరుల సహాయంతో, అండదండతో శేషగిరి రావు హనుమకొండ హైస్కూలు చదువు కొనసాగించారు. మెట్రిక్‌లేషన్ పరీక్షలో ఉత్తీర్ణత లభించకపోవడంతో మనసుకు బాధ కలిగినప్పటికీ ఆయన కుంగిపోలేదు. బాల్యంలోనే ఆయన చిత్రకళా ప్రతిభ కిరణాలు అంకురించసాగాయి. మెట్రిక్‌లేషన్ వరకు హనుమకొండలో చదువు కొనసాగించాలన్న తపనతో ఆయన మాడపాటి హనుమంతరావు, మందుముల నరసింగరావు వంటి పెద్దల వద్దకు వెళ్లారు. అప్పటికే గుండవరపు హనుమంతరావు, వట్టికోట ఆళ్వారు స్వామి, పెండ్యాల రాఘవరావు చదివిన తరువాత శేషగిరిరావు ఆత్మ విశ్వాసంతో హైదరాబాద్‌లో అడుగు పెట్టారు. ఆయన మిత్రులు, హైదరాబాద్ సంస్థాన ప్రభుత్వంలో పరిశ్రమలు, వాణిజ్య శాఖల కార్యదర్శిగా ఉన్నత అధికార స్థానంలో ఉన్న కళా పోషకుడు నవాబ్ మెహదీ నవాజ్‌జంగ్, మందుముల నరసింగరావు ఒక లేఖ రాసి శేషగిరి రావును బంజారాహిల్స్‌లో ఉన్న మెహదీ నవాజ్‌జంగ్ వద్దకు పంపించారు. మిత్రులు హనుమంతరావును, రాఘవరావును, ఆళ్వారు స్వామిని వెంట తీసుకుని శేషగిరి రావు నవాజ్ సాహెబ్ వద్దకు వెళ్ళి మందుముల లేఖను ఇచ్చారు. విద్యార్థి శేషగిరి రావు గీసిన బొమ్మలు చూసి నవాబ్ సాహెబ్ సంతోషించారు. శేషగిరి రావు ను తన ఇంటిలోనే ఉండి చదువుకొమ్మని మెహదీ నవాజ్‌జంగ్ చెప్పారు. ఆళ్వారు స్వామి ప్రోద్భలంతో శేషగిరి రావు అందుకు అంగీకరించారు. హైదరాబాద్ నగరంలోని ఫైన్ ఆర్ట్స్ కాలేజి ప్రిన్సిపాల్ సయ్యద్ అహ్మద్‌కు చెప్పి మెహదీ నవాజ్ జంగ్ ఆ కళాశాలలో అయిదు సంవత్సరల డిప్లొమా కోర్సులో శేషగిరి రావుకు ప్రవేశం కల్పించారు. శేషగిరి రావు కొద్దిరోజులు మెహదీ నవాజ్‌జంగ్ ఇంటిలోనే ఉండి ఫైన్ ఆర్ట్స్ కాలేజీలో చదువుకున్నారు. తరువాత కొత్వాల్ రాజా బహద్దుర్ వెంకటరామా రెడ్డికి చెప్పిన అబిడ్స్ రోడ్డు సమీపంలోని రెడ్డి హాస్టల్‌లో శేషగిరి రావుకు వసతి కల్పించారు. మెహదీ నవాజ్ జంగ్ అయిదు సంవత్సరాలపాటు ఫైన్ ఆర్ట్స్‌కాలేజీలో, రెడ్డి హాస్టల్‌లో శేషగిరి రావు అయిన ఖర్చును మెహదీ నవాజ్‌జంగ్ భరిమచారు. 1947 జూన్ 11 నాటికి ఫైన్‌ఫ ఆర్ట్స్ కాలేజీలో శేషగిరి రావు డిప్లొమా పూర్తి చేశారు. ఆ కోర్సులో ఆయన ప్రథమ తరగతిలో ప్రథముడుగా ఉత్తీర్ణులయినారు. శేషగిరి రావు ప్రతిభ మెహదీ నవాజ్ జంగ్‌కు, ప్రిన్సిపాల్ సయ్యద్ అహ్మద్‌కు చాలా సంతోషం కల్గించింది. అజంతా కుడ్య చిత్రాలకు ప్రతిరూపాలను రూపొందించి సయ్యద్ అహ్మద్ అంతర్జాతీయ ప్రసిద్ధి పొందారు.

శేషగిరి రావు హైదరాబాద్ సంస్థానం నిజామ్ నిరంకుశ పాలనతో మతోన్మాదుల పైశాచికత్వంతో అత్యంత క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్న రోజుల్లో ఫైన్ ఆర్ట్స్ కాలేజీలో చదువు కొనసాగించారు. భారత జాతీయ ఉద్యమంతో, స్వాతంత్ర్య సమరంతో ఉద్దీపితుడయిన శేషగిరి రావు రెడ్డి హాస్టల్‌లో కొందరు మిత్రులతో కలిసి హైదరాబాద్ విముక్తి ఉద్యమంలో భాగస్వామి అయినారు. చిత్రకారుడయినప్పటికి సామాజిక స్నేహం కొరవడని స్వాతంత్ర్య యోధుడు, దేశభక్తుడు, జాతీయవాది ఆయన. అయితే శేషగిరి రావు చిత్రకళా నైపుణ్యంతో ముగ్ధుడయిన మెహదీ నవాజ్‌జంగ్ ఆయనను శాంతినికేతన్ పంపి అక్కడ చదివించడానికి సంకల్పించారు. ఆ రోజులలో శాంతినికేతన్‌లో చిత్రకళా విభాగం అధిపతి సుప్రసిద్ధ చిత్రకారుడు నందలాల్‌బోస్; శాంతినికేతన్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ అనిల్ చాందా. అనిల్ చాందాకు మెహదీనవాజ్ జంగ్ రాసిన లేఖ తీసుకొని శేషగిరిరావు కలకత్తా వెళ్లారు. మెహదీ నవాజ్‌జంగ్ అందించిన ఆర్థిక సహాయంతో ఆయన 1947-48 సంవత్సరంలో శాంతినికేతన్‌లో (విశ్వభారతిలో) చిత్రకళలో సర్టిఫికేట్ స్టడీ కోర్సు పూర్తి చేశారు. 1948 ఏప్రిల్ 4వ తేదీన ఆయనకు శాంతినికేతన్ సర్టిఫికేట్ లభించింది. దీన్‌దయాళ్ నాయుడు, జలాలుద్దీన్ సాహెబ్, నందలాల్‌బోస్ (శాంతినికేతన్‌లో) ఆయన చిత్రకళా పారంగతుడు కావడంతో ఆయనకు గురువులుగా దోహదపడ్డారు. శాంతినికేతన్‌లో అబనీంద్రనాథ్ ఠాగోర్ వంటి కళా కోవిదులతో ఆయనకు పరిచయం ఏర్పడింది. గురువు నందలాల్‌బోస్ సూచన మేరకు ఆయన సెలవులలో భువనేశ్వర్, వెళ్ళి అక్కడి ప్రాచీన శిల్పాల రేఖా చిత్రాలను రూపొందించారు. నిర్విరామ పరిశ్రమ, నిమగ్నత, క్రమబద్ధత, అచంచల దీక్ష, అంకిత భావం శేషగిరి రావుకు విద్యార్థి దశనుంచే సొంతమయినాయి. అక్షరాలా ఆయన కళాతపస్సి.

శాంతినికేతన్‌లో అధ్యయనం పూర్తయిన తరువాత శేషగిరి రావు 1948లో బోలక్‌పూర్ (కలకత్తా) నుంచి వరంగల్లు జిల్లా నర్సంపేట వరకు జరిపిన ప్రయాణం ఒక పెద్ద సాహస గాథ. మద్రాసులో, విజయవాడలో కొద్ది రోజులు మకాం పెట్టి శేషగిరి రావు రైలులో ఖాజీపేట వస్తున్నప్పుడు ఎర్రుపాలెం స్టేషన్‌లో రజాకార్లు జొరబడి సోదా చేసారు. శేషగిరి రావు కూర్చున్న రైలు పెట్టెలో పై బర్త్‌పై ఒక గడ్డం సాహెబ్ పడుకున్నాడు. ఆ సాహెబ్ 'శేషగిరి' అని పిలిచి పలుకరించాడు. ఆయనను చూసి శేషగిరి రావు చకితులయ్యారు. అతను హైదరాబాద్ ఫైన్ ఆర్ట్స్ కాలేజీలో శేషగిరి రావు సహాధ్యాయి. తరువాత రజాకార్ల నాయకుడు (సిపాసాలార్)గా మారాడు. ఆయన పేరు మిర్జాగా శేషగిరి రావుకు జ్ఞాపకం ఉన్నది. మిర్జా సహాయంతో శేషగిరి రావు సురక్షితంగా కాజీపేట నుంచి బస్సులో నర్సంపేట వెళ్లగలిగారు. తరువాత 1948సెప్టెంబర్‌లో పోలీస్

చర్యతో (ఆపరేషన్ పోలో) హైదరాబాద్ సంస్థానం విముక్తమయింది. శేషగిరి రావు విజయవాడలో ఉన్నప్పుడు అంతకుముందే రజాకార్లకు భయపడి అక్కడికి వచ్చిన హైద్రాబాద్ సంస్థానం వారు చాలామందితో పరిచయం అయింది. హయగ్రీవాచారి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరానికి వెళ్ళి శేషగిరి రావు ఒక పూట భోంచేసేవారు. పూటకు పన్నెండణాలతో విజయవాడ హోటళ్ళలో భోంచేయడం కూడా కష్టమయిన గడ్డు రోజులను శేషగిరి రావు ఎదుర్కొన్నారు. హైదరాబాద్‌లో ఫైన్ ఆర్ట్స్ కాలేజీలో విద్యార్థిగా ఉన్న రోజుల్లోనె 1947లో నర్సంపేట ప్రముఖులు మండువ వెంకటేశ్వరరావు కుమార్తె కమలతో శేషగిరి రావు వివాహం జరిగింది. ఆరోజుల్లో అది సంస్కరణ వివాహం. శేషగిరి రావు, కమల దంపతుల సంతానం నలుగురు కుమారులు, ఒక కుమార్తె.

పోలీసు చర్య అనంతరం హైదరాబాద్ వచ్చి రామ్‌కోట్‌లో ఆంధ్ర సారస్వత పరిషత్తు కార్యాలయం సమీపాన శేషగిరి రావు నివాసం(అద్దె ఇంటిలో) ఏర్పాటు చేసుకున్నారు. పోలీసు చర్యకు ముందు వరంగల్లు నుంచి దేవులపల్లి రామానుజ రావు సంపాదకత్వంలో వెలువడిన సాహిత్య మాస పత్రికలో శేషగిరి రావు చిత్రాలు ప్రచురితమయినాయి. హైదరాబాద్‌లో స్థిరపడిన తొలి రోజులలో ఆయన మిత్రులు రామానుజరావు, దాశరథి కృష్ణమాచార్యులు, పల్లా దుర్గయ్య, బి.రామరాజు, సి.నారాయణరెడ్డి, శేషగిరి రావు చిత్ర రచనా నైపుణ్యాన్ని ప్రస్తుతిస్తూ దాశరథి, రామరాజు, నారాయణరెడ్డి రసవత్తర పద్యాలను ఆశువుగా చెప్పారు. మెహదీ నవాజ్ జంగ్ సహాయంతో 1950లో శేషగిరి రావుకు హైదరాబాద్ ఫైన్ ఆర్ట్స్ కాలేజీలో అధ్యాపక పదవి లభించింది. ముప్పయి నాలుగు సంవత్సరాలు అధ్యాపక విధులను నిర్వహించి, ప్రొఫెసర్‌గా, వైస్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించి ఆయన 1984 డిసెంబర్‌లో రెటైరయినారు. ఆ తరువాత, ఉస్మానియా విశ్వ విద్యాలయానికి అనుబంధంగా ఉన్న ఎస్.వి.ఫైన్ ఆర్ట్స్, ఆర్కిటెక్చర్ కళాశాల(హైద్రాబాద్) ప్రిన్స్‌పాల్ పదవిని ఆయన కొంతకాలం నిర్వహించారు. చిత్రకళా రంగంలో శేషగిరి రావు నిత్యనూతనుడు, నిరంతర అన్వేషి, అలసట లేని అధ్యాపకుడు, ఆచార్యుడు. హనుమకొండలో పూర్తికాని మెట్రిక్‌లేషన్‌ను ఆయన 1959 నవంబర్ 1 నాటికి ఆంధ్ర విశ్వవిదాయలయం నుంచి పూర్తి చేసారు. అది ఆయన పట్టుదలకు, విజ్ఞాన పిపాసకు నిదర్శనం. అంతకు ఆరు సంవత్సరాల ముందు1953లో జైపూర్ (రాజస్థాన్) లోని బనస్థలి విద్యాపీఠ్ నుంచి ఫ్రెస్కో పెయింటింగ్ కోర్సులో ఆయన సర్టిఫికేట్ పొందారు. 1955 డిసెంబర్‌లో హైదరాబాద్ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన తెలుగు పరీక్షలో (ప్రాంతీయ భాష పరీక్ష) ఆయనకు హయ్యర్ సర్టిఫికేట్ లభించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శేషగిరి రావును 1972 ఆగస్టు 10వ తేదీన ఆంధ్రప్రదేశ్ లలిత కళా అకాడమీ కోశాధికారిగా





నియమించింది. అయిదు సంవత్సరాలు ఆయన ఆ పదవిని నిర్వహించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం అకాడమిక్ కౌన్సిల్ సభ్యుడుగా ఆయన 1973 సెప్టెంబరు 19వ తేదీన రాష్ట్ర ప్రభుత్వంచే నియుక్తులయినారు.

చిత్రకళలో సిద్ధహస్తులయి సమున్నత శిఖరాలను అధిరోహించిన శేషగిరి రావును 1988-89 సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఢిల్లీలో సన్మానించింది. ఆల్ ఇండియా ఫైన్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ సొసైటీ 1988లో ఆయనను అఖిలభారత స్థాయిలో అగ్రగణ్య చిత్రకారుడుగా గుర్తించి గౌరవించింది. కేంద్ర ప్రభుత్వ మానవ వనరుల అభివృద్ధి శాఖ సాంస్కృతిక విభాగం 1988వ సంవత్సరంలో శేషగిరి రావును జాతీయ చిత్రకారుడుగా ప్రకటించి ఆయనకు ఎమిరిటస్ ఫెల్లోషిప్‌ను ప్రధానం చేసింది. 1993లో ఆయనకు రాజీవ్ రత్న అవార్డు లభించింది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం 1996 నవంబర్‌లో శేషగిరి రావును గౌరవ డాక్టరేటుతో గౌరవించింది. అగ్రశ్రేణి చిత్రకారుడుగా శేషగిరి రావు పొందిన బహుమతులు, అవార్డులు, సన్మానాలు అసంఖ్యాకం. ప్రాచ్య చిత్రకళా రీతిలో ఆయన ప్రజ్ఞకు 1949 నుంచే ఎన్నో బహుమానాలు లభించాయి. ఆల్‌ఇండియా ఆర్ట్ ఎగ్జిబిషన్, హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ, ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆయన ప్రతిభను తొలి దశలోనే గుర్తించి గౌరవించాయి. విభిన్న చిత్రకళా ప్రక్రియలలో శేషగిరి రావు చిత్రించిన వేలాది చిత్రాలలో సజీవ సౌందర్యం, సౌకుమార్యం, లావణ్యం, వర్ణ వైభవం తొణికిసలాడడం విశేషం. ఆయన గీసే ప్రతి గీతలో మనోల్లాసం కల్గించే మార్ధవం ఉట్టిపడడం ఒక ప్రత్యేకత, ఒక విశిష్ఠత. ఆయన చేతిలోని రంగుల కుంచె అప్రతిమాన హవణికలను, సొబగులను, సురభిళాలను కురిపిస్తుంది. ఆయన చిత్రించే ప్రతి చిత్రం ఘన సన్మానానికి అర్హమయినది. జాతీయ లలిత కళా అకాడమీ అధ్యక్షుడు మెహదీ నవాజ్‌జంగ్, జపాన్ ఎమిరటస్ ప్రొఫెసర్ మాడమ్ పుకూఅకినో, మాక్స్ ముల్లర్ భవన్ డైరెక్టర్ పీటర్ స్విట్, ప్రసిద్ధ సంపాదకుడు, చిత్రకళా విమర్శకుడు ఏ.ఎస్.రామన్, మాజీ ప్రధాన మంత్రి పి.వి.నర్సింహారావు, బిశ్వనాథ్ ముఖర్జి, ఎన్. బింద్రే, అనిల్‌రాయ్ చౌదరి, వై.కె.శుక్లా (బనస్థలి విద్యాపీఠ్), ఏ.పెరుమాళ్ (శాంతినికేతన్ మాజీ ప్రొఫెసర్), ప్రొఫెసర్ ఖండవల్లి లక్ష్మి రంజనం, రావి నారాయణ రెడ్డి, ఎస్.ఆర్. రామమూర్తి (రాష్ట్ర) విద్యాశాఖ మాజీ కార్యదర్శి, ప్రభృతులు ఎందరో శేషగిరిరావు చిత్రకళా వైదుష్యానికి నీరాజనం పట్టారు.

రాగరంజితమయిన, శక్తివంతమయిన రేఖలతో, రసభరితమయిన రంగుల కుంచెతో రమణీయ దృశ్యాలను, అనిర్వచనీయ స్నిగ్ధ సుందర లోకాలను సృష్టించిన చిత్రకారుడు శేషగిరి రావు విభిన్న చిత్రకళా ఫణితులపై ముఖ్యంగా జానపద చిత్రకళా రీతులపై

లోతుగా పరిశోధన జరుపడం, సచిత్ర విశ్లేషణతో పరిశోధనా వ్యాసాలు రచించడం, వినూత్న ప్రక్రియలను ఆవిష్కరించడం అద్వితీయ కృషి అనడంలో సందేహం లేదు. ఒక గ్రంథం రచించే ఉద్దేశంతో ఆయన దక్షిణ భారత దేశంలోని జానపద చిత్రకళా రీతులపై, ముగ్గులపై (రంగోలి) ఎంతో పరిశోధన జరిపి వేయికంటె మించిన డిజైన్లను సేకరించారు. ఆంధ్రదేశంలోని జానపద చిత్రకళపై ప్రత్యేకంగా పరిశోధన జరిపి (ఇరవై నాలుగు మారుమూల గ్రామాలలో) తెలంగాణ గ్రామాలలో ప్రాచుర్యం పొందిన 'కాకి పడిగెలు' చిత్రకళా రూపంపై ఆంధ్రప్రదేశ్ లలిత కళా అకాడమీకి నివేదిక సమర్పించారు. చైనా జపాన్ చిత్రకళా రీతులు, ప్రక్రియలపై శేషగిరి రావు కావించిన పరిశోధన గణనీయమయినది. ప్రకృతి సౌందర్యాన్ని, పక్షులను, జంతువులను, రాళ్ళు, గుట్టలను, చారిత్రక సంఘటనలను, నన్నయ, పోతన, వేమన, భక్తరామదాసు, అక్కన్న, మాదన్న, రుద్రమదేవి తదితర చారిత్రక ప్రముఖులను, ఆధునిక కాలపు మహనీయులను సజీవంగా చిత్రించడంలో బహుశ ఆయనకు ఆయనే సాటి అంటే అతిశయోక్తి కాదు. ఆయన చిత్రించిన 'తెలుగుతల్లి' తైలవర్ణ చిత్రం 1975 ప్రపంచ తెలుగు మహా సభలలో ప్రశంసలు పొందింది. కాళిదాసు శకుంతల కావ్యంలోని సంఘటనలు , సన్నివేశాలు శేషగిరిరావు రూపొందించిన అందమయిన చిత్రాలలో ప్రేక్షకులకు నయనానందం కల్గిస్తాయి. పెన్సిల్, రబ్బరు ఉపయోగించకుండా నేరుగా కుంచెను (బ్రష్) ఉపయోగించి అందలను ఒలికించడం ఆయన ప్రత్యేకత. వాటర్ పెయింటింగ్‌లో 'ఆక్వాటెక్స్చర్' ప్రక్రియను ఆయన స్వయంగా సృష్టించి ప్రవేశపెట్టారు. వాష్ అండ్ గోష్ ప్రక్రియలో గూడా ఆయన నిపుణుడు.

ఒక చిత్రకారుడు, అదీ తీరికలేని ఒక చిత్రకారుడు వివిధ చిత్రకళా రీతులు, సంప్రదాయాలపై మహత్తర పరిశోధన జరుపడం, చిత్రకళా రీతులు, ప్రక్రియలపై పుంఖాను పుంఖంగా ఆమూల్య వ్యాసాలు రచించడం (తెలుగులో, ఇంగ్లీషులో), వాటిని ఉన్నత ప్రమాణాలతో ప్రచురించడం అసాధారణ కృషి, శేషగిరి రావు ఇటువంటి అసాధారణ కృషి కొనసాగిస్తున్నారు. ఆదిమ చిత్రకళ, భిత్తి చిత్రకళ, దక్షిణ భారత దేశంలో జానపద చిత్రకళ తదితర అంశాలపై ఆయన లేఖిని నుంచి వెలువడిన రసవత్తర, విజ్ఞానప్రద రచనలు పత్రికలలో ప్రచురితమయినాయి. (భారతి వంటి పత్రికలలో గూడ), రేడియోలో ప్రసారమయినాయి. పుస్తక రూపంలో వెలువడినాయి. సమకాలీన ప్రసిద్ధ జానపద చిత్రకారుడి రాజయ్య చిత్రకళపై శేషగిరిరావు ఒక విశ్లేషణాత్మక వ్యాసం రచించారు. లేపాక్షి శిల్లాపై, అమృత్ షేర్‌గిల్ చిత్రకళపై, ఆంధ్ర చిత్రకారుల చిత్రకళా రీతులపై, (సమకాలీన చిత్రకళాభివృద్ధి), భారత దేశంలో చిత్రకళా బోధనపై శేషగిరి రావు రచనలు

పలువురి ప్రశంసలు పొందాయి. ఆంధ్ర చిత్రకారులను పరిచయం చేస్తూ సమకాలీన చిత్రకళాభివృద్ధిపై శేషగిరి రావు రచించిన వివరణాత్మక విపుల వ్యాసం భారత జాతీయ కాంగ్రెస్ 71వ మహాసభ(1968) ప్రత్యేక సంచికలో ప్రచురితమయింది. లక్నో నుంచి ప్రచురితమయ్యే ఒక ప్రసిద్ధ పత్రిక ఈ వ్యాసం హిందీ అనువాదాన్ని ప్రచురించింది. సుప్రసిద్ధ కవి వానమామల వరదాచార్యులు రచించిన పోతన చరిత్ర కావ్యంపై 'చిత్రమయ కావ్యము' శీర్షికతో శేషగిరి రావు రచించిన వ్యాసం కమనీయమయినది. మహమ్మదీయ చిత్రకారులు, విమర్శ ప్రమాణాలు–ఆదునిక చిత్రకారులు, చిత్రకళా ప్రగతి, అడవి బాపిరాజు చిత్రకళ, తెలుగ వారి చిత్రకళా వైభవం, పాస్టెల్ చిత్ర రచన, చిత్రకళలో శ్రీ కృష్ణుడు, వివిధ కళా ప్రక్రియలు–అభ్యున్నతికి మార్గాలు తదితర అనేక అంశాలు శేషగిరి రావు రచనలకు వస్తువులైనాయి. అనేక పత్రికలలో, సంచికలలో, అభినందన సంచికలలో చిత్రకళా రీతులపై, చిత్రకారులపై శేషగిరి రావు రచనలు, చిత్రాలు ప్రచురితమయినాయి. సంగ్రహ ఆంధ్ర విజ్ఞాన కోశం (ఖండవల్లి లక్ష్మీ రంజనం ఆధ్వర్యంలో వెలువడిన విజ్ఞాన సర్వస్వ సంపుటాలు) ఎనిమిదవ సంపుటిలో చిత్రకళా విభాగానికి సంపాదకత్వం వహించారు. లేపాక్షి, తాడిపత్రి, హంపి శిల్పాల రేఖా చిత్రాలతో ఆయన 'రూప రుచి' సంపుటాన్ని, 'సురేఖ' రెండు సంపుటాలను ప్రచురించారు. చిత్రకళ రేఖలను శాస్త్రీయంగా అవలోకించి ఆయన 'రేఖార్ణవం' గ్రంథం రచించారు. శేషగిరి రావు చిత్రాలు ఇంగ్లీషులో గూడ ప్రచురితమవుతున్నాయి.

ప్రభుత్వాల , కొన్ని సంస్థల అభ్యర్థనపై శేషగిరి రావు రూపొందించిన చిత్రాలు మరువలేనివి. ఆయన కల్పనాగరిమకు, చిత్రకళా నైపుణ్యానికి అవి ప్రతీకలు. భక్తకవి పోతన పంచ జయంతి ఉత్సవ సందర్భాన శేషగిరి రావు చిత్రించిన పోతన చిత్రాన్ని అప్పటి విదేశఅంగ మంత్రి పి.వి. నరసింహారావు 1982 మార్చితో వరంగల్లులో ఆవిష్కరించారు. పరమ భక్తుడు పోతన వ్యక్తిత్వం, స్వరూపం, తేజస్సు ఆ తైలవర్ణ చిత్రంలో ప్రదర్శితమయినాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక శాఖ కోర్కెపై ఆయన 'తెలుగు వెలుగులు' చిత్రాన్ని స్ఫూర్తి దాయకంగా రూపొందిమచారు.

రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థనపై ఆయన హైదరాబాద్, బెంగులూరు, భావనగర్ కాంగ్రెస్ మహాసభల సందర్భాన ఆంధ్ర ప్రదేశ్ పవిలియన్లలో బృహత్తర కుడ్య చిత్రాలను చిత్రించి మన్ననలు పొందారు. రాష్ట్ర హరిజన మహాసభ వేదికపై బ్యాక్ డ్రాప్‌గా శేషగిరి రావు రూపొందించిన కుడ్య చిత్రం చూపరులకు ఉత్తేజం కల్గించింది. రాష్ట్ర ప్రభుత్వం కోరగా ఆయన ఢిల్లీలో గాంధీ దర్శన్‌లో చక్కని కుడ్య చిత్రాన్ని రూపొందించారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ఆయన చిత్రించిన ప్రముఖుల చిత్రాలు గత చరిత్రకు సజీవ జ్ఞాపికలు.

ఢిల్లీలో, హైద్రాబాద్‌లో ప్రదర్శనకు శేషగిరి రావు రాష్ట్రప్రభుత్వ టాబ్లోలను చిత్రించి రూపొందించారు. హైదరాబాద్ నగరంలోని భారతీయ విద్యాభవన్ కేంద్రంలో రెండు, మైత్రీవనం వాణిజ్య సముదాయంలో రెండు భారీ కుడ్య చిత్రాలను శేషగిరి రావు చిత్రించారు. ఉస్మానియా విశ్వ విద్యాలయం కంప్యూటర్ సైన్స్ కాలేజీలో, పటోడియా స్పిన్నింగ్ మిల్స్‌డలో, ఇతర భవనాలలో శేషగిరి రావు చిత్రాలు ఆలోచనలను రేకిత్తిస్తూ అందాలను విరజిమ్ముతున్నాయి. హైదరాబాద్ విముక్తి సమరాన్ని శేషగిరి రావు ఒక బృహత్తర చిత్రంలో ప్రతిబింబించారు. కవులు, రచయితల గ్రంధాలకు, పత్రికలకు, ప్రత్యేక సంచికలకు, గ్రీటింగ్ కార్డులకు, వివాహ ఆహ్వాన పత్రికలకు, పలు సంస్థల మోనోగ్రాములకు, లోగోలకు, చిహ్నాలకు శేషగిరి రావు చిత్రాలు, డిజైనులు ప్రత్యేక శోభను, విలువను సంతరింపజేసాయి. శేషగిరి రావు ఒక తపస్సుగా భావించి సృష్టించిన వేలాది చిత్రాలలో వెలుగుచూడనివి ఇంకెన్నో ఉన్నాయి. ఒంటరిగా, ఇతరులతో కలిసి ఆయన నిర్వహించిన చిత్రకళా ప్రదర్శనలు కళాభిమానులకు, విమర్శకులకు కనువిందు చేస్తున్నాయి. 2003 జనవరి 14వ తేదీన మాదాపూర్ శిల్పకళా వేదికలో ఆయన జరిపిన పెయింటింగ్ ప్రదర్శన అపూర్వమైనది. శేషగిరి రావు చిత్రకళా ప్రతిభలో, ఉన్నత వ్యక్తిత్వంలో సౌకుమార్యం, లాలిత్యం, మనోజ్ఞత, మాధుర్యం, సురభిళత్వం, మార్ధవం, లావణ్యం ప్రత్యేక ఆకర్షణలు, అలంకారాలు. ఆయురారోగ్యాలతో ఆయన చిత్రకళా రంగానికి ఇంకెన్నో అమూల్య సంపదలను అందించాలని ఆశించనివారుండరు.

***– దేవులపల్లి ప్రభాకరరావు***

ప్రజాతంత్ర, 04/08/2003



# కళా స్రష్టలకు నివాళి

తెలుగు కళామతల్లి నాల్గురోజుల వ్యవధిలో ఇద్దరు ఉత్తమ పుత్రులను కోల్పోయి విషణ్ణవదన అయింది. ఒక జాతి సాంస్కృతిక వారసత్వానికి, ఔన్నత్యానికి నిలువుటద్దం దాని కళా సంపద, ప్రాభవం. శిల్పసంపదతో పాటు చిత్రలేఖనం, నాట్యం పరంపరాగత కళలేగాక కళోపాసకుల సృజనశీలతతో కొత్త పుంతలు తొక్కుతుంటాయి. ఆధునికతను, సమకాలీనతను సంతరించుకుంటూ వుంటాయి. సాంప్రదాయకతను స్వీకరిస్తూనే ఆధునికరీతుల రంగులద్ది వర్తమానంలో జీవిస్తూ భవిష్యత్ తరాలసాంస్కృతిక, ఆత్మిక వికాసానికి, మానసికోల్లాసానికి ప్రాతిపదికలు నిర్మిస్తాయి. అటువంటి రెండు కళారూపాలకు జీవంపోసి, జీవనాధారం చేసుకుని శిష్య ప్రసిష్యులతో అజరామర కీర్తినార్జించిన కళాస్రష్టలు కొండపల్లి శేషగిరిరావు, వెంపటి చినసత్యం. ఇరువురూ వారు ఎంచుకున్న మార్గంలో సిద్ధహస్తులు, లబ్ధ ప్రతిష్టులు. శేషగిరిరావు చేతిలోని కుంచె అద్భుత కళాఖండాలు సృష్టించగా, వెంపటివారి నర్తనం తెలుగువారి 'కూచిపూడి' నాట్యానికి ఖండాంతర ఖ్యాతి ఆర్జించింది. ఇరువురూ ఎనభై పదులు పైబడిన నిండు జీవితం జీవించినవారే. వారు ఆ జీవితాన్ని సార్థకం చేసుకున్న సృజనశీలురు. మట్టిలో మాణిక్యాలు, చిరంజీవులు. గురువారం తెల్లవారుఝామున కన్నుమూసిన కొండపల్లి శేషగిరిరావు (89 సం॥) జన్మస్థలం వరంగల్ జిల్లా మహబూబాబాద్ మండలం పెనుకొండ గ్రామం. ఆంధ్రా యూనివర్శిటీ, రాజస్థాన్ బనస్థలి విద్యాపీఠ్, హైదరాబాద్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్‌లో విద్యాభ్యాసం చేసిన శేషగిరిరావు శాంతినికేతన్‌లో నందలాల్‌బోస్ శిష్యరికంలో చిత్రకళను ఔపోసన పట్టారు. ప్రకృతిని ప్రేమించే చిత్రకారునిగా ఆరంభమైన ఆయన జీవితం పౌరాణిక, ఇతిహాస ముద్రలగుండా ప్రయాణించి సమకాలీన జీవిత చిత్రణవైపు మరలింది. నిజాం నిరంకుశ పాలనలో జీవించిన ఆయన ఆ కర్కశపాలనకు వ్యతిరేకంగా ప్రజా తిరుగుబాటును సైతం కళ్ళకుగట్టినట్లు చిత్రించారు. రైతాంగ సాయుధ పోరాటంతోపాటు ఆర్యసమాజ్ మొదలు కాంగ్రెస్ వరకు నిజాం వ్యతిరేక ప్రజాపోరాటంలోని భిన్నపార్శ్వాలను ఎంతో సృజనాత్మకంగా చిత్రించారు. తెలంగాణ కాకిపడగలు, రామప్ప దేవాలయం విశిష్టతను తనకుంచెతో హృద్యమంగా చిత్రించిన

తొలి చిత్రకారుడు ఆయనే. తెలుగు చిత్రకళను, అంతర్జాతీయ వేదికమీద సగౌరవంగా ఆవిష్కరించిన కొద్దిమంది చిత్రకారులలో గణ్యుడు శేషగిరిరావు. 1975లో రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభలో చూపరులను ఇట్టే ఆకట్టుకున్న "తెలుగుతల్లి" చిత్రపటం ఆయన సృజనకు దర్పణంగా నిలిచింది. ఎన్నో పురస్కారాలు ఆయన్ను వెదుక్కుంటూ వచ్చాయి. 1988లో కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ ప్రధానం చేసిన ఎమిరిటస్ ఫెలోషిప్, తెలుగు విశ్వవిద్యాలయం వారి గౌరవ పురస్కారం డాక్టరేట్, ప్రతిష్టాత్మక హంస అవార్డు ఎన్నదగినవి. సాంకేతిక, వృత్తి విద్యలవైపు పరుగుతో సాంప్రదాయ కళలు కనుమరుగయ్యే నేటి పరిస్థితుల్లో ప్రతి జిల్లాలో ఫైన్ ఆర్ట్స్ కాలేజీలను ప్రారంభించి కళాకారులను ప్రోత్సహించడంతోపాటు మన కళలను బతికించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

ఆదివారం తెల్లవారుఝామున చెన్నైలో కన్నుమూసిన నాట్యాచార్యులు, పద్మభూషణ్ వెంపటి చినసత్యం (82 సం॥) పేరు విననివారుండరు. కృష్ణాజిల్లా దివి తాలుకాలోని కూచిపూడి గ్రామం సిద్ధేంద్రయోగి ఆవిష్కృతంగా చెప్పబడే నాట్యరీతికి పుట్టినిల్లు. అదే కూచిపూడి నాట్యరీతిగా ప్రసిద్ధమైంది. భాగవతులు వంశపారంపర్యంగా సాధనచేస్తూ బతికించుకుంటూ వస్తున్న ఆ నాట్యానికి ప్రపంచ ప్రఖ్యాతి తెచ్చిపెట్టినవారు చిన సత్యం. ఈ నాట్యంలో ఒకప్పుడు ఆడవారికి ప్రవేశం లేదంటే ఆధునిక తరాలు నమ్మలేరు. సాంప్రదాయక పౌరాణిక కథా వస్తువులతో సాగే ప్రదర్శనలో సాంప్రదాయక పౌరాణిక కథావస్తువులతో సాగే ప్రదర్శనలో మగవారే స్త్రీ పాత్రలు పోషించేవారు. అటువంటి ఛాందసాలను వదిలించి, సరికొత్త నృత్య నాటికలను రూపొందించి 'కూచిపూడి' నాట్యానికి కొత్త రక్తం ఎక్కించి, ఆకర్షణీయం చేసి బహుళ ప్రాచుర్యం కలిగించిన వారు సత్యం. ఆంధ్రుల పారంపర్య నృత్యమైన 'కూచిపూడి' కనుమరుగయ్యే దశలో దాన్ని పునరుజ్జీవింపజేసేందుకు చినసత్యం కృషి నిరుపమానం, అనితర సాధ్యం. అదొక అశిధారావ్రతం. భారతీయ శాస్త్రీయ నృత్యాల్లో చిన్నచూపుకు గురవుతున్న 'కూచిపూడి' రీతి సశాస్త్రీయతను నిరూపించి దానికి భారత ప్రభుత్వ గుర్తింపు పొందటంలో ఆయన చేసిన కృషి ఆధునిక నాట్యాచార్యుల్లో అగ్రతాంబూలానికి అర్హుణ్ణిగావించింది. 1947లో మద్రాసు చేరి సోదరుడు పెదసత్యం వద్ద సినిమాలలో నృత్య దర్శకునిగా పనిచేసినప్పటికీ ఆయన దృష్టి అంతా 'కూచిపూడి' నాట్య విశిష్టత మీదే లగ్నమైంది. '1963లో మద్రాసు టీనగర్‌లో ఆయన నెలకొల్పిన కూచిపూడి ఆర్ట్ అకాడమీ' ఆయన జీవిత లక్ష్య సాధనకు సోపానమైంది. భరతనాట్యం ప్రభావం ఎక్కువగా ఉన్న మద్రాసులో, 'కూచిపూడి'కి సముచిత స్థానం సంపాదించేందుకు నడుంకట్టారు. పాతికేళ్ళ కృషి 'కూచిపూడి'ని అంతర్జాతీయ

స్థాయికి తీసుకెళ్ళింది. ఆయన వద్ద శిక్షణ పొందినవారిలో విదేశీయుల సంఖ్యకూడా గణనీయం.

పురాణ ఘట్టాలకు సృజనాత్మకతను జోడించి ఎంతో హృద్యమంగా చినసత్యం రూపొందించిన నృత్యరూపకాలలో శ్రీకృష్ణ పారిజాతం, శ్రీనివాస కళ్యాణం, రుక్మిణి కళ్యాణం, చండాలిక, అర్ధనారీశ్వరం, హరవిలాసం, రామాయణం, క్షీరసాగరమథనం, కిరాతార్జునీయం రసజ్ఞుల ప్రశంసలు పొందాయి. దేశవిదేశాల్లో అసంఖ్యాకంగా ప్రదర్శనలిచ్చారు. 2011లో హైదరాబాద్‌లో 2800మంది కళాకారులతో ఏకకాలంలో నిర్వహించిన అంతర్జాతీయ కూచిపూడి నృత్య కార్యక్రమంతో గిన్నీస్ రికార్డు నెలకొల్పారు. చినసత్యంగారికి ఆంధ్ర విశ్వవిద్యాలయం 1980లో గౌరవ డాక్టరేట్, కళాప్రపూర్ణ బిరుదు ప్రధానం చేయగా, భారత ప్రభుత్వం 1998లో 'పద్మభూషణ్'తో సత్కరించింది. 'భరణి కళా ప్రపూర్ణ' సహా నాట్యరంగంలో అందుకున్న పురస్కారాలు మరెన్నో. కూచిపూడి నృత్యమే తన శ్వాసగా జీవితాంతం శ్రమించి ఎందరో నర్తక, నర్తకీమణులను తయారుచేసి, ఆ నాట్యరీతికి భారతీయ నాట్యరీతుల్లో సముచిత స్థానం ఆర్జించిపెట్టిన వెంపటి చినసత్యం స్మృతి శాశ్వతం. ఆయన శిష్యకోటి ఆయన కృషికి సజీవ దర్పణాలు. కూచిపూడి నాట్యం సజీవంగా ఉన్నంతవరకు వెంపటి చినసత్యం చిరంజీవి.

31/07/2012 *ఎడిటోరియల్* – ***విశాలాంధ్ర***



*16-11-1996 నాడు అప్పటి గవర్నర్ కృష్ణకాంత్ గారి చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న శేషగిరిరావు*

అవగాహన పెంచుకుందాం! చైతన్యవంతులను చేద్దాం!!

## సమస్యల పుట్ట తెలంగాణ
## కాగడా పట్టి చూసినా కానరాని అభివృద్ధి
## ఆయా అంశాల గురించి చర్చిద్దాం
## వాస్తవాలను వెలికితీద్దాం
## వాటిని నలుగురికీ చాటి చెబుదాం

మన వేదన ప్రపంచానికి తెలియాలంటే ఆ వేదన ఏమిటో స్పష్టంగా అవతలి వారికి వెల్లడించగలగాలి. అంతే తప్ప మూగజీవిలా బాధపడుతూ ఉంటే మన బాధ ఏమిటో అవతలి వారికి తెలియదు. పట్టించుకునే వారు ఉండరు. నేడు తెలంగాణలో ఎన్నో సమస్యలు. అలాంటి వాటిని ఒక్కో దాని గురించి అవగాహన కల్పించే ప్రయత్నమే ఈ చర్చ. ఈ చర్చలో పాల్గొనడం ద్వారా భావజాలవ్యాప్తికి అవసరమైన సమాచారాన్ని పొందవచ్చు. ఎదుటివారితో వాదనల్లో నెగ్గవచ్చు. వారి ఆలోచనల్లో మార్పు తీసుకురావచ్చు. సరికొత్త సమాజాన్ని సృష్టించవచ్చు. అందుకు బాట వేసేదే టి.ఆర్.సి 'చర్చ'.

**టి.ఆర్.సి. చర్చ**

TRC CHARCHA

**ప్రతి శనివారం సా|| 4 గం||ల 30 ని||లకు**

**ఒక్కో వారం...ఒక్కో అంశం**

**రండి! చర్చిద్దాం...**

TELANGANA RESOURCE CENTRE

**"చంద్రం" 490, స్ట్రీట్ నం. 11,**
**హిమాయత్ నగర్, హైదరాబాద్ - 500 029.**
**ఫోన్ : 040-64524554 ఫ్యాక్స్ : 040-27635644**
E-mail: trchyd@gmail.com
website : www.trchyd.org



చందాదారులుగా చేరండి! చందాదారులను చేర్పించండి!!

## మీ సహకారం మాకెంతో ముఖ్యం!

ఒక మాసపత్రికను తీసుకురావడం ఎంత కష్టమో అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో వనరులు తక్కువే అయినప్పటికీ, ఒక మహత్తర సంకల్పంతో ఆరంభమైన దక్కన్‌ల్యాండ్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. అందుకే మీ అమూల్య సహకారాన్ని మేము కోరుతున్నాం.

పత్రికకు అధిక సంఖ్యలో చందాదారులను చేర్పించడం ద్వారా, వాణిజ్య ప్రకటనలు అందించడం ద్వారా మీరు మీ సహకారాన్ని అందించవచ్చు. ముఖ్యంగా సమాజాన్ని చైతన్యవంతులను చేయగల శక్తిసామర్థ్యాలున్న మేధావి, ఉపాధ్యాయ, అధ్యాపక, ఉద్యోగవర్గాలకు చెందిన వారు ఈ బాధ్య తను స్వీకరించాల్సిందిగా కోరుతున్నాం.

పత్రిక ప్రతీ పాఠకుడు మరో పది మందిని చందాదారుల రూపంలో పాఠకులుగా మార్చేందుకు ప్రయత్నించాలి.

- వార్షిక చందా (రూ. 150) రూపంలో దక్కన్‌ల్యాండ్‌ను మీకు తెలిసిన వారికి బహుమతిగా ఇవ్వవచ్చు.
- ఉద్యోగసంఘాల వారు తమ సభ్యుల కోసం ఏకమొత్తంగా నిర్దిష్ట సంఖ్యలో వార్షిక చందాలను చెల్లించవచ్చు.
- చందాలను దక్కన్‌ల్యాండ్ పేరిట డి.డి. లేదా చెక్కు, యం.ఓ. రూపంలో హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యేవిధంగా పంపించవచ్చు.

**మా చిరునామా:**

TELANGANA RESOURCE CENTRE

DECCAN LAND
**"CHANDRAM"** 490, St.No. 11,
Himayatnagar, Hyderabad - 500 029.
Tel.No. 040-64524554, Fax: 040-27635644,
Mobile: 9030626288


## తెలంగాణ రిసోర్స్ సెంటర్ ప్రచురించిన సంకలనాలు

**నెగడు**

1. ప్రజల్ని విస్మరించిన శ్రీ కృష్ణ నివేదిక
2. 8వ అధ్యాయంలో ఏముంది?
3. అణచివేత ఉరఫ్ '177' జీవో
4. తెలంగాణ జీవనది ప్రొ|| జయశంకర్
5. సీమాంధ్ర రాజకీయ నాయకుల కుట్ర ఉరఫ్ '14 ఎఫ్'
6. తెలంగాణ సాధనకై మిలియన్ మార్చ్
7. తెలంగాణ సాధనకై సకల జనుల సమ్మె (మొదటి భాగం)
8. తెలంగాణ సాధనకై సకల జనుల సమ్మె (రెండవ భాగం)
9. మానవ ప్రకృతి విధ్వంసం పోలవరం (మొదటి భాగం)
10. మానవ ప్రకృతి విధ్వంసం పోలవరం (రెండవ భాగం)
11. బలిదానాలు వద్దు బతికి సాధిద్దాం

**మనిషి**

1. జానపద గోపురం
   డా|| గోపు లింగారెడ్డి
2. హక్కుల గొంతుక
   ప్రొ|| బుర్రా రాములు
3. ప్రజల మనిషి
   కె.జి. కన్నబిరాన్
4. తెలంగాణ కళాత్మహృదయం
   డాక్టర్ కాపు రాజయ్య

చిత్రాన్ని నీవు చూస్తున్నప్పుడు, చిత్రం కూడా నీ స్థాయిని చూస్తుంది. భూత భవిష్యత్తు వర్తమాన కాలాలను అటు రసరమ్యంగా, ఇటు విజ్ఞానదాయకంగా బంధించగలిగే అద్భుతశక్తి కొద్ది మందికి మాత్రమే ఉంటుంది. కష్టాలకడలిలో జీవితాన్ని మదించి అమృత చిత్రాలను ప్రపంచానికి అందించిన గొప్ప తెలుగు కళామూర్తి కొండపల్లి శేషగిరిరావు గారు.

– వనమాలి



డాక్టర్ కొండపల్లి శేషగిరిరావు
1924 - 2012

## మాంత్రికా నీకు నమస్సులయ్యా!

సరస రేకా చిత్ర సాహిత్యమును గూర్చు
నీదు కుంచియ కభివాదమయ్యా
అప్సరసల భువిని కవతరింపగ జేయు
మాంత్రికా నీకు నమస్సులయ్యా
విమల వేదాంత సద్వీధుల విహరించు
బ్రహ్మజ్ఞ నీకివే ప్రణతులయ్యా
అమల సంగీత సుధాంబోధిలోదేలు
ఆర్యవర్యా నీకు నైదుపదులు

భాగ్యనగరీ కళాభవ్యభావ దివ్య
నందన వనాంతర స్థిత నవ వదాత్త
పారిజాత ప్రసవ మత్త బంభరాభ
సరస కవితా విధేయ శేషగిరి రాయ!

*కొండపల్లి శేషగిరిరావుగారిని ప్రస్తుతిస్తూ ఈ పద్యాలను ఆశువుగా చెప్పిన కవిత్రయం*

*– దాశరథి కృష్ణమాచార్యగారు*

*డా॥ బిరుదురాజు రామరాజుగారు*

*డా॥ సి. నారాయణరెడ్డిగారు*

TRC
TELANGANA
RESOURCE CENTRE

"CHANDRAM" 490, St.No.11, Himayatnagar, Hyderabad-29, Mobile: 9030626288 Fax: 040-27635644
E-mail: trchyd@gmail.com Website: www.trchyd.org